


ESTD: 1999

www.voodayam.com

# వుదయం




ఖమ్మం | 03-04-2026 శుక్రవారం | సంపుటి : 13 | సంచిక : 265 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 1.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously published from Khammam, Hyderabad, Adilabad, Karimnagar, Guntur & Warangal

Follow us on

# విభజన విభేదం

## ఎపి, తెలంగాణ ఆస్తుల పంపకం పూర్తి కాకపోవడంపై పార్లమెంట్‌లో ఆందోళన

- తెలంగాణపై నిర్లక్ష్యమేల? ● 12 ఏళ్లయినా విభజన హామీల అమలు లేదు
- కేంద్రాన్ని నిలదీసిన తెలంగాణ ఎంపీలు ● లోక్‌సభ వేదికగా వేడెక్కిన రాష్ట్ర రాజకీయాలు
- రాజ్యసభలో అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చలో తెలంగాణ ఎంపీల గళం
- జాప్యంపై వివరణ ఇవ్వాలని రేణుకా చౌదరి డిమాండ్
- విభజన హామీలన్నీ అమలు చేయాల్సిందే
- ఏపీలో.. తెలంగాణ మండలాల విలీనంపై నిలదీసిన బీఆర్ఎస్ ఎంపీ సురేశ్‌రెడ్డి
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి, పలువురు ఎంపీలకు వాగ్వాదం



*గురువారం రాజ్యసభ అట్టుడికింది. ఉమ్మడి రాష్ట్రం విడిపోయిన తరువాత ఎప్పుడూ లేనంతగా తెలంగాణ, ఎపి పార్లమెంట్ సభ్యుల మధ్య మాటల యుద్ధం తీవ్రరూపం దాల్చింది. అమరావతి చట్టబద్ధత బిల్లు పై చర్చ సమయంలో విభజన హామీలపై తెలంగాణ, ఎపి ఎంపిలు తీవ్రస్థాయిలో గళమెత్తారు. విభజన సమయంలో ఇచ్చిన హామీల్లో అమలుకాని వాటిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.*

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (వుదయం బ్యూరో) :** లోక్‌సభ వేదికగా తెలంగాణ రాజకీయాలు వేడెక్కాయి. తెలంగాణ ఏర్పడి 12 ఏండ్లు అవుతోన్నా అమలుకు నోచుకోని రాష్ట్ర విభజన హామీలు.. ఏపీకి కేంద్రం ఇస్తోన్న ప్రాధాన్యతపై తెలంగాణకు చెందిన ఎంపీలు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. గురువారం రాజ్యసభలో అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చ సమయంలో విభజన హామీలపై గళమెత్తారు. విభజన సమయంలో ఇచ్చిన హామీల్లో అమలుకాని వాటిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ సైతం విభజన సమయంలో కేంద్రం అనాలోచితంగా వ్యవహరించిన తీరును ఎండగట్టే ప్రయత్నం చేసింది. దీంతో కేంద్రం తరుపున తెలంగాణ ఎంపీ కిషన్ రెడ్డి అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యులకు గట్టి కౌంటర్ ఇచ్చే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఆయా పార్టీల ఎంపీల మధ్య వాగ్వాదం తారాస్థాయికి చేరుకుంది. కాసేపు సభలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.


**12 యేండ్లయినా.. ఆస్తుల పంపకాలు పూర్తి కాలేదు : ఎంపి రేణుకా చౌదరి**

విభజన హామీలన్నీ అమలు చేయాల్సిందే : విభజన సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి గుర్తు చేశారు. విభజన హామీలన్నీ అమలు చేయాల్సిందేనన్న ఆమె ఇప్పటి వరకు హామీలు ఎందుకు నెరవేర్చలేదో చెప్పాలని డిమాండ్ చేశారు.

మిగతా 2లో

## మౌలిక సదుపాయాల ధ్వంసం దిశగా

# యుద్ధం



- డిజిటల్, భౌతిక మౌలిక సదుపాయాల వైపు మళ్లడంతో ఆందోళనలు
- ప్రపంచ దేశాలకు ఆందోళన రేకెత్తిస్తున్న యుద్ధం
- బహ్రెయిన్‌లోని అమెజాన్ వెబ్ సర్వీసెస్ క్లౌడ్ కంప్యూటింగ్ డేటా సెంటర్‌పై బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపడిన ఇరాన్ గస్తీ దళం
- మైక్రోసాఫ్ట్, గూగుల్, యాపిల్, మెటా వంటి 18 అమెరికన్ సాఫ్ట్‌వేర్ దిగ్గజాలను తీవ్రవాద సంస్థలుగా ప్రకటించిన ఇరాన్
- ఇరాన్ సైనిక శక్తి ఇప్పటికే నామరూపాల్లేకుండా పోయింది : ట్రంప్
- రాబోయే రెండు నుండి మూడు వారాల్లో తీవ్రమైన దాడులు ఉంటాయి

**వుదయం డెస్క్, ఏప్రిల్ 2 :** యుఎస్–ఇరాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధం మరింత తీవ్ర దశలోకి ప్రవేశించడంతో, పశ్చిమాసియా వ్యాప్తంగా ఉద్రిక్తతలు నాటకీయంగా పెరిగాయి. ఈ సంఘర్షణ పలు దేశాలకు వ్యాపించి, ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు రేకెత్తిస్తోంది. ముఖ్యంగా, ఇది డిజిటల్, భౌతిక మౌలిక సదుపాయాల వైపు మళ్లడంతో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. బహ్రెయిన్‌లోని అమెజాన్ వెబ్ సర్వీసెస్ క్లౌడ్ కంప్యూటింగ్ డేటా సెంటర్‌పై ఇరాన్ విప్లవాత్మక గస్తీ దళం (ఐఆర్‌జిసి) బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపడింది. ఈ దాడిలో డేటా సెంటర్‌లోని సర్వర్లు తీవ్రంగా దెబ్బతినడంతో గల్ఫ్ ప్రాంత వ్యాప్తంగా క్లౌడ్ సేవలకు భారీ అంతరాయం ఏర్పడినట్లు తెలుస్తోంది. అమెరికా, ఇజ్రాయెల్ నిఘా, సైనిక కార్యకలాపాలకు ఈ డేటా సెంటర్లు సహకరిస్తున్నాయనే నెపంతో ఇరాన్ ఈ దాడులకు పాల్పడినట్లు సమాచారం. కేవలం అమెజాన్ మాత్రమే కాకుండా, మైక్రోసాఫ్ట్, గూగుల్, యాపిల్, మెటా వంటి 18 అమెరికన్ సాఫ్ట్‌వేర్ దిగ్గజాలను తీవ్రవాద సంస్థలుగా ఇరాన్ ప్రకటించింది. తమ దేశంపై జరుగుతున్న దాడులకు ప్రతీకారంగా ఈ కంపెనీల ప్రాంతీయ కార్యాలయాలను కూడా లక్ష్యంగా చేసుకుంటామని, అక్కడి ఉద్యోగులు వెంటనే ప్రాణాలు కాపాడుకోవడానికి బయటకు రావాలని ఇరాన్ హెచ్చరించడం సంచలనం సృష్టించింది.

మిగతా 2లో

### కఠినంగా స్పందించిన ట్రంప్



*ఈ దాడులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యంత కఠినంగా స్పందించారు. బుధవారం రాత్రి జాతిని ఉద్దేశించి ప్రసంగించిన ఆయన, ఇరాన్ సైనిక శక్తి ఇప్పటికే నామరూపాల్లేకుండా పోయిందని ప్రకటించారు. ఇరాన్ నౌకాదళం సముద్ర గర్భంలో ఉంది, వారి వైమానిక దళం శిథిలావస్థకు చేరింది. వారి అగ్ర నాయకత్వం అంతమైంది అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్ తన వ్యూహాత్మక సామర్థ్యాన్ని తిరిగి పొందడానికి 15 నుంచి 20 ఏళ్లు పడుతుందని, ప్రస్తుతం ఆ దేశం ఒక పనికిరాని సైనిక వ్యవస్థగా మారిందని ఆయన ఎద్దేవా చేశారు. అమెరికన్ వాణిజ్య సంస్థలపై దాడులు చేయడం ద్వారా ఇరాన్ తన వినాశనాన్ని తానే కొనితెచ్చుకుంటోందని ట్రంప్ హెచ్చరించారు.*

## చేనేత కార్మికుల పొట్ట కొడుతున్న కాంగ్రెస్

- టెస్కో నుంచి రూ. 105 కోట్ల యూనిఫాం టెండర్ రద్దు వెనక మతలబేంటి?
- ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్



**హైదరాబాద్, ఏప్రిల్ 2 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్ర ప్రభుత్వ సంస్థ టెస్కోకు ఆర్డర్లు రద్దు చేసి ప్రైవేట్ కంపెనీలకు ఇస్తోన్న కాంగ్రెస్ సర్కార్... చేనేత సంఘాల కార్మికుల పొట్ట కొడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ చేనేత సహకార సంఘం (టెస్కో) నుంచి రూ.105 కోట్ల విలువ గల స్కూల్ యూనిఫామ్ ఆర్డర్‌ను వెనక్కి తీసుకోవడం వెనుక మతలబు ఏంటి? అని నిలదీశారు. సంక్షేమ శాఖ నుండి టెస్కోకు దక్కాల్సిన రూ.200 కోట్ల దుస్తులు, దుప్పట్ల ఆర్డర్ ఇంకా ఇవ్వకపోవడం వెనుక కారణం ఏంటి? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2026– 27 విద్యా సంవత్సరంలో పాఠశాల విద్యార్థులకు ఏక రూప దుస్తుల తయారీకి ఇచ్చిన రూ.105.54 కోట్ల ఆర్డర్ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం ఈ నెల 1న చేనేత శాఖకు లేఖ రాసింది. ప్రభుత్వ నిర్ణయంపై మండిపడ్డ కేటీఆర్.. గురువారం సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

మిగతా 2లో

## ఆ పనులను త్వరగా పూర్తి చేయండి

- సీఎం రేవంత్ రెడ్డి
- ఫ్యూచర్ సిటీ కార్యాలయం, స్కిల్ యూనివర్సిటీ భవన నిర్మాణ పనుల పరిశీలన

**హైదరాబాద్, ఏప్రిల్ 2 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్ర రాజధాని శివారులో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన ఫ్యూచర్ సిటీ కార్యాలయం, స్కిల్ యూనివర్సిటీ భవనాలను త్వరగా పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్ సిటీలో నిర్మాణాల పురోగతిని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పనులకు సంబంధించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేట్‌లో 20 ఎకరాల్లో రు.19 కోట్లతో భారత్ ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సిడిఎ) కార్యాలయానికి గతేడాది సెప్టెంబర్‌లో సీఎం రేవంత్ రెడ్డి పునాది రాయి వేశారు.

## చేనేత కార్మికులకు నష్టం చేస్తే ఊరుకునేది లేదు

- కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోంది
- విద్యార్థుల యూనిఫాంల ఆర్డర్‌ను ఏకపక్షంగా రద్దు చేయడం దుర్మార్గం
- కావాల్సిన వారికి మేలు చేసేందుకు చేనేత కార్మికులకు అన్యాయం
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

2

# తెలంగాణకు రండి

## ఆరు గ్యారంటీలపై సందేహాలు తీర్చుకోండి



- *కేరళంలో పినరయి విజయన్ హయాం ముగిసింది*
- *ఇక యూడిఎఫ్ స్వర్ణయుగం మొదలవుతుంది*
- *కేంద్ర నిధులు మోడీ కరుణ కాదు, ప్రజల హక్కు*
- *2023లో తెలంగాణలో మాదిరి మార్పులే ఈసారి కేరళంలో చోటుచేసుకుంటాయి*
- *మోడీలా మాట్లాడటం నాకు సాధ్యం కాదు, విమర్శించకుండా ఉండటం నా స్వభావం కాదు*
- *అవినీతి, కుటుంబ పాలనలో ఒకేలా కేసీఆర్, విజయన్ కుటుంబాలు*
- *యూడిఎఫ్ మేనిఫెస్టో విడుదలలో సీఎం రేవంత్*



*2023లో తెలంగాణలో మాదిరి మార్పే ఈసారి కేరళంలో చోటుచేసుకుంటుంది. పినరయి విజయన్ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దింపుతారు. "పో మోనే విజయా" వ్యాఖ్యపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు స్పందించిన రేవంత్ రెడ్డి... విజయన్ తమకు రాజకీయ ప్రత్యర్థే.. మోడీలా మాట్లాడటం నాకు సాధ్యం కాదు.. విమర్శించకుండా ఉండటం నా స్వభావం కాదు.*

**- కొచ్చిలో సిఎం రేవంత్ రెడ్డి**

**కొచ్చి ,ఏప్రిల్ 2 :** యూడీఎఫ్ ప్రకటించిన గ్యారంటీలపై విమర్శలు చేస్తున్న వారు అవి ఎలా అమలవుతాయో తెలుసుకోవాలంటే తెలంగాణకు రావాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.. కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో అమలవుతున్న పథకాలను ప్రత్యక్షంగా చూసి.. తమ ట్రాక్ రికార్డు పరిశీలించుకోవచ్చని చెప్పారు. కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్, ఆయన మంత్రులు తెలంగాణకు వస్తే తాము గ్యారంటీలు ఎలా అమలు చేస్తున్నామో ప్రత్యక్షంగా చూపుతామని సీఎం తెలిపారు. కేరళం శాసనసభ ఎన్నికలకు సంబంధించి యూడీఎఫ్ మేనిఫెస్టోను కొచ్చిలో గురువారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ కేరళంలో పినరాయి విజయన్ హయాం ముగిసిందని, ఇక యూడీఎఫ్ స్వర్ణయుగం మొదలవుతుందన్నారు. దేశాన్ని, కేరళంనూ మోదీ బ్రదర్స్ పాలిస్తున్నారని మోదీ.. విజయన్‌ను ఉద్దేశించి సీఎం వ్యాఖ్యానించారు. దేవుడి స్వంత రాష్ట్రంలో దేవుడి ఆస్తికీ రక్షణ లేదంటూ పరోక్షంగా శబరిమల బంగారం ఉదంతాన్ని లేవనెత్తారు. కేరళంలో గత పదేళ్లుగా పినరాయి విజయన్ ప్రభుత్వం కొనసాగుతోందన్న ఆయన 2014 నుంచి సుమారు పదేళ్ల పాటు కేసీఆర్ తెలంగాణను పాలించారన్నారు. పినరాయి కుటుంబ పాలన, అవినీతి, అసమర్థ పాలన విషయంలో పినరాయి విజయన్, కేసీఆర్‌ల మధ్య అనేక పోలికలు ఉన్నాయని రేవంత్ రెడ్డి విమర్శించారు.

మిగతా 2లో

## బాధ్యతను విస్మరించొద్దు

### ఆస్తితో పాటు వృద్ధ తల్లిదండ్రుల సంరక్షణా మీదే బాధ్యత

- సూర్యాపేట జిల్లాకు చెందిన 66 ఏళ్ల వృద్ధురాలి పిటీషన్ పై విచారణ
- కుమార్తెలకు హైకోర్టు ఉత్తర్వులు



**హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఎఎంఎస్) :** తల్లిదండ్రుల ఆస్తిలో సమాన హక్కులు కోరుకుంటున్న కుమార్తెలు.. వృద్ధాప్యంలో వారిని సంరక్షించే బాధ్యతను కూడా సమానంగా తీసుకోవాలని రాష్ట్ర హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆస్తి హక్కులతో పాటు బాధ్యతలను కూడా విస్మరించకూడదని స్పష్టం చేసింది. సూర్యాపేట జిల్లాకు చెందిన 66 ఏళ్ల వృద్ధురాలు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బి. విజయ్‌సేన్ రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం గురువారం విచారించింది. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. నేటి సమాజంలో వృద్ధ తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న దీన స్థితిపై ఆవేదన వ్యక్తం చేసింది. కేసు వివరాల్లోకి వెళితే.. సూర్యాపేట జిల్లాకు చెందిన సదరు పిటిషనర్ తన కుమారుడు తనను పట్టించుకోవడం లేదని తన ఆస్తిని తిరిగి ఇచ్చేలా అధికారులు ఇచ్చిన ఆదేశాలను లెక్క చేయటం లేదని కోర్టును ఆశ్రయించింది. 'తల్లిదండ్రుల సంరక్షణ వయోవృద్ధుల సంక్షేమ చట్టం' కింద ఇంటి పత్రాలను, భూమిని తిరిగి ఇవ్వాలని 2025 డిసెంబర్‌లో పిటిషనర్ కుమారుకి అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే.. ఆ ఉత్తర్వులను కుమారుడు బేఖాతరు చేయటమే కాకుండా.. తనను మానసిక ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆమె వాపోయింది. ప్రస్తుతం తాను కుమార్తె వద్ద ఉంటున్నానని పిటిషన్‌లో పేర్కొంది. ఈ విచారణ సందర్భంగా జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి సమాజంలోని పోకడలను ఎత్తిచూపారు. ప్రస్తుతం కోర్టుల్లో వృద్ధ తల్లిదండ్రులు తమ కుమారులు, కోడళ్లను ఆస్తుల నుంచి గెంటివేయాలని కోరుతూ దాఖలు చేసే పిటిషన్లు వెల్లువలా వస్తున్నాయని చెప్పారు.

మిగతా 2లో

### 33 మండలాల్లో

## సమీకృత భూభారతి

- 45 రోజుల తర్వాత రెండోదశ ప్రారంభం
- ప్రతి జిల్లాలోని 70 గ్రామాల్లో పూర్తిస్థాయి సర్వే
- ప్రతి సర్వే నెంబర్‌కు భూధార్
- వీలైనంత త్వరగా సాదా బైనామాలకు పరిష్కారం
- ఎన్నికల్లో ఫలితాలు చూసినా జ్ఞానోదయం కలగలేదు
- అసెంబ్లీలో టెర్రరిస్టుల్లా ప్రవర్తించారు
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 2 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్రంలో ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను దశల వారీగా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు.

మిగతా 2లో

## 'ఐప్యాక్ 'పై ఈడీ దాడులు

- హైదరాబాద్, బెంగళూరు, ముంబై నగరాల్లోని కార్యాలయాల్లో తనిఖీలు
- మనీలాండరింగ్ ఆరోపణలతో సోదాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఎఎంఎస్) :** మనీలాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటోన్న ప్రముఖ రాజకీయ వ్యూహకర్త సంస్థ ఐప్యాక్ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఎన్ ఫోర్స్ మెంట్ (ఈడి) అధికారులు గురువారం ఉదయం నుంచి దేశ వ్యాప్తంగా ఉన్న ఐప్యాక్ ప్రధాన కార్యాలయాలతో పాటు ఆ సంస్థ వ్యవస్థాపకుల నివాసాల్లో దాడులు నిర్వహించారు. కీలక రికార్డులు తనిఖీ చేశారు. హైదరాబాద్, బెంగళూరు, ముంబై నగరాల్లోని ఐప్యాక్ కార్యాలయాలపై ఈడీ అధికారులు ఏకకాలంలో దాడులు చేపట్టారు. కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా, ఐప్యాక్ ఫౌండర్ల వ్యక్తిగత నివాసాల్లోనూ సోదాలు నిర్వహించారు. బెంగాల్ బొగ్గు స్మగ్లింగ్ కేసులో భాగంగా గత కొంతకాలంగా ఐప్యాక్ ఆర్థిక లావాదేవీలపై నిఘా ఉంచిన ఈడీ అధికారులు, మనీలాండరింగ్ జరిగినట్టు ప్రాథమిక ఆధారాలు సేకరించారు.

మిగతా 2లో

### మరో 2 లక్షల మందికి

# 'చేయూత'

- కొత్తగా 2 లక్షల మందికి పెన్షన్లు మంజూరు
- బడ్జెట్‌లో రూ.233 కోట్లు కేటాయింపు
- రాష్ట్రవ్యాప్తంగా పోటెత్తుతున్న దరఖాస్తులు

**త్వరలో వడబోత కార్యక్రమం**



**హైదరాబాద్, ఏప్రిల్ 2 (వుదయం ప్రతినిధి) :** చేయూత పథకం కింద కొత్తగా మరిన్ని పెన్షన్లు మంజూరు చేసేందుకు రంగం సిద్ధమైంది. కొత్తగా మరో 2 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం 2026–27 ఆర్థిక బడ్జెట్‌లో రూ.233 కోట్లు కేటాయించింది. ఇప్పటికే లక్షల సంఖ్యలో పెన్షన్ల కోసం దరఖాస్తులు రాగా.. అందులో లబ్ధిదారుల ఎంపిక కోసం త్వరలోనే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు వడబోత కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.

**ప్రస్తుతం 42.23 లక్షల పెన్షన్లు**

తెలంగాణలో ప్రస్తుతం 42.23 లక్షల మంది వివిధ కేటగిరీల్లో ప్రతీ నెలా పెన్షన్లు అందుకుంటున్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, హెచ్ఐవీ బాధితులు, బోదకాలు బాధితులకు ప్రభుత్వం నెలకు రూ.2,016 చొప్పున పెన్షన్లు అందిస్తోంది. ఇక దివ్యాంగులకు నెలకు రూ.4,016 చొప్పున ఇస్తున్నారు.

మిగతా 2లో

## బాధ్యతలను విస్మరించొద్దు

**మొదటి పేజీ తరువాయి..**

ప్రతిరోజూ కనీసం రెండు వరకు ఇలాంటి పిటిషన్లు విచారణకు వస్తున్నాయన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే రాజీ మార్గాలు వెతకాలన్నారు. ఆస్తి నుంచి వెలివేయడం అనేది చివరి ప్రయత్నంగా ఉండాలని.. కానీ బాధితులు మొదటి దశలోనే ఆ విజ్ఞప్తి చేస్తున్నారని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ముఖ్యంగా కుమార్తెల బాధ్యత గురించి ప్రస్తావిస్తూ.. కేవలం కుమారులు లేని వారే కాదు, కుమార్తెలు ఉన్నవారు కూడా వృద్ధాప్యంలో ఇబ్బందులు పడుతున్నారని కోర్టు అభిప్రాయపడింది. చాలా సందర్భాల్లో కుమార్తెలు తల్లిదండ్రుల ఆస్తిపై హక్కులు కోరుకుంటున్నారు కానీ, వారిని సంరక్షించే విషయంలో వెనకాడుతున్నారన్నారు. కేవలం కుమార్తెలు మాత్రమే ఉన్న తల్లిదండ్రుల పరిస్థితి ఏమిటని కోర్టు ప్రశ్నించింది. కుమార్తెలు కచ్చితంగా బాధ్యత వహించాలని స్పష్టం చేశింది. ఆస్తిలో వాటా అడిగే ప్రతి కుమార్తె, తల్లిదండ్రుల బాగోగులు చూసుకోవాల్సిన నైతిక, చట్టపరమైన బాధ్యతను కలిగి ఉంటుందని గుర్తు చేశారు. విచారణ సందర్భంగా కోదాడ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ గతంలో ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో పోలీసు, పరిపాలనా యంత్రాంగం విఫలమైందని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. అధికారులు పట్టించుకోకపోవటం పిటిషనర్ హక్కులను ఉల్లంఘించడమేనని న్యాయమూర్తి కోర్టుకు విన్నవించింది. దీనిపై స్పందించిన న్యాయమూర్తి.. పిటిషనర్ ఆరోపణలపై వివరణ ఇవ్వాలని సూర్యాపేట జిల్లా అధికారులను ఆదేశించారు.. తదుపరి విచారణను ఈ నెల 15న వాయిదా వేశారు.

## తెలంగాణకు రండి

**మొదటి పేజీ తరువాయి..**

2023లో తెలంగాణలో మాదిరి మార్పే ఈసారి కేరళంలో చోటుచేసుకుంటుందని సీఎం అన్నారు. పినరాయి విజయ్ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దింపుతారని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. "పో మోనే విజయా" వ్యాఖ్యపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు స్పందించిన రేవంత్ రెడ్డి... విజయన్ తమకు రాజకీయ ప్రత్యర్థి అన్నారు. మోదీలా మాట్లాడటం తనకు సాధ్యం కాదని, విమర్శించకుండా ఉండటం తన స్వభావం కాదని స్పష్టం చేశారు.

**కేంద్ర నిధులు మోదీ కరుణ కాదు..**

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చే నిధులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కరుణ కాదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. అది ప్రజల హక్కు అన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేస్తామని వివరించారు. అవినీతి నియంత్రణ, ఆదాయానికి గండిపెట్టే అంశాలను నియంత్రించడం, కేంద్ర పథకాల గరిష్ట వినియోగం, రాష్ట్రానికి రావలసిన నిధుల సాధన.. తమ ప్రాధాన్య అంశాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.యూడీఎఫ్ కార్మికుల కూటమి అని, కూటమిలో నిజాయితీగల నాయకులు ఉన్నారని సీఎం వ్యాఖ్యానించారు.

**తొలి క్యాబినెట్ నుంచే హామీల అమలు...**

కేరళంలో యూడీఎఫ్ గ్యారంటీలు అమలు సాధ్యమా అని కొందరు సందేహాలు వ్యక్తం చేస్తున్నారని.. దానికి సమాధానం తెలంగాణ రాష్ట్రమే అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి క్యాబినెట్ సమావేశం నుంచే గ్యారంటీలను విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. 25 లక్షల రైతు కుటుంబాలకు చెందిన రూ.21 వేల కోట్ల రుణాలను తాము మాఫీ చేశామన్నారు. సాగు చేసుకునే రైతులకు ఎకరాకు రూ.12 వేలు చొప్పున ఏడాదికి రూ.18 వేల కోట్లు రైతు భరోసా కింద అందజేస్తున్నామని తెలిపారు. 67,173 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, వివిధ శాఖల్లో నియామకాలు పూర్తి చేయడంతో పాటు ప్రజల సమక్షంలో ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశామని వివరించారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామన్న సీఎం. 10 వేల బస్సులు, 50 వేల సిబ్బందితో ఉన్న ఆర్టీసీని నష్టాల నుంచి లాభాల్లోకి తీసుకువచ్చామని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు నెలకు రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు ఆదా అవుతోందన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి, ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. మహిళలను బస్సుల యజమానులుగా, వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతున్నామని సీఎం తెలిపారు. తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ –2047 ప్రకారం తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలపనున్నామని సీఎం ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ వృద్ధిరేటు 10.8 శాతంగా ఉందని, పన్నులు పెంచకుండానే అభివృద్ధి సాధ్యమని తాము నిరూపించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కేపీసీసీ ప్రెసిడెంట్ సన్నీ జోసెఫ్, కేరళ సీఎల్పీ నేత వి.డి.సతీషన్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దీప్ దాస్ మున్షీ, యూడీఎఫ్ కన్వీనర్ ఆదూర్ ప్రకాష్, ఐయూఎంఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి పి.కె.కున్హాలికుట్టి పాల్గొన్నారు.

## 'ఐప్యాక్ 'పై ఈడీ దాడులు

**మొదటి పేజీ తరువాయి..**

రాజకీయ వ్యూహాల కోసం వివిధ పార్టీల నుండి అందుకున్న నిధుల మళ్లింపుపై ప్రధానంగా దృష్టి సారించారు. విదేశీ నిధుల సమీకరణలోనూ నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు అనుమానిస్తున్నారు. దేశవ్యాప్తంగా పలు పార్టీలకు ఎన్నికల వ్యూహాలను అందించే ఐప్యాక్ సంస్థపై ఈడీ దాడులు జరగడం రాజకీయ వర్గాల్లో పెను సంచలనంగా మారింది. ఈ సోదాల అనంతరం ఈడీ అధికారులు అధికారికంగా ఎలాంటి విషయాలు వెల్లడించలేదు.

## 'మరో 2 లక్షల మందికి చేయూత'

**మొదటి పేజీ తరువాయి..**

ఇక గత మూడేళ్లుగా బోదకాలు బాధితులు, డయాలసిస్ బాధితులు తప్ప కొత్తగా ఎవరికీ పింఛన్లను మంజూరు చేయలేదు. ఈ నేపథ్యంలోనే ఇప్పటికే పెన్షన్ కోసం 12 లక్షల మందికిపైగా దరఖాస్తు చేసుకుని.. ప్రభుత్వం అనుమతి కోసం వేచిచూస్తున్నారు. ఇక రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కొత్త పెన్షన్ల కోసం రూ.233 కోట్ల నిధులను ప్రకటించిన తర్వాత అప్లికేషన్ల వెల్లువ కొనసాగుతోంది. గత నెల 20వ తేదీ నుంచి ప్రజావాణి సహా ఇతర కార్యక్రమాల్లో అర్హులైన వారు దరఖాస్తులు చేసుకుంటున్నారు.

**భారీగా దరఖాస్తులు..**

గురువారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు గ్రామాల్లో ఏర్పాట్లు కూడా జరిగాయి. ఈ నేపథ్యంలోనే ఈ గ్రామసభల్లో కూడా కొత్త పెన్షన్లకు సంబంధించి.. భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశాలు ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇప్పటికే ఉన్న 12 లక్షల అప్లికేషన్లతోపాటు కొత్త దరఖాస్తులు రానుండడంతో.. ప్రభుత్వం ఆమోదం తెలిపిన 2 లక్షల మంది లబ్ధిదారులను ఎంపిక చేయడం అధికారులకు అతి పెద్ద సవాల్‌గా మారింది. ఇప్పటికే రాష్ట్రంలో వృద్ధాప్య పింఛన్ కోసం 4 లక్షల మంది దరఖాస్తులు చేసుకోగా.. వితంతు, ఒంటరి మహిళల పింఛనుకు 3.5 లక్షల మంది.. చేనేత, గీత కార్మిక పింఛన్ల కోసం 3 లక్షల మంది.. దివ్యాంగుల పింఛనుకు 72 వేల మంది అప్లికేషన్లు పెట్టుకున్నారు.

## చేనేత కార్మికుల పొట్ట కొడుతోన్న కాంగ్రెస్

**మొదటి పేజీ తరువాయి..**

కమీషన్లు దండుకోవాలనే యావలో కాంగ్రెస్ దండుపాళ్యం ముఠా ప్రైవేట్ వ్యక్తులకు ఆర్డర్లు ఇస్తోందన్నారు. నేతన్నల ఉసురు పోసుకుంటున్న కర్కశ కాంగ్రెస్ ప్రభుత్వానికి చరమగీతం పాడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. అసలు ఇది ప్రజా ప్రభుత్వమా... లేక 'ప్రైవేట్' లిమిటెడ్ కంపెనీయా? అని మండిపడ్డారు. ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేటు సంస్థలకు వత్తాసు పలకడమేనా ప్రజా పాలన? అని ప్రశ్నించారు.

# విభజన విభేదం

**మొదటి పేజీ తరువాయి..**





హామీలు అమలు చేయనందుకు పరిహారం ఇవ్వాలన్నారు. 12 ఏళ్ల తర్వాత ఆస్తుల పంపకం పూర్తికాకపోవడం దారుణమన్నారు. ఆస్తుల పంపకంపై రెండు రాష్ట్రాలు సంతృప్తిగా లేవని రేణుకా చౌదరి తెలిపారు. ఏపీ, తెలంగాణ ప్రజలు కవలపిల్లల వంటివారని, కలిసే ముందుకు సాగక తప్పదని అన్నారు. బీజేపీతో సఖ్యతతో ఏపీ కొంతవరకు సాధించుకుంటోందని ఆమె విమర్శించారు. విభజన సమయంలో భద్రాచలంలోని ఏడు మండలాల పరిధిలోని నాలుగైదు గ్రామాలు ఏ రాష్ట్రానికీ చెందకుండా పోయాయని గుర్తు చేశారు. భౌగోళికంగా ఏపీలో ఉన్నా ఆ గ్రామాలు ఇబ్బంది పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్ణీత కాలపరిమితితో విభజన హామీలు అమలు చేయాలని, పారదర్శక విధానంలో విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రూ.1.47 లక్షల కోట్ల విభజన ఆస్తుల పంపకాలు పూర్తికాలేదని తెలిపారు. రెండు రాష్ట్రాలతో కేంద్రం ఆటలాడుతోందని, విభజన హామీలు అమలు చేయనందున 2 రాష్ట్రాల్లో అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు.

**చర్చించకుండానే విలీనం :**

విభజన సమయంలో తెలంగాణ అనుమతి లేకుండానే కేంద్రం కొన్ని మండలాలను ఏపీలో కలిపిందని బీఆర్ఎస్ ఎంపీ సురేశ్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ మండలాలను ఏపీలో విలీనం చేసేటప్పుడు కనీసం చర్చ కూడా జరగలేదని మండిపడ్డారు. తల్లిని చంపి బిడ్డను బతికించారని మోదీ అనేకసార్లు అన్నారన్న ఆయన ఏపీ విభజన బిల్లును ఏపీ పునర్నిర్మాణ బిల్లుగా చేయొద్దని డిమాండ్ చేశారు. 12 ఏళ్లుగా తెలంగాణకు కేంద్రం ఎలాంటి సహాయం చేయలేదని విమర్శించారు. కేంద్రం సహకరించకున్నా తెలంగాణ అభివృద్ధి చెందుతోందని తెలిపారు. తెలంగాణ నేడు దేశంలోనే అత్యధికంగా వరి పండిస్తున్న రాష్ట్రంగా నిలిచిందని గుర్తు చేశారు. విభజన చట్టం ప్రకారం తెలంగాణకు కూడా హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ చేసిన ఎంతో పోరాటంతో తెలంగాణ సాకారమైందన్న సురేశ్‌రెడ్డి ప్రాంతాలుగా వేరయినా అన్నదమ్ముల్లా కలిసుందాం అని కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను గుర్తు చేశారు.

**సురేశ్‌రెడ్డి వర్సెస్ కిషన్‌రెడ్డి :**

రాజ్యసభలో కాళేశ్వరం అంశంపై సురేశ్‌రెడ్డి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మధ్య వాగ్వాదం జరిగింది. సీఆర్ పాటిల్ వ్యాఖ్యలపై సురేశ్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. సీఆర్‌పాటిల్ తన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం గురించి కేంద్రమంత్రి ఏకపక్షంగా వ్యాఖ్యలు చేశారని సురేశ్‌రెడ్డి తెలిపారు. రూ.లక్ష కోట్లు నదిలో కొట్టుకుపోయాయని కేంద్రమంత్రి మాట్లాడారని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే కేవలం ఒక్క డ్యామ్ మాత్రమే కాదని, ఒక్క డ్యామ్‌లో రెండు పిల్లర్లు మాత్రమే కుంగితే మొత్తం ప్రాజెక్టు వృథా అన్నట్లుగా మాట్లాడారని అన్నారు. తెలంగాణతో పాటు ఏపీ కూడా అభివృద్ధి చెందాలని తాము కోరుకుంటున్నామని తెలిపారు. హైదరాబాద్ నగరం ఏపీ వాళ్లతో పాటు ఎంతోమందికి గమ్యస్థానంగా ఉందని పేర్కొన్నారు. మరోవైపు సురేశ్‌రెడ్డి వ్యాఖ్యలపై కిషన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. మేడిగడ్డ ప్రాజెక్టు పనికిరాకుండా పోయిందని నిపుణుల కమిటీ చెప్పిందని, కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ కుటుంబం ఒక ఏటీఎంగా వాడుకున్నదని విమర్శించారు. కనీసం ఇంజినీర్లను కూడా అడగకుండా కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారని ఆరోపించారు. లక్ష కోట్ల ప్రజాధనాన్ని కేసీఆర్ ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. కేసీఆర్‌ను జైల్లో పెడతానన్న రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు ఏం చేశారని ప్రశ్నించారు. గతంలో ఏడు మండలాల విలీనానికి కేసీఆర్ ఒప్పుకున్నారని, దస్త్రాలు పట్టుకుని సోనియాగాంధీ ఇంటికి కేసీఆర్ వెళ్లారని పేర్కొన్నారు.

**బీఆర్ఎస్, బీజేపీలపై ఘాటు విమర్శలు..**

రాష్ట్ర అప్పులపై కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు చామల ఘాటుగా సమాధానమిచ్చారు. "గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో తెలంగాణను అప్పుల పాలు చేసి దోచుకున్నారు. మరి ఆ పదేళ్లు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంది? దోపిడీ జరుగుతుంటే చర్యలు తీసుకోకుండా ఎందుకు సైలెంట్‌గా ఉన్నారు?" అని చామల నిలదీశారు. బీఆర్ఎస్ దోచుకుంటున్నప్పుడు చూస్తూ ఊరుకున్న బీజేపీ, ఇప్పుడు రాష్ట్ర అభివృద్ధికి అడ్డుపడటం సరికాదని ఆయన మండిపడ్డారు. తెలంగాణ ప్రయోజనాల దృష్ట్యా రాజకీయాలకు అతీతంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అండగా ఉండాలని ఆయన కోరారు. మూసీ పునరుజ్జీవం, హైదరాబాద్ మెట్రో రెండో దశ, రీజనల్ రింగ్ రోడ్డు వంటి కీలక ప్రాజెక్టుల పూర్తికి కేంద్ర మంత్రులు, ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరించాలని చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

## మూసీ పునరుజ్జీవనానికి కట్టుబడి ఉన్నాం..

**కాంగ్రెస్ ఎంపీ చామల**



తెలంగాణ అభివృద్ధి, అప్పులు, మూసీ పునరుజ్జీవంపై కేంద్ర ప్రభుత్వ తీరును భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తూర్పారబట్టారు. హైదరాబాద్ నగరాభివృద్ధిలో భాగంగా మూసీ నది పునరుజ్జీవనానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టత ఇచ్చిన ఆయన ఈ ప్రాజెక్టు కోసం ప్రపంచ బ్యాంకు నుండి 500 మిలియన్ డాలర్ల రుణానికి సంబంధించి ప్రిలిమినరీ ప్రపోజల్ రిపోర్టును ఇప్పటికే సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఈ నివేదికను కేంద్ర సంబంధిత శాఖా మంత్రికి, నీతి ఆయోగ్‌కు సమర్పించామని చెప్పారు. దీనిపై కేంద్రం సానుకూలంగా స్పందించి సహకరించాలని కోరారు.

## తెలంగాణకు కేంద్రం రూ. 12 లక్షల కోట్లు ఇచ్చింది

**ఎంపీ లక్ష్మణ్**



తెలుగు రాష్ట్రాలను అభివృద్ధి చేసేందుకు కేంద్రప్రభుత్వం కట్టుబడి ఉందని రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ స్పష్టం చేశారు. తెలంగాణకు మోదీ ప్రభుత్వం రూ. 12 లక్షల కోట్లు ఇచ్చిందని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని లేకుండా చేసినందుకు కాంగ్రెస్ పార్టీ బాధ్యత తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వైసీపీ అధినేత జగన్ తీరును చూసి జనం నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రాజధాని పట్ల పిల్ల కాంగ్రెస్ పిల్ల చేష్టలు చూపించిందని చురకలంటించారు. ఈ చేష్టలు చూసి ప్రపంచం మొత్తం నివ్వెరపోయిందని విమర్శించారు. పిల్ల, తల్లి కాంగ్రెస్‌ను ఏపీ ప్రజలు మట్టికరిపించారని లక్ష్మణ్ గుర్తు చేశారు. రాజధానిని నిర్ణయించే హక్కు రాష్ట్రాలకు ఏ చట్టంలో ఉంది ప్రశ్నిస్తున్నారని, కొత్తగా మావిగన్ అనే పేరు తెరపైకి తీసుకొచ్చారని వ్యాఖ్యానించారు. రాజధాని కోసం పోరాటం చేసిన రైతులపై జగన్ ప్రభుత్వం కేసులు పెట్టి వేధించిందని మండిపడ్డారు.

# 33 మండలాల్లో సమీకృత భూభారతి

**మొదటి పేజీ తరువాయి..**

45రోజుల తర్వాత అవసరమైన మార్పులు, చేర్పులతో 33 జిల్లాల పరిధిలో ఉన్న మండలాల్లో ఒకటి చొప్పున ఈ పోర్టల్ ను ప్రవేశపెడతామని ప్రకటించారు. రెవెన్యూ శాఖలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టినట్లు వివరించారు. గురువారం రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలంలోని మిఠాయిపల్లి గ్రామంలో జరిగిన గ్రామసభలో ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తొలి దశలో ఆమనగల్ మండలంతో పాటు ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట,సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి,నారాయణపేట జిల్లా కొస్గి మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసినట్లు తెలిపారు. ఎవరూ ఏ కార్యాలయానికి... ఏ అధికారి దగ్గరికి వెళ్లకుండా తన చేతిలో ఉన్న స్మార్ట్ ఫోన్ తో ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ లో లాగిన్ అయితే అన్నిసేవలు లభిస్తాయన్నారు. గత ప్రభుత్వ పాలకులు ప్రవేశపెట్టిన ధరణి కారణంగా రాష్ట్రంలో 9.52 లక్షల సాదాబైనామా దరఖాస్తులకు దిక్కులేకుండా పోయిందని ఆరోపించారు. వాటిపై దృష్టి సారించినట్లు తెలిపారు. సాగుచేస్తూ, వారి అధీనంలో ఉండే భూములకు సంబంధించి సదరు వ్యక్తి వద్ద కన్సెంట్ తీసుకొని వారికే భూమి పట్టాను ఖరారు చేస్తామని మంత్రి తెలిపారు. దీనికోసం వారం రోజుల క్రితం భూభారతిలో సవరణ చేస్తూ జీవో జారీ చేశామని వెల్లడించారు. గతంలో గ్రామంగా ఉండి ఇప్పుడు మున్సిపాల్టీగా మారిన ప్రాంతాలకు ఈ సాదాబైనామాలు వర్తించేలా చేస్తామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. ఆధార్ నెంబర్‌లా ప్రతి భూమికి భూధార్ నెంబర్‌ను కేటాయిస్తామని చెప్పారు. రాష్ట్రంలో 10.984 రెవెన్యూ గ్రామాలను క్లస్టర్లు గా విభజించి జీపీవోలను నియమించినట్లు మంత్రి అన్నారు. 5300 మందికి రెండు విడతల్లో ఆరునెలల పాటు శిక్షణ ఇచ్చి మండలానికి 4 నుంచి 6 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించామన్నారు. సర్వే విషయంలో కూడా పాత పద్ధతులకు స్వస్తి పలికి ఇప్పటికే 411 రోవర్లతో కచ్చితమైన సర్వే చేయిస్తున్నామని, త్వరలో మరో 400 రోవర్లు రాబోతున్నాయని తెలిపారు.

**టెర్రరిస్టుల్లా ప్రవర్తించారు..**

పేదల సంక్షేమం కోసం ఇందిరమ్మ ప్రభుత్వ పనిచేస్తుంటే గత ప్రభుత్వంలో అరాచకాలకు పాల్పడిన వ్యక్తులు ఇప్పుడు శాసనసభ సాక్షిగా విషం కక్కారని, టెర్రరిస్టుల్లా ప్రవర్తించారని మంత్రి పొంగులేటి ధ్వజమెత్తారు. ప్రతి ఎన్నికల్లో ఓడిపోయిన వారికి ఇంకా జ్ఞానోదయం కాలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి, రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి లోకేష్‌కుమార్ పాల్గొన్నారు.



# చేనేత కార్మికులపై కాంగ్రెస్ కుట్ర

**విద్యార్థుల యూనిఫాంల ఆర్డర్‌ను ఏకపక్షంగా రద్దు చేయడం దుర్మార్గమైన చర్య**

**కావాల్సిన వారికి మేలు చేసేందుకు చేనేత కార్మికులకు అన్యాయం**

**చేనేత కార్మికులకు నష్టం చేస్తే ఊరుకునేది లేదు**

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**

**హైదరాబాద్, ఏప్రిల్ 02 (వుదయం ప్రతినిధి) :** రేవంత్ రెడ్డి సర్కార్ చేనేత కార్మికుల జీవితాలను అంధకారంలోకి నెట్టేసే కుట్రలు చేస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ముఖ్యమంత్రి పర్యవేక్షణలో ఉన్న విద్యాశాఖ ఆధ్వర్యంలోని యూనిఫాంల ఆర్డర్ ను ఏకపక్షంగా రద్దు చేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆర్డర్లపై ఆధారపడిన చేనేత కార్మికుల పొట్ట కొట్టే దుర్మార్గం చేస్తున్నారని విమర్శించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యా శాఖ ఆధ్వర్యంలో ఏటా సుమారు రూ. 105 కోట్ల విలువైన యూనిఫాంల ఆర్డర్ ను రాష్ట్రంలోని 393 చేనేత సహకార సంఘాలకు ఇస్తుంటారని, దీని ద్వారా సహకార సంఘాల్లోని వేలాది మంది చేనేత కార్మికులు ఉపాధి పొందుతున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏకపక్షంగా విద్యాశాఖ యూనిఫాంల ఆర్డర్ రద్దు చేయటంతో ఇప్పుడు కార్మికులు వీధిన పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ శాఖలు, ఇతర డిపార్ట్మెంట్లకు సంబంధించిన రూ. 200 కోట్ల విలువైన దుప్పట్లు, ఇతర దుస్తుల పంపిణీకి సంబంధించిన ఆర్డర్ ను కూడా టెస్కో కు ఇప్పటికీ ఇవ్వకపోవడం కార్మికులను సంక్షోభంలోకి నెట్టివేయడమేనన్నారు. గడువు ముగిసినప్పటికీ టెస్కో కు ఆర్డర్లు ఇవ్వకుండా ఆ సంస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు కావాల్సిన ప్రైవేట్ వ్యక్తులకు ఈ ఆర్డర్లను ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. చేనేత కార్మికులకు అన్యాయం చేసే ఈ చర్యను వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. లేదంటే కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని కవిత హెచ్చరించారు.

## పారదర్శకంగా హ్యామ్ రోడ్ల నిర్మాణం

**మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

**హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పద్ధతిలో పనులు జరుగుతున్నాయి**

**మాజీ మంత్రి వేములకు రోడ్ల గురించి తెలీదు**



**హైదరాబాద్, ఏప్రిల్ 02 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణలో కొనసాగుతోన్న అభివృద్ధి, హ్యామ్ (హ్యామ్) రోడ్ల పనుల్లో ఎలాంటి అవినీతి జరగడం లేదని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పద్ధతిలో చేపడుతున్న రోడ్డు పనుల విషయంలో జరుగుతోన్న అవినీతి ఆరోపణలను ఖండించారు. హ్యామ్ రోడ్ల టెండర్లలో ఎలాంటి అవినీతి జరగలేదని, అంతా పారదర్శకంగా జరుగుతోందని వివరించారు. ఈ టెండర్లన్నీ కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ హైవేస్ అథారిటీ నిబంధనల ప్రకారమే ఖరారు చేసినట్లు స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని, తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. హ్యామ్ రోడ్ల నిర్మాణ విషయంలో ఆరోపణలు చేస్తోన్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి రోడ్ల నిర్మాణం, నిబంధనల గురించి అవగాహన లేదని కోమటిరెడ్డి ఎద్దేవా చేశారు. రోడ్ల గురించి, టెండర్ల ప్రక్రియ గురించి ఆయనకు కనీస జ్ఞానం లేదన్నారు. గత పదేళ్లలో రాష్ట్రంలో రోడ్లను అధ్వాన్నంగా మార్చిన వారు ఇప్పుడు మాపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఎప్పుడూ అవినీతికి తావివ్వలేదని మంత్రి స్పష్టం చేశారు. తాను నిప్పు లాంటి వ్యక్తినన్న కోమటిరెడ్డి... తన రాజకీయ జీవితంలో ఇప్పటి వరకు తనపై ఎలాంటి అవినీతి మరకలు లేవన్నారు. కనీసం ఆరోపణలు కూడా లేవని చెప్పారు. అలాంటిది నా శాఖపై బురద చల్లాలని చూడటం హాస్యాస్పదంగా ఉందని మండిపడ్డారు.

## ఇద్దరు ఐఏఎస్‌లు బదిలీ

**పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వాణి ప్రసాద్**

**క్రీడా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా జయేశ్ రంజన్**





**హైదరాబాద్, ఏప్రిల్ 02 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్రంలో ఇద్దరు సీనియర్ ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పర్యాటక, క్రీడా శాఖలకు కొత్తగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శులను నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో సీనియర్ ఐఏఎస్ అధికారిణి వాణిప్రసాద్‌ను పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని మరింత బలోపేతం చేయడం, కొత్త పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై ఆమె దృష్టి సారించనున్నారు. ఐటీ, పరిశ్రమల శాఖలో సుదీర్ఘ అనుభవం ఉన్న జయేష్ రంజన్‌ను క్రీడా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ చేశారు. రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాల కల్పన మరియు క్రీడాకారులకు ప్రోత్సాహం అందించే బాధ్యతలను ఆయన పర్యవేక్షించనున్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా, కీలకమైన పర్యాటక, క్రీడా శాఖలలో అనుభవజ్ఞులైన అధికారులను నియమించడం ద్వారా ఆయా రంగాలలో వేగవంతమైన అభివృద్ధిని ప్రభుత్వం ఆశిస్తోంది. బదిలీ అయిన ఇద్దరు అధికారులు తక్షణమే తమ కొత్త బాధ్యతలను స్వీకరించనున్నారు.

# మౌలిక సదుపాయాల ధ్వంసం దిశగా యుద్ధం

**మొదటి పేజీ తరువాయి..**

మరోవైపు, ఈ దాడులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అత్యంత కఠినంగా స్పందించారు. బుధవారం రాత్రి జాతిని ఉద్దేశించి ప్రసంగించిన ఆయన, ఇరాన్ సైనిక శక్తి ఇప్పటికే నామరూపాల్లేకుండా పోయిందని ప్రకటించారు. ఇరాన్ నౌకాదళం సముద్ర గర్భంలో ఉంది, వారి వైమానిక దళం శిథిలావస్థకు చేరింది. వారి అగ్ర నాయకత్వం అంతమైంది అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇరాన్ తన వ్యూహాత్మక సామర్థ్యాన్ని తిరిగి పొందడానికి 15 నుంచి 20 ఏళ్లు పడుతుందని, ప్రస్తుతం ఆ దేశం ఒక పనికిరాని సైనిక వ్యవస్థగా మారిందని ఆయన ఎద్దేవా చేశారు. అమెరికన్ వాణిజ్య సంస్థలపై దాడులు చేయడం ద్వారా ఇరాన్ తన వినాశనాన్ని తానే కొనితెచ్చుకుంటోందని ట్రంప్ హెచ్చరించారు.

రాబోయే రెండు నుండి మూడు వారాల్లో ఇరాన్‌పై మరింత తీవ్రమైన దాడులు ఉంటాయని, ఈ యుద్ధం క్లైమాక్స్‌కు చేరుకుందని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ వద్ద ఉన్న క్షిపణి తయారీ కేంద్రాలు, రాకెట్ లాంచర్లను ఇప్పటికే ధ్వంసం చేశామని, వారు ఇకపై అమెరికా ప్రయోజనాలకు ముప్పు కలిగించలేరని ధీమా వ్యక్తం చేశారు. అయితే, ఇరాన్ హెచ్చరికల నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో ఉన్న అమెరికన్ టెక్ కంపెనీలు తమ కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేయడమో, వేరే ప్రాంతాలకు తరలించడమో చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇదిలా ఉంటే ఈ రోజు ట్రంప్ ప్రకటనతో అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు 4 శాతం మేర పెరిగి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై యుద్ధ నీడలు కమ్ముకున్నాయి. ఇరాక్‌లోని బాగ్దాద్‌లో ఉన్న అమెరికా రాయబార కార్యాలయం, ఇరాన్ మద్దతుగల మిలీషియా బృందాలు రాబోయే 24 నుండి 48 గంటలలోపు బాగ్దాద్ నగర కేంద్రంలో దాడులు చేసే అవకాశం ఉందని తీవ్ర హెచ్చరిక జారీ చేసింది. ప్రత్యక్ష యుద్ధ క్షేత్రాలకు ఆవల కూడా పరిస్థితి తక్షణమే తీవ్రమయ్యే ప్రమాదం ఉందని సూచిస్తూ, అమెరికా పౌరులందరూ వెంటనే ఇరాక్‌ను విడిచి వెళ్ళిపోవాలని కోరింది.

అదే సమయంలో, ఇరాన్ క్షిపణి దాడుల తీవ్ర వర్షాన్ని ఇజ్రాయెల్ ఎదుర్కొంది. ఇజ్రాయెల్ సైనిక ప్రకటనల ప్రకారం, ఆరు గంటల వ్యవధిలో పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని కనీసం నాలుగు విడతలుగా క్షిపణులను ప్రయోగించారు. వాయు రక్షణ వ్యవస్థలను పదేపదే క్రియాశీలం చేయగా, అవి అనేక క్షిపణులను అడ్డుకున్నాయి. అయినప్పటికీ, మధ్య ఇజ్రాయెల్‌లో కొన్ని చోట్ల దాడులు జరిగినట్లు నివేదికలు వచ్చాయి, దీంతో కొద్దిమందికి స్వల్ప గాయాలయ్యాయి. ఇరాన్ మద్దతుగల లెబనీస్ సంస్థ అయిన హిజ్బుల్లా, ఉత్తర ఇజ్రాయెల్‌పైకి రాకెట్లు, డ్రోన్‌లను ప్రయోగించామని ప్రకటించడంతో పరిస్థితి మరింత తీవ్రమైంది. ఈ దాడులు విస్తృతంగా వైమానిక దాడి సైరన్‌లను ప్రేరేపించాయి. పౌరులను షెల్టర్లకు తరలివెళ్లేలా చేశాయి. దీనితో లెబనాన్‌ను కూడా కలుపుకొని ఒక విస్తృత ప్రాంతీయ యుద్ధం చెలరేగుతుందనే భయాలు పెరిగాయి. గల్ఫ్ ప్రాంతంలో కూడా ఈ ప్రభావం విస్తరించింది. అబుదాబిలోని ఖలీఫా ఎకనామిక్ జోన్స్ (కెఇజెడ్ ఎడి) సమీపంలో ఒక క్షిపణిని అడ్డుకున్నట్లు, దీనివల్ల స్వల్ప నష్టం వాటిల్లినప్పటికీ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అబుదాబి అధికారులు ధృవీకరించారు. ఇది కీలక ఆర్థిక కేంద్రాలలోకి సంఘర్షణ ప్రభావం విస్తరిస్తుండటాన్ని సూచిస్తుంది.

దౌత్యపరమైన, సైనిక వైఖరికి వస్తే, రానున్న రెండు నుంచి మూడు వారాల వరకు అమెరికన్ దళాలు ఇరాన్‌పై తమ దాడులను తీవ్రతరం చేస్తాయంటూ యుఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. యుఎస్ ఆపరేషన్లు ఇప్పటికే ఇరాన్ సైనిక మౌలిక సదుపాయాలను తీవ్రంగా బలహీనపరచాయని, యుద్ధంలో విజయం సమీపంలో ఉందని అన్నారు. అయితే, ఆయన వ్యాఖ్యలు దేశీయంగా ఉన్న ఒత్తిడిని ప్రతిబింబించింది. అమెరికా ప్రజలకు ఈ యుద్ధం విషయంలో సహనం పరిమితంగా ఉంటుందనే సంకేతాలను ఇచ్చింది. ట్రంప్ వ్యాఖ్యలతో ఆర్థిక పరిణామాలు తక్షణమే చోటు చేసుకున్నాయి. చమురు ధరలు నాలుగు శాతం పెరిగగా, ప్రపంచ ఇంధన సరఫరాలలో అంతరాయాలు చోటుచేసుకుంటాయన్న భయాల మధ్య ఆసియా మార్కెట్లు పతనం అయ్యాయి. ముఖ్యంగా, ఈ అంతరాయాలు కీలకమైన హొర్మూజ్ జలసంధిలో చోటు చేసుకుంటాయన్న ఆందోళన ఉంది. పరస్పర క్షిపణి దాడులు, పరోక్ష దాడులు, భౌగోళిక రాజకీయ పునరుద్ఘాటనలు తీవ్రమై, ఈ ఘర్షణ మరింత విస్తరించే సంకేతాలు చూపుతోంది. ఇదే జరిగితే ప్రాంతీయ భద్రత, ప్రపంచ మార్కెట్ల స్థిరత్వం డోలాయమానంగా మారుతుంది.




“ మహిళా రిజర్వేషన్ల విషయంలో మొట్టమొదట చొరవ తీసుకున్నది సోనియా గాంధీయే. తీవ్రమైన వ్యతిరేకతను ఎదుర్కొన్నప్పటికీ, ఆమె మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందేలా విజయవంతంగా కృషి చేశారు. ఏప్రిల్ 29 తర్వాత, పార్లమెంటులో ఈ విషయమై ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకోవాలని మేము సూచించాం. అయితే, ప్రభుత్వం ప్రతిపక్షాల సలహాను పరిగణనలోకి తీసుకోవడానికి నిరాకరించింది. ఎన్డీయే పార్లమెంటరీ ప్రక్రియ కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యతనిస్తోంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు ముందే బిల్లులను ఆమోదించుకోవడమే ప్రభుత్వానికి ఉన్న ఏకైక లక్ష్యం. రాజకీయ ప్రయోజనాలను సాధించడం కోసమే ఈ చర్య. ”

* రాజీవ్ శుక్లా, కాంగ్రెస్ ఎంపీ

## వే'మన'పద్యం

ఎద్దుకైనగాని యేడాది తెలసిన
మాటదెలిపి నడుచు మర్మమెరిగి
మొప్పె తెలియలేడు ముప్పదేండ్లకునైన
విశ్వదాభిరామ! వినురవేమ



## సంపాదకీయం

# ముసలితనానికి రక్షణ, భరోసా !

పిల్లలు సరిగా చూడని, పట్టించుకోని తలిదండ్రుల రక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లు శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ఆమోదం పొందడం ఒక మంచి పరిణామం. తమను పెంచిపోషించిన తల్లిదండ్రులను వారు ముసలివారైన తర్వాత తనయులు నిర్లక్ష్యం చేయడం మానవ సమ్మంధాలలో తల ఎత్తుతున్న సంక్షోభానికి నిదర్శనం. తల్లిదండ్రులు మాత్రమే కానక్కరలేదు. నిస్సహాయ స్థితిలోని, కాళ్ళు చేతులు ఆడని స్థితిలోని ఎవరిని చూసినప్పుడైనా కళ్ళు చెమర్చడం మానవీయ లక్షణం. అది అడగంటిపోవడం అమానుషమే. భోరున కురిసే వర్షంలో కాసేపు తల దాచుకునే నీడ లేక ఏ పెద్దింటి అరుగునో ఆశ్రయిస్తే ఆ ఇంటి యజమాని ఆ వానలోనే వారిని బయటికి తరిమేస్తే అదెంత దయాహీనం? చెప్పనలవికాని అమానుషం. అటువంటి లక్షణం తీవ్రంగా ఖండించిందగినది. జీవిత చరమాంకంలో ఊతకర్రల్లా ఉండవలసిన పిల్లలు తల్లిదండ్రుల పట్ల క్రూరమృగాల్లా వ్యవహరించడం అత్యంత ఆందోళనకరం. ఆస్తుల కోసం, ఇన్సూరెన్సు సొమ్ముకోసం తల్లిదండ్రులను అకాలంలో కాటికంపే సంతానం గురించిన వార్తలు చూస్తున్నాము. అయితే పిల్లలందరూ కన్నవారిని కష్టాల పాలు చేస్తున్నారని అనలేము.అందుకు అవకాశం లేదు అలాగే తల్లిదండ్రుల బాగోగులు చూడలేనివారంతా దుర్మార్గులని అందరినీ ఒకే గాటన కట్టలేము. ఇందుకు ఏదో ఒకే కారణాన్నీ చూపలేము. ఈ సమస్యకు అనేక కోణాలుంటాయి. ఒక్కొక్క ఉదంతానికి ఒక్కో నేపథ్యం ఉంటుంది. ఇతర అనేక రాష్ట్రాల మాదిరిగా తెలంగాణ కూడా ప్రధానంగా ఉద్యోగులకు వర్తించేలా ఈ బిల్లును రూపొందించింది. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, చట్టసభల సభ్యులు, స్థానిక సంస్థల సభ్యులకు ఇది వర్తిస్తుంది.వేతనాలు తీసుకునే వర్గాలు విధిగా తమ తల్లిదండ్రులను గౌరవంగా చూసుకునేలా చేయడానికి దీనిని రూపొందించారు. తమ పిల్లల నిరాదరణకు, నిర్లక్ష్యానికి గురి అవుతున్నామని వీరిలో ఎవరి తల్లిదండ్రులయినా ఫిర్యాదు చేస్తే జిల్లా కలెక్టర్ ఉభయ పక్షాల వాదనను విని నిజంగానే నిర్లక్ష్యం చేస్తూ ఉంటే 15 శాతం లేదా రూ 10000, ఇందులో ఏది తక్కువయితే దానిని ఆ వ్యక్తి జీతంలోనుంచి మినహాయించి ఆ వృద్ధ దంపతుల ఖాతాలో నెల నెలా జమ అయ్యేలా ప్రభుత్వం చూస్తుంది.. దీని వల్ల వేతన జీవుల తలి దండ్రులకు ఆత్మ స్థైర్యం కలుగుతుంది, సొంతంగా పెన్షన్ వంటివి లేని వృద్ధులకు (వారు వారి పిల్లల నిర్లక్ష్యానికి గురవుతుంటే) ప్రభుత్వం ఈ పెన్షన్ ను ఏర్పాటు చేసినట్టు భావించాలి. నేనున్నాను మీకు అని భరోసా ఇచ్చినట్టు అయింది. ఇది కన్న తలిదండ్రులకు మాత్రమే కాకుండా పెంచుకున్న వారికి సైతం అమలవుతుంది.ఎంతో శ్రద్ధ వహించి ఈ బిల్లుకి శాసనసభ ఆమోదాన్ని సాధించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని అభినందించాలి.వాస్తవానికి కేంద్రప్రభుత్వమే దేశవ్యాప్తంగా తలిదండ్రుల రక్షణ కోసం ఇటువంటి మౌలిక చట్టాన్ని తీసుకొచ్చింది. 2007 నాటి తలిదండ్రులు , సీనియర్ సిటిజెన్ల రక్షణ చట్టాన్ని అందుబాటులో ఉంచింది. దీని ఆధారంగా ఛత్తిస్ ఘడ్, గోవా, హర్యానా,గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, అస్సాం, బెంగాల్ వంటి 13 రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాంతాలు తమ రాష్ట్రాల్లో సొంత చట్టాలను తెచ్చుకున్నాయి. వృద్ధ తలిదండ్రుల పట్ల జాతి చూపిస్తున్న శ్రద్ధ ఆసక్తులను ఇది ప్రతిబింబిస్తున్నది. ఇతర అనేక దేశాల్లోనూ ఇటువంటి చట్టాలున్నాయి. అయితే నెలవారీ నిర్దిష్టమైన జీతాలనేవి లేకుండా శారీరక శ్రమ మీద చేకూర్చుకునే దినబత్తెం పైన ఆధారపడి బతికే శ్రమజీవులు అసంఖ్యాకంగా గల దేశం మనది, తల్లిదండ్రులను బాగా చూసుకుందామన్నా చూసుకోలేని దుస్థితి వారిది. అందుచేత వృద్ధులకు చాలినంత రక్షణను ప్రభుత్వమే ప్రజాధనం నుంచి కల్పించే యోచన చేయడం మంచిదనిపిస్తున్నది. ఇప్పటి వృద్ధులు నిన్నటి యవ్వనులు, వయసులో ఉన్నప్పుడు వారు జాతికి చేసిన సేవలు అసాధారణమైనవి.

## రచనలు పంపండి



వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020


# ఒక రహదారిలో కల్వకుంట్ల కవిత

నాకు కల్వకుంట్ల కవిత 2012లో పరిచయమయ్యారు. అంటే ఇప్పటికి సుమారుగా 13 ఏళ్ల అయింది. అప్పుడైతే నాకు రాజకీయాల్లో అప్పుడప్పుడే పొడుస్తున్న పొద్దు లాగానే అనిపించారు. తర్వాత ప్రవర్ధమానం అవుతూ ఇప్పుడు ఎంతో పరిణితి సాధించిన జాతీయ రాజకీయ నాయకుల వరుసలో చేరిపోయారు. కవితగారి ప్రారంభమే ఒక సదాశయ ప్రకటనతో జరిగింది. తెలంగాణ ఉద్యమం కొనసాగుతున్న కాలంలో తెలంగాణ సాంస్కృతిక వారసత్వ సంపద పునస్సమీక్షించడం, గత వైభవ స్మృతులతో తెలంగాణ ఉద్యమంలో కొత్త స్ఫూర్తి నింపడం, ఆమె తీసుకున్న బాధ్యత. ఆ వరకు రాజకీయ కార్యాచరణే ప్రధాన మార్గంగా అనిపిస్తున్న తెలంగాణ ఉద్యమం సాంస్కృతిక పునస్సమీక్షణంతో కొత్త ఊతం సాధించింది. ఉద్యమం మూల మూలలకి విస్తరించడానికి ఇది ఒక ప్రధాన సాధనంగా పనిచేసింది. క్రమంగా కవిత తెలంగాణ బతుకమ్మ తానే అన్నంతగా బతుకమ్మకు ప్రతిచ్ఛాయగా నిలిచిపోయారు. బోనాలు మొదలైన అనేక సాంస్కృతిక అంశాలు ఆమె ఖాతాలో చేరిపోయాయి.

ఒక్క రాజకీయ ఉద్యమం ద్వారా ఆశయ సిద్ధి జరగడం సులభం కాదు. అది కొందరికి పరిమితించే అంశంగా నిలుస్తుంది. కానీ సాంస్కృతిక మూల్యాంకనం క్రమంగా ప్రజాక్షేత్రంలో బలంగా విస్తరిస్తుంది. ఆమె స్థాపించిన తెలంగాణ జాగృతి ఈ రకమైన సాంస్కృతిక మూల్యాంకనానికి ఒక గొప్ప సాధనంగా నిలబడింది. 2006 ఆగస్ట్ లో కవిత తెలంగాణ జాగృతిని ఏర్పాటు చేశారు. ఈ సంస్థ అధికారికంగా 2007 నవంబర్ లో రిజిస్టర్ అయింది. ఈ సంస్థ ద్వారా ఆమె ఒక దశాబ్దం పాటు తెలంగాణలో, ప్రపంచస్థాయిలో కూడా బతుకమ్మ వేడుకను నిర్వహించారు. ఎన్నో పాటల రికార్డులను విడుదల చేశారు.ఇప్పుడు బతుకమ్మ సుమారుగా ౩౦ దేశాలలో ఆడుతున్నారు అంటే ఆమె కృషిని అర్థం చేసుకోవచ్చు. అయితే సాంస్కృతిక మూల్యాంకనం మాత్రమే కాకుండా సాహిత్య మార్గం కూడా జాగృతిలో అవిభాజ్యమైన అంశంగా నిలబడింది. క్రమంగా ప్రత్యేక సాహిత్య విభాగాన్ని నిర్మించారు. ఒక్కేసి పువ్వేసి, కలల దారుల్లో, కాళోజి యాది,లో లాంటి కవితా సంకలనాలు ఎన్నో ప్రచురించారు. తెలంగాణ చరిత్రను నిపుణులైన రచయితలతో ఆధారాలు సేకరించి సమగ్రంగా రాయించారు. సాహిత్య విభాగానికి ప్రత్యేక కర్తృత్వం నియమించ బడింది. తంగేడు అనే సాహిత్య పత్రిక స్థాపించి తెలంగాణ సాంస్కృతిక వాతావరణాన్ని సాటిలేని విధంగా ప్రతిబింబించారు. వివిధ సాహితీ సంస్థలు చేస్తున్న సాహితీ సేవను ,కార్యక్రమాలను పాఠకులకు చేరవేయడం , నూతన పుస్తకాల పరిచయం ,ప్రతిభావంతులైన సాహితీ మూర్తులను గౌరవించడం వంటివి పత్రికా విధులు అని ఆమె తన రెండవ సంపాదకీయంలో ప్రకటించారు. విస్మృత తెలంగాణా సాహిత్య సంపదను పునరావలోకన చేసుకుంటూనే నూతన సృజనకు పెద్ద పీట వేయాలన్న సంకల్పమే పత్రికా స్థాపనకు కారణమని నవంబర్ 1, 2020 సంపాదకీయంలో ఆమె పేర్కొన్నారు. తనదైన మార్గంలో నిరాటంకంగా తన గమనం కొన సాగిస్తున్న కవితను మూడు మార్గాల్లో అర్థం చేసుకోవలసి ఉంటుంది. రాజకీయ ప్రయాణం, సాహిత్య, సాంస్కృతిక వ్యక్తిత్వం, వ్యక్తిగత అస్తిత్వం, నిజానికి పై మూడు అంశాలు వేరు వేరు కాదు. అవిభాజ్యాలు . ఆమె చైతన్యవంతమైన యాత్రాచరిత్రను అర్థం చేసుకోవడానికి ఒక సూక్ష్మమైన వివేచన ఇది. 2006లో, తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు హామీపై వెనక్కి వెళ్లినందుకు నిరసనగా కే.సి. ఆర్. నాడు కేంద్ర మంత్రి వర్గంనుండి రాజీనామ చేశారు. అప్పటినుండి మలిదశ తెలంగాణ ఉద్యమం మొదలైంది. కవిత ఆ కాలంలోనే రంగ ప్రవేశం చేశారు. ప్రజా సమస్యలను అర్థం చేసుకోవడానికి ఆమె తెలంగాణా మారుమూల ప్రాంతాలలో పర్యటించారు. 2006 లోనే ఆమె నల్లగొండ జిల్లాలోని కొన్ని గ్రామాలను దత్తత తీసుకున్నారు. అక్కడి పేద పిల్లలకు ఉచిత విద్యనందించారు. 2009లో జరిగిన నంది పురస్కారాల ప్రదానోత్సవంలో తెలంగాణా భాష పట్ల నాటి సినీవర్గాలు చూపుతున్న వివక్షను నిరసించారు. తెలంగాణ సంస్కృతి పట్ల నాటి సినిమాలు చూపుతున్న అవహేళనను తనదైన గొంతుతో ఆమె ప్రశ్నించారు. అదుర్స్ సినిమా నిర్మాణ వర్గం ఆ కాలంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అడ్డుకొంటున్నవాళ్ళు కావడం చేత సినిమా విడుదలను అడ్డుకొంటామని ప్రకటించారు.

కవిత అనంతర కాలంలో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘానికి, తెలంగాణ అంగన్ వాడీ వర్కర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ కు గౌరవాధ్యక్షురాలిగా పనిచేశారు. అత్యంత చిన్న వయస్సు లోనే స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలంగాణ రాష్ట్ర చీఫ్ కమీషనర్ గా ఎన్నిక అయ్యారు.

ఇక రాజకీయంగా ఆమె ఒక దశలో దూసుకొని పోయారు. 2009 నుండి 2014 వరకు ఉద్యమంలో ఆమెది అత్యంత క్రియాశీలక పాత్ర. 2014 లో కవిత 16వ లోకసభకు నిజామాబాద్ లోకసభ నియోజక వర్గంనుండి ఎన్నికయారు. తరువాత 2020 అక్టోబర్ లో జరిగిన తెలంగాణా శాసన మండలి ఎన్నికలలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల స్థానిక సంస్థల ఎం. ఎల్. సి. ఉపఎన్నికలలో పోటీ చేసి విజయం సాధించారు. 2022 జనవరిలో కవిత రెండవసారి ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేశారు.



ఎట్లాంటి వ్యతిరేక పరిణామాలు వచ్చినా చలించకుండా వెడుతున్న కవితని 2024 మార్చ్ 15న ఇ.డి. ఢిల్లీ మద్యం కుంభకోణంలో అరెస్ట్ చేసింది. అనేక మలుపులు తిరిగిన ఈ ప్రహసనం వైరి పక్షాల కుట్రలకు చరమాంకం పలుకుతూ 2024 ఆగస్ట్ 27 రోజున సుప్రీంకోర్టు బెయిలు ఇచ్చేసింది. ఒక రాటుదేలిన రాజకీయ నాయకురాలిగా ఆమె మళ్ళీ ప్రజా క్షేత్రంలో అడుగు పెట్టారు. “Experience is the teacher of all things” అన్న జూలియస్ సీజర్ మాటను నిజం చేశారు. తరువాత ఇటీవల కోర్టు ఆరోపణలకు వచ్చిన సాక్ష్యాలు సరిపోలేదని ఆమెకి క్లీన్ చీట్ ఇచ్చిన విషయం తెలిసిందే .


ఇప్పుడు కవిత బి. సి. రాగాన్ని ఎత్తుకున్నారు. బి.సి . సంక్షేమాన్ని ఆమె తన ప్రధాన ఎజెండా లో చేర్చుకున్నారు. నిజానికి ఈ రోజే ఎత్తుకున్న కొత్త నినాదమేం కాదు. ఆమె కోటరీలో అనేక మంది బిసిలు ఉన్నారు. తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి రంగునవీనా చారి, తంగేడు పత్రిక సహసంపాదకుడు కాంచనపల్లి గోవర్ధన్ రాజు, సాహితీ విభాగంలో చైతన్యంతో పనిచేసే ఘనపురం దేవేందర్ చరిత్ర రచయిత రామోజు హరగోపాల్, ఇట్లా ఆమె ప్రోత్సహించిన వారిలో ఎందరో బి.సి.లు ఉన్నారు. రాష్ట్ర స్థాయి బి. సి . నాయకులు ఎందరో ఆమెకు మద్దతు పలికారు. బి.సి. మేధావులు కలిసి నడవడానికి సిద్ధపడుతున్నారు. తెలంగాణలో బి.సి.లు 56.33 ఉన్నారు. మైనారిటీలను మినహాయిస్తే 46.25 ఉన్నారని ఒక ప్రభుత్వ ప్రకటన తెలుపుతోంది. కవిత ఎత్తుకున్న బి.సి. నినాదం కాంగ్రెస్ ప్రభుత్వంలో కలవరం కలిగించింది. వెంటనే సర్వే చేపట్టి బి.సి. గణన చేసింది. ఇప్పుడు కులగణన ద్వారా లెక్కలు తెలిశాయి కాబట్టి పథకాల అమలు కచ్చితత్వంతో ఉంటుంది అని చెబుతుంది కాంగ్రెస్ ప్రభుత్వం.

బి.సి.లు ఒక్క పథకాలు అమలుకు సరిపోయే వరకు మాత్రమే కాదు. వాళ్ళ సార్వత్రిక అభివృద్ధి రాజకీయాలలో, దానితోపాటు సాహిత్య కళా రంగాలాలో కూడా కనిపించాలి . ఇప్పటికీ ఏ రంగంలోనూ అవకాశాలు పొందని భట్రాజు లాంటి బి.సి. కులాలు ఉన్నాయి. మైనారిటీలైన బిసిలకు అవకాశాలు రానేరావని కొంతమంది నాయకులే చెబుతున్నారు. ఈ పరిస్థితికి బిసీల ఐక్యతా భావమే సమాధానం చెప్పాలి.

నిజానికి బి.సి.ల మద్దతు లేకుండా ఏ రాజకీయ పార్టీ కూడా అధికారంలోకి రావడం అసాధ్యం. కాని వాళ్ళలో ఐక్యత లేకపోవడం ప్రధాన లోపం. ఎవరికీ వారే తాము అనేక ప్రత్యేకతలు ఉన్నవాళ్ళమని భ్రమలతో ఒకరితో ఒకరు కలువకుండా తమ వర్గాలకు రావాల్సిన అవకాశాలు పొందలేక పోతున్నారు. నాటి తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ ప్రజల్లో ఎట్లాంటి ఐక్యత వచ్చిందో ఇప్పుడు బిసిల లోనూ రావాల్సి ఉంది. తమ చరిత్రను తామే వ్రాసుకొనే ఆత్మ స్థైర్యం పొందవలసి ఉంది. “ If the lion cannot write its own history, then the hunter will write it and the lion will be made to look like the villain” అన్న మాట ప్రతి బిసి అంది పుచ్చుకోవాల్సి ఉంది.

ఇప్పటికే బి.సి . వర్గాల్లో చైతన్యం మొదలైంది. ఒక చైతన్య వంతురాలైన నాయకురాలు దీన్ని ముందుకు నడిపించడానికి సిద్ధపడ్డారు. ఇప్పటికే 48 శాతం రిజర్వేషన్ ప్రయత్నంలో రేవంత రెడ్డి బిసిల ప్రాపకం కోసం చేసే ప్రయత్నం ,దానికి ప్రేరణగా నిలిచిన కవిత ప్రయత్నాలు అర్థం చేసుకోవాలి . అవకాశాన్ని అందిపుచ్చుకోవడం ఇప్పుడు బి.సి.ల పనే. చాణక్యుడు చెప్పిన ప్రతిభానిర్వహణ (Meritocracy) కి తామే అర్హులమని వారు ఏనాటికైనా నిరూపించాలి .

రాజకీయ రంగంలో ఆమె ఒక మృదువైన వ్యక్తిగా పేరు తెచ్చుకున్నారు కవిత. ఏ సామూహిక కార్యక్రమాల్లోగాని ,సభలలోగాని, తనను ఎవరైనా వ్యక్తిగతంగా కలువడానికి వచ్చినపుడుగాని కటువుగా మాట్లాడిన సందర్భాలు దాదాపుగా లేవు. నిజానికి రాజకీయ నాయకులకు తమ సమస్యలు నివేదించుకోవడానికి ప్రజలు చాల దూరంనుండి వస్తారు. వచ్చినవారు కొన్నిసార్లు భావోద్రేకంవల్ల వ్యక్తీకరణలో పరిమితిదాటవచ్చు. సంయమనం కలిగిన నాయకులు అర్థం చేసుకొని వాళ్ళను సమాధానపరచి పంపించాలి. పిలిపించి తిట్టి పంపించే నాయకులను ఈ రోజుల్లో ఎందరినో చూస్తున్నాం. ఇట్లాంటి వ్యవహార శైలి ప్రజలమీద చాలా ప్రభావం చూపిస్తుంది. ఈ వర్తమాన పరిస్థితిలో కవిత సంయమనం సదా స్వాగతించ దగింది. తల్లి, భార్య, కూతురు, చెల్లి, కోడలు, జాగృతి సంస్థ వ్యవస్థాపకురాలిగా, సాహిత్య సాంస్కృతిక అభినివేశిగా, ఎమ్మెల్సీగా ఇన్ని పాత్రలు నిర్వహించే కవిత ఒక అజేయ శక్తి. రహదారిలో కొనసాగే ఆమె భావికాలంలో ఒక తిరుగులేని చైతన్యం. ఏప్రిల్ 25 ,2026 నాడు ఆమె నాయకత్వంలో ప్రకటించనున్న తెలంగాణా ప్రజా జాగృతికి స్వాగతం పలుకుదాం . కొత్త నాయకత్వానికి ఒక అవకాశం ఇద్దాం .



డాక్టర్ కాంచనపల్లి గోవర్ధన్ రాజు
9676096614

# మెతుకు సీమలో బతుకు మార్చిన పి.వి. సతీష్!

తెలంగాణలో జొన్నలు, సజ్జలు, రాగులు ఒకప్పుడు పేదల ఆహారంగా తక్కువగా చూసిన ఈ మిల్లెట్లను ప్రపంచ వేదికపై నిలబెట్టిన అగ్రగిపుణుడు పి.వి. సతీష్.



**సతీష్ జీవితం ఒక ఉద్యమం. ఆకలి, పోషకాహార లోపం, భూసార నష్టం, జీవ వైవిధ్యం, వంటి సమస్యలన్నింటికీ ఒక సమగ్ర పరిష్కారం కోసం ఆయన చేసిన ప్రయాణం అసాధారణం.**

**ఈ రోజు మనం మిల్లెట్ల గురించి గర్వంగా మాట్లాడుతున్నాం. ఆరోగ్యకర ఆహారం, సుస్థిర వ్యవసాయం గురించి చర్చిస్తున్నాం. కానీ ఈ మార్పు వెనుక ఉన్న నిశ్శబ్ద విప్లవకారులను గుర్తు చేసుకోవడం కూడా అంతే అవసరం. పి.వి. సతీష్ అలాంటి అరుదైన వ్యక్తి.**

**ఐక్యరాజ్యసమితి 2023 సంవత్సరాన్ని “ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్”గా ప్రకటించిన అదే సంవత్సరంలో పి.వి. సతీష్ మరణించడం ఒక చారిత్రక విషాదం. కానీ ఆయన ఆలోచనలు, కృషి మాత్రం ఇప్పటికీ గ్రామీణ భారతంలో పండుతున్నాయి.**

ఐక్యరాజ్యసమితి 2023 సంవత్సరాన్ని “ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్”గా ప్రకటించిన అదే సంవత్సరంలో ఆయన మరణించడం ఒక చారిత్రక విషాదం. కానీ ఆయన ఆలోచనలు, కృషి మాత్రం ఇప్పటికీ గ్రామీణ భారతంలో పండుతున్నాయి. 1945 జూన్ 18న కర్ణాటకలోని మైసూరులో జన్మించిన పెరియపట్న వెంకటసుబ్బయ్య సతీష్, జీవితం జర్నలిజంతో ప్రారంభమైనది. న్యూ ఢిల్లీలోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ చదివి, తరువాత దూరదర్శన్‌లో టెలివిజన్ ప్రొడ్యూసర్‌గా పనిచేశారు. గ్రామీణ అభివృద్ధి, అక్షరాస్యతపై అనేక కార్యక్రమాలు డిజైన్ చేశారు. 1970లలో జరిగిన సాటిలైట్ ఇన్‌స్ట్రక్షనల్ టెలివిజన్ ఎక్స్‌పెరిమెంట్ ( SITఙు )లో కూడా కీలక పాత్ర పోషించారు. కానీ కేవలం సక్సెస్ స్టోరీలు చెప్పడమే కాదు, గ్రామీణ వ్యవసాయ సమస్యలను ప్రత్యక్షంగా పరిష్కరించాలనే తపన ఆయనను ఒక కొత్త మార్గం వైపు నడిపించింది. 1980లలో తెలంగాణలోని మెదక్ జిల్లా, జహీరాబాద్ సమీపంలోని పస్తాపూర్ పల్లెలో ఆయన స్థాపించిన ‘డెక్కన్ డెవలప్మెంట్ సొసైటీ ’ మెతుకు సీమలో చిన్న రైతులకు వెలుగు బాటయింది. మార్చింది. ఈ సంస్థ ద్వారా ఆయన వ్యవసాయ వైవిధ్యం, ఆహార స్వావలంబన, మహిళా సాధికారత, సామాజిక న్యాయంలో అసాధారణమైన మార్పులు తీసుకువచ్చారు. ముఖ్యంగా 5000 మంది దళిత మహిళలను ఐక్యపరిచి వారి చేతుల్లోకే వ్యవసాయాన్ని, ఆహార వ్యవస్థను తిరిగి ఇచ్చే ప్రయత్నం ఆయన ప్రత్యేకత. సతీష్ చూపిన మార్గం సాంప్రదాయ వ్యవసాయ విధానాలకు పూర్తి విరుద్ధం. అప్పటి వరకు రసాయనాలపై ఆధారపడిన వ్యవసాయానికి కొత్త దారి చూపారు. స్థానిక విత్తనాలు, సేంద్రియ పద్ధతులు, మిల్లెట్ల సాగు, గానుగ నూనెలు సొంతంగా చేసుకునేలా ప్రోత్సహించారు. డిడిఎస్ మహిళా సంఘాలు దేశవ్యాప్తంగా మిల్లెట్ వ్యవసాయానికి ఒక ప్రత్యామ్నాయ మోడల్‌గా నిలిచాయి. ఈ ప్రయత్నాల ఫలితంగా వేలాది గ్రామీణ మహిళల జీవనోపాధి మెరుగుపడింది.

ఇప్పుడంటే చిరుధాన్యాలను పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్‌లో చేర్చాలని ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్మెంట్ సర్వీసెస్ లో చిరు ధాన్యాలను చేర్చేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్ కూడా పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ ద్వారా బియ్యం తరహాలో మిల్లెట్స్ ప్రవేశపెట్టాలని ఆలోచిస్తోంది. ఈ ఆలోచనలకు విత్తనం వేసింది సతీష్ మాత్రమే. ఆనాడు ఆయన చేసిన కృషి లేకపోతే మిల్లెట్లకు ఈరోజు ప్రాధాన్యం అంత సులభంగా వచ్చేది కాదు.

2019 జూన్‌లో, డీడీఎస్ ను ఐక్యరాజ్యసమితి 2019 ఎక్వేటర్ ప్రైజ్‌కు ఎంపిక చేసింది. వాతావరణ

**దేశ, విదేశాలలో అనేక సంస్థల్లో ఆయన కీలక పాత్ర పోషించారు. మిల్లెట్ నెట్‌వర్క్ ఆఫ్ ఇండియా, సౌత్ అగైనెస్ట్ జెనెటిక్ ఇంజినీరింగ్ వంటి వేదికల ద్వారా వ్యవసాయం, ఆహారం, పర్యావరణంపై ప్రజా ఉద్యమాలను బలపరిచారు. ఆయన కృషి అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రశంసలు పొందింది**

మార్పు, స్థిరమైన అభివృద్ధికి సంబంధించి ‘స్థానికంగా, ప్రకృతి ఆధారిత పరిష్కారాలకు అద్భుతమైన ఉదాహరణ’గా ఈ సంస్థను గుర్తించింది. అయితే ఈ అవార్డు పొందకముందే, ఎన్నో సంవత్సరాలుగా వారు చిరు ధాన్యాల సాగును ప్రోత్సహిస్తూ వచ్చారు.

### 2023లో సతీష్‌ని జహీరాబాద్‌లో కలిసినపుడు

‘ వ్యవసాయంలో కొత్త మార్పుతేవాలంటే సహనం అవసరం .అందుకే రైతమ్మలను సంఘాలుగా ఏర్పాటు చేసి సొంత విత్తనాలు, సొంత ఎరువులకు ప్రాధాన్యత ఇచ్చాం. ఈ రోజు వీరి ఊర్లకు ఒక్క విత్తనం గానీ, యూరియా గుళిక కూడా బయట నుండి రాదు. ’ అని ఆత్మవిశ్వాసంతో చెప్పారు. ఆయన కేవలం వ్యవసాయ రంగానికే పరిమితం కాలేదు. గ్రామీణ మహిళలకు మీడియా పవర్‌ని అందించాలనే ఆలోచనతో “కమ్యూనిటీ మీడియా ట్రస్ట్”ను ప్రారంభించారు. చదువు లేని దళిత మహిళలను ఫిల్మ్ మేకర్లుగా తీర్చిదిద్దారు. అలాగే “సంగం రేడియో” అనే గ్రామీణ కమ్యూనిటీ రేడియోను ప్రారంభించి, రైతమ్మల గొంతుకను ప్రపంచానికి వినిపించే వేదికను కల్పించారు. దేశ, విదేశాలలో అనేక సంస్థల్లో ఆయన కీలక పాత్ర పోషించారు. మిల్లెట్ నెట్‌వర్క్ ఆఫ్ ఇండియా, సౌత్ అగైనెస్ట్ జెనెటిక్ ఇంజినీరింగ్ వంటి వేదికల ద్వారా వ్యవసాయం, ఆహారం, పర్యావరణంపై ప్రజా ఉద్యమాలను బలపరిచారు. ఆయన కృషి అంతర్జాతీయ స్థాయిలో కూడా ప్రశంసలు పొందింది. సతీష్ జీవితం ఒక ఉద్యమం. ఆకలి, పోషకాహార లోపం, భూసార నష్టం, జీవ వైవిధ్యం, వంటి సమస్యలన్నింటికీ ఒక సమగ్ర పరిష్కారం కోసం ఆయన చేసిన ప్రయాణం అసాధారణం. ఈ రోజు మనం మిల్లెట్ల గురించి గర్వంగా మాట్లాడుతున్నాం. ఆరోగ్యకర ఆహారం, సుస్థిర వ్యవసాయం గురించి చర్చిస్తున్నాం. కానీ ఈ మార్పు వెనుక ఉన్న నిశ్శబ్ద విప్లవకారులను గుర్తు చేసుకోవడం కూడా అంతే అవసరం. పి.వి. సతీష్ అలాంటి అరుదైన వ్యక్తి. ఆయన మరణం (18.3.3023) ఒక శూన్యం. కానీ ఆయన చూపిన మార్గం ఒక వెలుతురు కిరణం. ఆ వెలుగు గ్రామాల్లో, రైతుల చేతుల్లో, మహిళల సంఘాల్లో, మిల్లెట్ పొలాల్లో వ్యాపించింది.

“పి.వి. సతీష్ నిజమైన వ్యవసాయ విప్లవకారుడు. అత్యంత బడుగు వర్గాల ఆహార స్వావలంబన, మీడియా స్వాతంత్ర్యం, స్వయం సమ ద్ధిలో మార్పులకు నాంది పలికారు.జహీరాబాద్ సమీప గ్రామాల్లో 5000 మంది చిన్న మహిళలను స్వయం పోషక రైతులుగా మార్చారు.

శ్యాంమోహన్ (వ్యవసాయ గ్రామీణ జీవనంపై అధ్యయనం చేస్తున్న జర్నలిస్టు )



శ్యాంమోహన్
9440595858

# వాక్పటిమ నుంచి వాగ్వాదం వరకు

చట్ట సభలు ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతిష్ఠాత్మక వేదికలు. ఇక్కడ వినిపించే ప్రతి పదం ప్రజల రాజకీయ సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. “నాడు – నేడు” అనే కోణంలో పరిశీలిస్తే, ఒకప్పుడు గౌరవప్రదమైన, శాస్త్రీయమైన భాషకు నిలయంగా ఉన్న చట్ట సభలు, నేడు కొన్నిసార్లు రికార్డుల్లో చోటు పొందలేని అసభ్య, అవమానకర పదజాలంతో కూడా ముడి పడుతున్న దృశ్యం కనిపిస్తోంది. స్వాతంత్ర్యానంతర కాలంలో తొలి లోక్‌సభలు, రాష్ట్ర శాసన సభలు ఒక విలక్షణ విద్యామండలి వలె ఉండేవి. సభలో మాట్లాడే ప్రతి సభ్యుడు తన వాక్చాతుర్యాన్ని, విషయ పరిజ్ఞానాన్ని, సంస్కారాన్ని ప్రతిబింబించేలా మాట్లాడేవాడు. “గౌరవ సభ్యుడు”, “మహా నీయులైన స్పీకర్ గారు” వంటి సంభాషణా పద్ధతులు సభా సంప్రదాయంగా ఉండేవి. వ్యక్తిగత విమర్శలకు తావివ్వకుండా, అంశపరమైన చర్చలకే ప్రాధాన్యం ఉండేది. ఆ కాలంలో ఉపయోగించిన పదజాలం రికార్డుల్లో నిలిచేలా శుద్ధంగా, సాహిత్య పరిమళంతో ఉండేది. అయితే కాలక్రమేణా రాజకీయ వ్యవస్థలో పోటీ పెరగడం, మీడియా ప్రభావం, ప్రత్యక్ష ప్రసారాల విస్తరణ వంటి కారణాలతో చట్ట సభల భాషలో మార్పులు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా 1980 ల తర్వాత ఈ మార్పు వేగవంతమైంది. సభలు ప్రజల దృష్టిని ఆకర్షించే వేదికలుగా మారడంతో, కొంతమంది సభ్యులు కఠిన పదజాలాన్ని ఉపయోగించడం ప్రారంభించారు. నేటి పరిస్థితుల్లో, చట్ట సభలలో వినిపించే కొన్ని పదజాలాలు అధికారిక రికార్డుల్లో నమోదు చేయడానికి అనర్హంగా పరిగణించ బడుతున్నాయి. వీటిని “అన్‌పార్లమెంటరీ ఎక్స్‌ప్రెషన్స్”గా పిలుస్తారు. పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల నియమావళి ప్రకారం, వ్యక్తిగత అవమానాలు, అసభ్య పదాలు, కించపరిచే వ్యాఖ్యలు.. ఇవి రికార్డుల నుండి తొలగించ బడతాయి. తెలుగు రాష్ట్రాల శాసనసభల్లో తరచుగా వినిపించి, తరువాత రికార్డుల నుండి తొలగించబడిన కొన్ని అన్‌పార్లమెంటరీ పదజాలాల ఉదాహరణలు పరిశీలిస్తే పరిస్థితి స్పష్టమవుతుంది. ఉదాహరణకు “దొంగ”, “మోస గాడు”, “అబద్ధకోరు”, “నిర్లజ్జుడు”, “అసమర్థుడు”, “దుర్మార్గుడు” వంటి పదాలు వ్యక్తిగత దూషణలకు చెందినవిగా పరిగణించబడి రికార్డుల్లో నిలవవు. అలాగే “చెత్త ప్రభుత్వం”, “అవినీతి కూపం”, “పిచ్చి నిర్ణయం”, “బుద్ధిలేని చర్య” వంటి వ్యాఖ్య లు కూడా సందర్భానుసారం తొలగించ బడతాయి. కొన్నిసార్లు “గద్దె దిగిపో”, “నీవు అర్హుడు కావు”, “నీకు సంస్కారం లేదు” వంటి వ్యాఖ్యలు కూడా సభా గౌరవానికి భంగం కలిగించేవిగా భావించ బడతాయి. పార్లమెంట్, శాసన సభలలో సమావేశాల సంఖ్య కూడా తగ్గింది. 1950లలో సంవత్సరానికి సగటున 120 రోజులు సమావేశాలు జరిగేవి. ప్రస్తుతం అది 60–70 రోజులకు పరిమితమైంది. అదే సమయంలో, అంతరాయాలు, నినాదాలు, నిరసనలు పెరగడం వల్ల చర్చలకు లభించే సమయం తగ్గింది. 16వ లోక్‌సభలో సుమారు 40 శాతం సమయం అంతరాయాలకు గురైనట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. ఈ వాతావరణంలో భావోద్వేగ పూరిత, కొన్నిసార్లు అసభ్య పదజాలం వినిపించడం ఎక్కువైంది. సోషల్ మీడియా ప్రభావం కూడా భాషపై తీవ్రంగా పడింది. తక్షణ స్పందనల సంస్కృతి కారణంగా రాజ కీయ నాయకులు ఘాటైన వ్యాఖ్యలకు అలవాటు పడిపోయారు. అదే ధోరణి చట్ట సభలలోనూ కనిపిస్తోంది. స్పీకర్‌లు, చైర్మన్‌లు కఠినంగా వ్యవహరించాలి. సభ్యులకు పార్లమెంటరీ ప్రవర్తనపై శిక్షణ ఇవ్వాలి. ప్రతి సభ్యుడు తన మాటల ప్రభావాన్ని గుర్తించి, బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. మొత్తంగా చూస్తే, నాడు చట్ట సభల భాష ఒక ఆదర్శంగా నిలిచిం ది. నేడు కొన్ని సందర్భాల్లో అది రికార్డు ల్లో చోటు పొందలేని స్థాయికి దిగజారింది. “దొంగ”, “మోసగాడు”, “నిర్లజ్జు డు”, “చెత్త ప్రభుత్వం”, “పిచ్చి నిర్ణయం” వంటి పదజాలాల వినియోగం పెరగడం ప్రజాస్వామ్యానికి హెచ్చరిక.




సంగనబట్ల
9440595494



# జాతీయం-అంతర్జాతీయం



## ట్రంప్ రాతియుగం హెచ్చరికపై ఇరాన్ వార్నింగ్



**వుదయం డెస్క్, ఏప్రిల్ 2 :**
ఇరాన్ తమతో ఒప్పందానికి రావాలని.. లేకపోతే ఆ దేశాన్ని రాతియుగానికి తీసుకెళ్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికలకు ఇరాన్ సైన్యం తీవ్రంగా స్పందించింది. అమెరికా శాశ్వత అవమానం, ఓటమినీ ఎదుర్కొనేంత వరకు మధ్య ప్రాచ్యంలో యుద్ధం కొనసాగుతుందని హెచ్చరించింది. అమెరికా, ఇజ్రాయెల్ బలగాలపై మరింత శక్తివంతమైన, విస్తృతమైన, విధ్వంసక దాడులను ప్రారంభిస్తామని ఇరాన్‌కు చెందిన ఖతమ్ అల్అన్బియా కేంద్ర ప్రధాన కార్యాలయ ప్రతినిధి హెచ్చరించారు. తమ సైనిక సామర్థ్యాలు గణనీయంగా బలహీన పడ్డాయన్న ట్రంప్ వాదనలను ఆయన తోసిపుచ్చారు.

రాబోయే రెండు మూడు వారాల్లో, ఇరాన్‌ను దానికి తగిన స్థానమైన రాతి యుగానికి తిరిగి నెట్టివేస్తామని అమెరికా అధ్యక్షుడు వ్యాఖ్యానించిన కొన్ని గంటల తర్వాత ఈ ప్రకటన వెలువడింది. అమెరికా దళాలు తమ యుద్ధ రంగ లక్ష్యాలన్నింటినీ అతి త్వరలోనే సాధిస్తాయని కూడా ఆయన పేర్కొన్నారు. మా సైనిక శక్తి, పరికరాలకు సంబంధించిన మీ నిఘా సమాచారం అసంపూర్ణం. మా విస్తృతమైన వ్యూహాత్మక సామర్థ్యాల గురించి మీకు ఏమీ తెలియదు, అని ఇబ్రహీం జుల్ఫఘారి జారీ చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

ట్రంప్ వాదనకు నేరుగా స్పందిస్తూ, ఇరాన్ వ్యూహాత్మక క్షిపణి ఉత్పత్తి కేంద్రాలను అమెరికా దళాలు ధ్వంసం చేశాయని భావించవద్దని జొల్ఫఘారి వాషింగ్టన్‌కు చెప్పారు. క్షిపణి ఉత్పత్తి కేంద్రాలు, సుదూర దాడి, ఖచ్చితత్వ డ్రోన్‌లు, ఆధునిక వాయు రక్షణ వ్యవస్థలు, ఎలక్ట్రానిక్ యుద్ధ సామర్థ్యాలతో సహా కీలకమైన రక్షణ ఆస్తులు చెక్కుచెదరకుండా, కార్యాచరణలో ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు.

ఇటువంటి ఊహాగానాలు మీరు చిక్కుకున్న సాలెగూటిని మరింత జటిలం చేస్తాయి, అని ఆయన అన్నారు.

తన టీవీ ప్రసంగంలో, ఇరాన్ వద్ద మిసైల్ లాంచర్లు చాలా తక్కువ సంఖ్యలో మాత్రమే మిగిలి ఉన్నాయని, అలాగే క్షిపణులు, డ్రోన్‌లను ప్రయోగించే దాని సామర్థ్యం భారీగా కుదించినట్టు ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా దాడి చేసిన ప్రదేశాలు "అంతగా ప్రాధాన్యత లేనివి" అని, "మా వ్యూహాత్మక సైనిక ఉత్పత్తి, మీకు తెలియని, మీరు ఎప్పటికీ చేరుకోలేని ప్రదేశాలలో జరుగుతుంది అని ఆ అధికారి వెల్లడించారు.

మా క్షిపణులు, డ్రోన్‌లు, వ్యూహాత్మక వ్యవస్థలను లెక్కించడానికి ప్రయత్నించవద్దు; మీరు పొరబడతారు, ఏమీ సాధించలేరు. అమెరికా, ఇజ్రాయెల్ బలగాలే దాడులను ప్రారంభించాయని ఆరోపిస్తూ, తమ ప్రతీకారం కొనసాగిస్తామని శపథం చేశారు. మరిన్ని దాడులు జరుగుతాయని ఆ ప్రతినిధి హెచ్చరించారు. మీరు శాశ్వత అవమానం, పశ్చాత్తాపం, ఓటమిని ఎదుర్కొనే వరకు ఈ యుద్ధం కొనసాగుతుంది. మీరు ఇప్పటికే పొందిన తీవ్రమైన దెబ్బలకు కొనసాగింపుగా, మా నుండి మరిన్ని తీవ్రమైన, వినాశకరమైన దాడులను ఆశించండి,అని జొల్ఫఘారి అన్నారు.

సెంట్రల్ ఖతమ్ అల్అన్బియా ప్రధాన కార్యాలయం ఇరాన్ అత్యున్నత కార్యాచరణ కమాండ్ యూనిట్. ఇది ఇరాన్ సైన్యం, ఇస్లామిక్ రివల్యూషన్ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) మధ్య కార్యకలాపాలను సమన్వయం చేస్తుంది.

## ఇరాన్ యురేనియం కోసం ప్రణాళిక

**వుదయం డెస్క్, ఏప్రిల్ 2 :**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాల మేరకు, ఇరాన్ వద్ద ఉన్న యురేనియం నిల్వలను స్వాధీనం చేసుకునేందుకు అమెరికా సైన్యం ఒక అత్యంత ప్రమాదకరమైన ప్రణాళికను రూపొందించింది. అధికారులు అపూర్వమైన, సంక్లిష్టమైన మిషన్‌గా అభివర్ణిస్తున్న దానిలో భాగంగా, ఈ ప్రతిపాదన ఇరాన్ లోపల వందల, బహుశా వేల సంఖ్యలో అమెరికన్ సైనికులను మోహరించాలని భావిస్తోంది.

**ప్రణాళికలో ఏముంది**
ఈ ఆపరేషన్ ఇస్ఫహాన్, నతాంజ్ వంటి పటిష్టమైన అణు స్థావరాల లోపల లోతుగా నిల్వ ఉన్న యురేనియంను లక్ష్యంగా చేసుకుంటుంది. గతంలో జరిగిన వైమానిక దాడుల తర్వాత, ఈ పదార్థంలో అధిక భాగం శిథిలాల కింద పూడిపోయిందని భావిస్తున్నారు, దీనివల్ల దానిని వెలికితీయడం కష్టంగా మారింది. ఆ నివేదిక ప్రకారం, ఇరాన్ లోపలి నుండి 1,000 పౌండ్ల కంటే ఎక్కువ రేడియోధార్మిక పదార్థాన్ని స్వాధీనం చేసుకోవడం ఈ ప్రతిపాదనలో ఇమిడి ఉంది. అయితే, ఈ మిషన్ ఒక సంప్రదాయ దాడి కాదు. కానీ శత్రు భూభాగం లోపల అత్యంత లోతుగా, భారీ ఎత్తున, క్షేత్రస్థాయిలో విస్తృతమైన ఆపరేషన్‌ను చేపట్టడం దీనికి అవసరమవుతుందని ఆ నివేదిక పేర్కొంది.

## మాల్దాలో పరిణామాలపై సుప్రీంకోర్టు ఆగ్రహం

### ఉన్నతాధికారులకు నోటీసులు జారీ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (వుదయం) :**
పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా జిల్లాలో ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (సర్)లో నిమగ్నమై ఉన్న న్యాయ అధికారులకు జరిగిన హింస, దుష్ప్రవర్తన ఆరోపణలను సుప్రీం కోర్టు బుధవారం సుమోటోగా స్వీకరించింది. పరిపాలనా లోపాలు, శాంతిభద్రతలపై ఇది తీవ్ర ఆందోళనలను రేకెత్తించింది. ఈ సంఘటనను వివరిస్తూ కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అత్యున్నత న్యాయస్థానానికి నివేదించిన తర్వాత భారత ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం ఈ అంశాన్ని విచారిస్తోంది.

**ఉన్నతాధికారులకు షోకాజ్ నోటీసులు జారీ**
తమ అసంతుష్టిని వ్యక్తం చేస్తూ, సుప్రీం కోర్టు పశ్చిమ బెంగాల్ ప్రధాన కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి), మాల్దా జిల్లా మేజిస్ట్రేట్, ఎస్పీకి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వారిపై చర్య ఎందుకు తీసుకోకూడదో వివరించవలసిందిగా కోరారు. ఏప్రిల్ 6న జరుగనున్న ఆన్‌లైన్ విచారణ సమయంలో సంబంధిత అధికారులందరూ హాజరు కావాలని కోర్టు ఆదేశించింది. ఈ సంఘటనపై ఒక స్వతంత్ర సంస్థ ద్వారా విచారణ జరిగేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని ధర్మాసనం పేర్కొంది. ఇందుకోసం సిబిఐ లేదా ఎన్ ఐఎ వంటి సంస్థలను పరిగణించవచ్చని సూచించింది. అంతేకాక, విచారణ సంస్థ తన నివేదికను నేరుగా సుప్రీం కోర్టుకే సమర్పించాలని న్యాయస్థానం ఆదేశించింది.

**అర్ధరాత్రి 2 గంటల వరకు పర్యవేక్షిస్తూనే ఉన్నాం': సీజేఐ**
సంఘటనల క్రమాన్ని వివరిస్తూ, పరిస్థితి తీవ్రంగా ఉన్నప్పటికీ మాల్దా డీఎం, ఎస్పీ ఘటనా స్థలానికి చేరుకోవడంలో విఫలమయ్యారని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీజీపీని సంప్రదించిన తర్వాతే, అర్ధరాత్రి దాటిన తర్వాత చిక్కుకుపోయిన న్యాయాధికారులను తరలించడం సాధ్యమైందని ఆయన తెలిపారు. అప్పుడు కూడా ఆ ప్రాంతాన్ని వదిలివెడుతున్న సమయంలో అధికారులు రాళ్ల దాడిని ఎదుర్కోవలసి వచ్చినట్టు తెలుస్తోంది. ఆ దుండగలు ఎవరో మాకు తెలియదని మీరు అనుకుంటున్నారా? అర్ధరాత్రి 2 గంటలవరకూ పరిస్థితిని పర్యవేక్షిస్తూనే ఉన్నానని సిజెఐ వ్యాఖ్యానిస్తూ, పరిణామాలను న్యాయస్థానం ఎంత నిశితంగా గమనిస్తోందో సూచించారు. దురదృష్టవశాత్తు, మీ రాష్ట్రంలోని ప్రతి అధికారి రాజకీయ భాషనే మాట్లాడుతున్నారు అని వ్యాఖ్యానిస్తూ, ధర్మాసనం పశ్చిమ బెంగాల్ అడ్వకేట్ జనరల్‌ను మందలించింది.

**ముందస్తు హెచ్చరికలను విస్మరించారా?**
ఎన్నికల సన్నద్ధతపై కూడా ఈ పరిణామాలు ప్రశ్నలను లేవనెత్తాయి. న్యాయాధికారులు అంతకుముందు మార్చి 23న, అశాంతి చోటు చేసుకోవచ్చని జిల్లా యంత్రాంగం వద్ద ఆందోళన వ్యక్తం చేసి, కార్యకలాపాలను బ్లాక్ కార్యాలయం నుండి జిల్లా ప్రధాన కార్యాలయానికి మార్చాలని అభ్యర్థించారు. అయితే, కోర్టు ఎదుట ఉన్న సమాచారం మేరకు, అధికారులు ఎటువంటి నిరోధక చర్యలు తీసుకోలేదు. సర్ ప్రక్రియలో నిమగ్నమైన న్యాయాధికారులకు తగిన భద్రత, సౌకర్యాలను కల్పించాలని సుప్రీం కోర్టు గతంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. మార్చి 10న జరిగిన విచారణ సందర్భంగా, అనర్హులైన ఓటర్లను గుర్తించడంలో వారి పాత్రకు సంబంధించి న్యాయాధికారులను ప్రశ్నించకూడదని ప్రధాన న్యాయమూర్తి కూడా నొక్కి చెప్పారు.

**ఎన్నికలకు ముందు రాజకీయ ఉద్రిక్తత**
ఏప్రిల్ 23, ఏప్రిల్ 29 తేదీల్లో రెండు దశల్లో జరగనున్న పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు, రాజకీయ ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న తరుణంలో ఈ వివాదం చెలరేగింది; ఈ ఎన్నికల ఓట్ల లెక్కింపు మే 4న జరగనుంది. సర్ ప్రక్రియ ఇప్పటికే ఒక ప్రధాన రాజకీయ సమస్యగా మారింది, అధికార, ప్రతిపక్ష పార్టీలు పరస్పరం తీవ్రమైన ఆరోపణలు చేసుకుంటున్నాయి. నాలుగు అనుబంధ ఓటర్ల జాబితాలు విడుదలైనప్పటికీ, చాలా మంది ఓటర్లు తమ పేర్లు అందులో ఉంటాయో లేదో అనే విషయంలో అనిశ్చితితో ఉన్నారని సమాచారం, ఇది ప్రజల ఆందోళనను మరింత పెంచుతోంది.

### కాలియాచక్‌లో గందరగోళం: న్యాయాధికారుల బందీ

ఓటర్ల జాబితా నుండి తమ పేర్లను తొలగించారన్న ఆరోపణలపై కాలియాచక్‌లో చెలరేగిన నిరసనలు తీవ్రస్థాయికి చేరి, పెద్ద ఎత్తున అశాంతికి దారితీశాయి. నిరసనకారులు రోడ్లను దిగ్బంధించి, నిప్పుపెట్టి, వాహనాలను ధ్వంసం చేశారని, దీంతో ఆ ప్రాంతం హింసాత్మక ఘటనలకు కేంద్రంగా మారిందని సమాచారం. హైకోర్టు ఎస్ఐఆర్ సంబంధిత పనుల నిమిత్తం నియమించిన ముగ్గురు మహిళలతో సహా ఏడుగురు న్యాయాధికారులను ఒక బ్లాక్ డెవలప్‌మెంట్ కార్యాలయంలో చుట్టుముట్టి, చాలా గంటలపాటు నిర్బంధించినట్లు ఆరోపణలు వచ్చాయి. చివరకు అర్ధరాత్రి సమయంలో కేంద్ర బలగాల రక్షణతో వారిని రక్షించారు. వారిని ఖాళీ చేయించిన తర్వాత కూడా, రోడ్లపై బారికేడ్లు పెట్టి వారి రాకపోకలను అడ్డుకునేందుకు ప్రయత్నాలు జరిగాయని, దీంతో ఆ ప్రాంతం నుండి ఉద్రిక్తమైన, కష్టతరమైన నిష్క్రమణకు దారితీసిందని సమాచారం.

## భారతీయ మిత్రులు సురక్షితం: ఇరాన్



**వుదయం డెస్క్, ఏప్రిల్ 2(వుదయం) :**
ఇజ్రాయెల్, అమెరికా ఫిబ్రవరి 28న తెహ్రాన్‌పై దాడి చేసినప్పటి నుంచి అంతరాయానికి గురైన కీలక నౌకా రవాణా మార్గమైన హొర్ముజ్ జలసంధి గురించి తమ భారతీయ మిత్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని" ఇరాన్ పేర్కొంది. మా భారతీయ మిత్రులు సురక్షితమైన చేతుల్లో ఉన్నారు, ఆందోళన అక్కర్లేదు అంటూ భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం గురువారం ఎక్స్‌పై పోస్టు చేసింది.

ప్రపంచ ఇంధనంలో 20 శాతం రవాణా అయ్యే నౌకామార్గమైన హొర్ముజ్ జలసంధి ఇరాన్ నియంత్రణలో ఉంది. గత నెలలో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచీ, కొద్ది నౌకలు మాత్రమే ఆ మార్గంలో ప్రయాణించేందుకు ఇరాన్ అనుమతించింది. భారతదేశం, చైనా, రష్యా, ఇరాక్, పాకిస్తాన్‌లతో సహా మిత్ర దేశాలకు హొర్ముజ్ గుండా రాకపోకలకు అనుమతి ఇచ్చినట్లు ఇరాన్ తెలిపింది. ఈ దిగ్బంధం కారణంగా, భారతదేశంతో సహా అనేక దేశాలకు ఇంధన సరఫరాలో తీవ్ర అంతరాయాలు ఏర్పడ్డాయి.

**హొర్ముజ్ నుండి నిష్క్రమించిన 8 భారతీయ నౌకలు**
ఇప్పటివరకు కనీసం ఎనిమిది భారతీయ నౌకలు హొర్ముజ్ జలసంధిని దాటి నిష్క్రమించాయి. వీటిలో బిడ్ల్యు టివైఆర్, బిడబ్ల్యుఇఎల్ ఎం అనే రెండు ఎల్‌పిజి రవాణా నౌకలు ఉన్నాయి. ఇవి మొత్తంగా సుమారు 94,000 టన్నుల ఎల్‌పిజిని రవాణా చేస్తున్నాయి.

ఎల్‌పిజి, ముడి చమురు, ఎల్ ఎన్‌జిని తీసుకుని భారత్‌కు రావలసిన 19 నౌకలు ప్రస్తుతం హొర్ముజ్‌లో చిక్కుకుపోయి ఉన్నాయని అధికారులు తెలిపారు.

మధ్య ప్రాచ్యంలో చోటు చేసుకుంటున్న పరిణామాల ఫలితాల గురించి వివరిస్తూ, భారత్‌కు ఉద్దేశించిన ఇంధన సరుకుతో విదేశీ జెండాలు కలిగిన 10 నౌకలు ప్రస్తుతం అక్కడ చిక్కుకుపోయి ఉన్నట్టు రేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ కుమార్ సిన్హా తెలిపారు. ఇందులో 3 నౌకలు ఎల్‌పిజిని, నాలుగు ముడిచమురు ట్యాంకర్లను, మూడు నౌకలు లిక్విఫైడ్ నాచురల్ గ్యాస్‌ను తీసుకువస్తున్నాయి.

ఇవి కాకుండా, భారతీయ జెండాతో వస్తున్న నౌకలు కూడా ఉన్నాయి. ఇందులో మూడు ఎల్పీజీ ట్యాంకర్లు, ఒక ఎల్ ఎన్‌జి నౌక, నాలుగు ముడి చమురు టాంకర్లు ఉన్నాయి. ఒక ఖాళీ ట్యాంకర్‌లో ఎల్‌పిజి నింపుతున్నారు. సంఘర్షణ సమయంలో ఆ ఇరుకైన జలసంధిలో ఇరుక్కుపోయిన సుమారు 500 నౌకలలో ఈ నౌకలు కూడా ఉన్నాయి.

## వైఫల్యం ఎన్నికల సంఘానిదే



**కోల్‌కత, ఏప్రిల్ 2 (వుదయం) :**
సుప్రీం కోర్టు నుండి తీవ్ర విమర్శలను ఎదుర్కొన్న మాల్దా ఘటన నుంచి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గురువారం నాడు పూర్తి రాజకీయ చతురతను ప్రదర్శించారు. శాంతిభద్రతల నిర్వహణ తన చేతుల్లో లేదన్నారు. అధికారులను కాపాడటంలో ఎన్నికల సంఘం విఫలమైందంటూ, సంస్థను బాధ్యురాలిని చేశారు.

ప్రధాన కార్యదర్శి, డీజీపీ తనను సంప్రదించడం మానేశారన్నారు. తన నుండి అన్ని అధికారాలనూ లాగేసుకున్నారు కాబట్టి, శాంతిభద్రతలను పరిరక్షించే బాధ్యత ఇప్పుడు వారిదే, అని బెనర్జీ అన్నారు. మాల్దాలో న్యాయాధికారులను ముట్టడించిన ఘటనపై సుప్రీం కోర్టు రాష్ట్ర యంత్రాంగాన్ని తీవ్రంగా మందలించి, ఆ సంఘటనను ముందస్తు ప్రణాళికతో కూడినదిగా అభివర్ణిస్తూ, సీనియర్ అధికారుల స్పందనను విమర్శించిన నేపథ్యంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.

**ఎన్నికల సంఘంపై మమత ఆరోపణలు**
ప్రత్యేక విస్తృత సవరణ (సర్) ప్రక్రియలో నిమగ్నమైన న్యాయాధికారులకు భద్రత కల్పించడంలో ఎన్నికల సంఘం పూర్తిగా విఫలమైందని బెనర్జీ ఆరోపించారు. న్యాయాధికారులకు రక్షణ కల్పించడంలో విఫలమైనందుకు ఎన్నికల సంఘాన్ని నేను ఖండిస్తున్నాను, అని ఆమె ముర్షిదాబాద్‌లో జరిగిన ఒక బహిరంగ సభలో అన్నారు.

అసెంబ్లీ ఎన్నికల ప్రకటన వెలువడిన తర్వాత, ఎన్నికల సంఘం కీలకమైన పరిపాలనా, పోలీసు పదవుల్లో తమ సొంత అధికారులను నియమించి, నియంత్రణను తమ చేతుల్లోకి తీసుకుందని ఆమె ఆరోపించారు. నా అధికారాలన్నీ లాగేసుకున్నారు. ఇలాంటి ఎన్నికల సంఘాన్ని నేను ఇంతకు ముందెన్నడూ చూడలేదు, అని ఆమె అన్నారు.రాష్ట్రంలో ఎన్నికల రద్దుకు, రాష్ట్రపతి పాలన విధించడానికి దారితీసే పరిస్థితులను సృష్టించడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని బెనర్జీ ఆరోపించారు.

**నాకు సమాచారం ఇవ్వలేదు: మమత**
ఈ ఘటన గురించి ఉన్నతాధికారులు తనకు సమాచారం ఇవ్వలేదని, మీడియా ద్వారానే తనకు ఈ విషయం తెలిసిందని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రధాన కార్యదర్శి నాకు సమాచారం ఇవ్వలేదు. పాత్రికేయుల ద్వారానే నాకు ఈ విషయం తెలిసింది. వారు రాష్ట్రాన్ని అవమానించడానికి ప్రయత్నించారు. మనం ఇంకెంత అవమానాన్ని భరించాలి? అని ఆమె ప్రశ్నించారు.

## సహకరించడానికి రష్యా సిద్ధం



**వుదయం డెస్క్, ఏప్రిల్ 2 :**
ఇరాన్‌లో నెలకొన్న సైనిక పరిస్థితిని వీలైనంత త్వరగా పరిష్కరించడంలో సహకరించడానికి రష్యా సిద్ధంగా ఉందని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ గురువారం పేర్కొన్నారు. ఇరాన్ యుద్ధం గురించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇచ్చిన ఉపన్యాసం గురించి అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ, ప్రాంతీయ నాయకులతో చర్చించడాన్ని వ్లాదిమిర్ పుతిన్ కొనసాగిస్తున్నారని పెస్కోవ్ తెలిపారు. ఈ సంప్రదింపులను పుతిన్ కొనసాగిస్తున్నారు. ఒకవేళ మా సేవలు ఏ విధంగానైనా అవసరమైతే, సైనిక పరిస్థితి వీలైనంత త్వరగా శాంతియుత మార్గంలోకి మళ్లేలా చూడటంలో మా వంతు సహకారం అందించడానికి మేం నిస్సందేహంగా సిద్ధంగా ఉన్నాం, అని పెస్కోవ్ విలేకరులతో అన్నారు.

ఒకవైపు యుద్ధాన్ని త్వరగా ముగుస్తుందంటూనే, మరోవైపు ఇది రెండు నుంచి మూడు వారాలు కొనసాగవచ్చంటూ డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటన తర్వాత కొద్ది గంటల్లోనే ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి.

అమెరికా సైనిక చర్య అయిన ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీలో ప్రధాన విజయాలను సాధించామని వైట్‌హౌజ్ నుంచి చేసిన ఉపన్యాసంలో ట్రంప్ పట్టిచూపుతూ, యుద్ధం సుదీర్ఘకాలం కొనసాగదనే తన ఇటీవలి సందేశాన్ని పునరుద్ఘాటించారు. సాధ్యమైనంత త్వరగా దీనిని ముగిస్తామని ఆయన అన్నారు. ఒకవైపు రానున్న రెండు నుంచి మూడు వారాల్లో ఇరాన్‌పై తీవ్ర దాడులు చేసేందుకు యుఎస్ సిద్ధంగా ఉందంటూ, ఉద్రిక్తతలు పెరిగే అవకాశాన్ని పట్టిచూపారు. దీనితో యుద్ధం మరింత కాలం కొనసాగుతుందనే భావన నెలకొంది. అదే సమయంలో దౌత్యపరమైన చర్చలు నడుస్తున్నాయని, తద్వారా, తీవ్రమైన వాగ్వివాదాలు ఉన్నప్పటికీ, చర్చల ద్వారా సమస్య పరిష్కారమయ్యే అవకాశాన్ని పూర్తిగా కొట్టిపారేయలేదని ఆయన సూచించారు.

## రాజ్యసభలో ఆప్‌కు కొత్త డిప్యూటీ నాయకుడు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (వుదయం) :**
రాజ్యసభలో ఆమ్ ఆద్మీ పార్టీ కొత్త డిప్యూటీ నాయకుడిగా అశోక్ కుమార్ మిట్టల్ బాధ్యతలు చేపట్టనున్నారని ఆ పార్టీ గురువారం తెలిపింది. ఈ నిర్ణయం గురించి రాజ్యసభ సచివాలయానికి తెలియజేసినట్లు కూడా ఆ పార్టీ పేర్కొంది. రాఘవ్ చద్దాను ఆ పదవి నుండి తొలగించాలన్న పార్టీ అభ్యర్థనను అనుసరించి ఈ చర్య తీసుకున్నారు. పంజాబ్ నుండి రాజ్యసభ సభ్యుడైన మిట్టల్ ఆ బాధ్యతలను స్వీకరించే అవకాశం ఉంది.

పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, పంజాబ్ నుండి రాజ్యసభ సభ్యుడిగా ఉన్న చద్దాకు, సభలో మాట్లాడేందుకు ఆప్ (ఆప్) కోటా నుండి సమయం కేటాయించకూడదని కూడా ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం రాజ్యసభలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి 10 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో ఏడుగురు పంజాబ్ నుంచి, ముగ్గురు ఢిల్లీ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

పార్టీ జాతీయ కన్వీనర్ తనకు రాజ్యసభలో ఆప్ డిప్యూటీ నాయకుడి బాధ్యతలను అప్పగించారని మిట్టల్ విలేకరులకు తెలిపారు. తాను తన విధులను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తూ, సభలో పార్టీ వైఖరిని, జాతీయ ప్రయోజనాలను బలంగా వినిపిస్తానని పేర్కొన్నారు. ఈ మార్పు ప్రాధాన్యతను తగ్గిస్తూ, ఆయన దీనిని ఒక సాధారణ ప్రక్రియగా అభివర్ణించారు. గతంలో ఎగువ సభలో పార్టీ డిప్యూటీ నాయకుడిగా ఎన్.డి. గుప్తా వ్యవహరించారని, ఆ తర్వాత ఆ బాధ్యతను చద్దాకు అప్పగించారని ఆయన గుర్తుచేశారు. ఇప్పుడు, నాకు ఈ బాధ్యత అప్పగించారు. తమ ఎంపీలందరూ విషయాలను నేర్చుకోవాలని మా పార్టీ కోరుకుంటుంది. బహుశా ఆ ఉద్దేశంతోనే, నాకు ఈ బాధ్యతను అప్పగించి ఉండవచ్చు, అని పేర్కొంటూ, పార్టీ ఇప్పటికీ బలంగానే ఉందని స్పష్టం చేశారు. ముఖ్యంగా, మిట్టల్ ఏప్రిల్ 2022లో సభకు ఎన్నికయ్యారు. అప్పటి నుండి, ఆయన రక్షణ కమిటీ, ఆర్థిక కమిటీలతో సహా పలు పార్లమెంటరీ కమిటీలలో సభ్యుడిగా కొనసాగుతున్నారు. అలాగే ఫిబ్రవరి 2026లో, ఆయన 'భారతఅమెరికా పార్లమెంటరీ స్నేహ బృందం'లో సభ్యుడిగా నియమితులయ్యారు. గత ఏడాది పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం, డిఎంకె ఎంపీ కనిమొళి నేతృత్వంలో రష్యా, లాట్వియా, స్లోవేనియా, గ్రీస్, స్పెయిన్‌లలో పర్యటించిన అఖిలపక్ష ప్రతినిధి బృందంలో కూడా ఆయన ఒక సభ్యుడిగా ఉన్నారు.

**చద్దా ప్రవర్తనే కారణమా?**
ఆమ్ ఆద్మీ పార్టీకి సంబంధించిన విషయాలపై చద్దా చాలా కాలంగా మౌనం వహించడం, అలాగే ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలో జరిగిన పలు బహిరంగ కార్యక్రమాలకు ఆయన గైర్హాజరు కావడం వంటి పరిణామాల నేపథ్యంలో ఈ చర్య చోటుచేసుకుంది. ఒకప్పుడు కేజ్రీవాల్‌కు అత్యంత సన్నిహితుడిగా, దేశంలోనే అత్యంత పిన్న వయస్కుడైన ఎంపీలలో ఒకరిగా పరిగణించిన చద్దా, పార్టీ వ్యవహారాలలో, ముఖ్యంగా పంజాబ్‌లో, ఢిల్లీలో ఆప్ అధికారంలో ఉన్నప్పుడు కీలక పాత్ర పోషించారు.

అయితే, ఇటీవలి నెలల్లో పరిస్థితులు మారాయి.

మార్చి 2024లో, అప్పటి ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఎక్సైజ్ విధానం కేసులో అరెస్టు అయిన సమయంలో, చద్దా వైద్యపరమైన కారణాల రీత్యా విదేశాల్లో ఉన్నారు. కేజ్రీవాల్ దాదాపు ఆరు నెలలపాటు జైలులో ఉన్న కాలమంతా ఆయన దూరంగానే ఉన్నారు. సెప్టెంబర్ 13, 2024న కేజ్రీవాల్ విడుదలైన కొన్ని రోజుల తర్వాతే చద్దా ఆయన్ని కలిశారు.

ఇటీవలే, గత నెలలో ఎక్సైజ్ కేసులో కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా, ఇతర ఆప్ నాయకులను ఢిల్లీ కోర్టు నిర్దోషులుగా ప్రకటించినప్పుడు చద్దా మౌనం వహించారు. కోర్టు ఉపశమనం కల్పించిన తర్వాత కేజ్రీవాల్ నిర్వహించిన పత్రికా సమావేశానికి, జంతర్ మంతర్ వద్ద జరిగిన ర్యాలీకి కూడా ఆయన హాజరు కాలేదు.

అధిక విమాన ఛార్జీలు, గిగ్ వర్కర్ల దుస్థితి వంటి సమస్యలను పార్లమెంటు లోపల, వెలుపల ఆయన గట్టిగా లేవనెత్తుతున్నప్పటికీ, ఇతర రాష్ట్రాల్లోని రాజకీయ ప్రచారాలు, పార్టీ సంస్థాగత వ్యవహారాల నుంచి చద్దా క్రమంగా పక్కన పెడుతున్నారని పార్టీ నాయకులు ఆరోపించారు.

## బడ్జెట్ సమావేశాలు పొడగింపు ?



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (వుదయం) :**
శాసనసభల్లో మహిళల రిజర్వేషన్‌ను అమలు చేసేందుకు ప్రభుత్వం లోక్సభ స్థానాలను పెంచే బిల్లును తీసుకురావచ్చనే సంకేతాల నడుమ. సభ ప్రస్తుతం వాయిదా, ఒక ముఖ్యమైన బిల్లు కోసం త్వరలోనే సమావేశమవుతుందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు గురువారం రాజ్యసభకు తెలిపారు. ప్రభుత్వ ప్రణాళిక గురించి కాంగ్రెస్ నాయకుడు జయరామ్ రమేష్ ఎగువ సభలో ప్రశ్నించారు.

ఇందుకు స్పందిస్తూ, ఎగువ సభ ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లును, జన విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లును పార్లమెంటు బడ్జెట్ సమావేశాల చివరి రోజుగా నిర్ణయించిన గురువారంనాడు చేపడుతుందని రిజిజు స్పందించారు. మా వద్ద కొన్ని ముఖ్యమైన అంశాలు ఉన్నాయి. ఈ విషయాన్ని మేం ప్రతిపక్షాలతో కూడా పంచుకున్నాం. రాబోయే 23 వారాల్లో మేం ఒక అత్యంత కీలకమైన బిల్లును ప్రవేశపెట్టబోతున్నాం, అని ఆయన వివరించారు. ఈ రోజు, సభను వాయిదా వేయాలని ప్రభుత్వం ప్రతిపాదిస్తుంది, ఆపై మనం త్వరలోనే తిరిగి సమావేశమవుతాం. దీని ఉద్దేశం సభ్యులకు తెలిసినదే, అని ఆయన పేర్కొన్నారు.

మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని అమలు చేసేందుకు, అలాగే లోక్‌సభ స్థానాల సంఖ్యను ప్రస్తుతమున్న 546 నుండి 861కి పెంచే ఉద్దేశంతో నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను జనగణనతో సంబంధం లేకుండా చేసేందుకు, కనీసం రెండు బిల్లులను తీసుకురావడానికి ప్రభుత్వం ప్రతిపక్షాలతో తెర వెనుక చర్చలు జరుపుతోంది. అయితే, ప్రభుత్వం నిర్వహించాలని భావిస్తున్న అఖిలపక్ష సమావేశాన్ని, ఏప్రిల్ 29న అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాతే నిర్వహించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేసినట్లు రమేష్ తెలిపారు. అయితే, దేశంలోని మహిళలకు ఇచ్చిన హామీని నెరవేర్చడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రిజిజు బదులిచ్చారు. కాగా, శాసనసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడానికి కాంగ్రెస్ మద్దతు ఇస్తుందని, అయితే ప్రతిపాదిత బిల్లులు అత్యంత కీలకమైనవని, అవి దీర్ఘకాలిక పర్యవసానాలను కలిగి ఉంటాయని రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ బిల్లులను తీసుకురావడం ద్వారా ప్రభుత్వం రాజకీయ లబ్ధి పొందడానికి ప్రయత్నిస్తోందని కూడా ఆయన ఆరోపించారు. అయితే, రిజిజు ఈ ఆరోపణను ఖండించారు, ఈ అంశాన్ని రాజకీయాకరించకూడదని అన్నారు.




# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ ఉమ్మడి జిల్లాల వార్తలు

## ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికతో గ్రామాభివృద్ధి సాధ్యం



**మహిళల సాధికారతకు కట్టుబాటుడి ఉన్నసీఎం రేవంత్ రెడ్డి**
**దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ**

**వర్ధన్నపేట ఏప్రిల్ 02(వుదయం ప్రతినిధి):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టినదని, గ్రామాభివృద్ధికి ఇది కిలకమని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ అన్నారు. గురువారం వర్ధన్నపేట మండలం కొత్తపెల్లి గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ జిల్లా కలెక్టర్ శ్రీమతి సత్య శారదా దేవి తో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హాజరైనారు.ఈ సందర్భంగా మంత్రి సురేఖ ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం 99 రోజుల కార్యాచరణలో ప్రతి అంశం ముఖ్యమని, గ్రామ సభలను సద్వినియోగం చేసుకుని గ్రామ సమస్యలను ప్రజలే ముందుకు వచ్చి పరిష్కరించుకోవాలని మంత్రి ఎమ్మెల్యే సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించిన ఎమ్మెల్యే, టీఎస్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీమ్ ద్వారా ఆర్థికంగా బలహీన వర్గాలకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు.మహిళల సాధికారత కోసం స్వయం సహాయక సంఘాల బలోపేతం, వడ్డీ రహిత రుణాలు, ఆర్థిక సహాయం వంటి పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. పెన్షన్లు, సహాయక పరికరాలు అందిస్తూ వారి జీవన ప్రమాణాలనుమెరుగుపరుస్తున్నామని చెప్పారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాల ద్వారా గ్రామాలు, పట్టణాల్లో మౌలిక వసతులు అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.తాగునీటి సమస్యల పరిష్కారానికి మిషన్ భగీరథ, సాగునీటి కోసం మిషన్ కాకతీయ వంటి ప్రాజెక్టులు కీలకంగా నిలుస్తున్నాయని మంత్రి సురేఖ ఎమ్మెల్యే నాగరాజు వెల్లడించారు..గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలంటే ప్రజల భాగస్వామ్యం అత్యవసరమని, గ్రామ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి ప్రభుత్వం అందించే అవార్డులను సాధించాలని పిలుపునిచ్చారు.
ఆరోగ్యమే మహాభాగ్యం" అన్న భావనతో ప్రతి ఒక్కరు జీవించాలని ఎమ్మెల్యే నాగరాజు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నాగారం ఆదర్శ గ్రామంగా నిలవాలి
### – జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



**బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించాలి**
**బాలికలను ఉన్నత విద్య వైపు ప్రోత్సహించాలి**
**ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక**
**గ్రామ సభలో కలెక్టర్ వెల్లడి**

**హనుమకొండ, ఏప్రిల్ 2 (వుదయం ప్రతినిధి):** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ, గ్రామస్తుల సహకారంతో నాగారం గ్రామాన్ని జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పిలుపునిచ్చారు. గురువారం హసన్ పర్తి మండలం నాగారంలో సర్పంచ్ సందరాజు లావణ్య అధ్యక్షతన నిర్వహించిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' గ్రామ సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ
సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూత పింఛన్లు వంటి పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. నాగారం గ్రామంలో 800 విద్యుత్ కనెక్షన్లకు గానూ, గృహజ్యోతి కింద రూ. 63 లక్షల ఉచిత విద్యుత్ ప్రయోజనం చేకూరిందన్నారు.
మహిళా శక్తి: మహిళా స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా ఎదగాలని, బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. సంఘాల సమావేశాల్లో కేవలం ఆర్థికాంశాలే కాకుండా గ్రామ అభివృద్ధిపై కూడా చర్చించాలని సూచించారు. సామాజిక బాధ్యతతో ఆదర్శ గ్రామం అంటే కేవలం రోడ్లు, డ్రైనేజీలు మాత్రమే కాదని.. పోషకాహార లోపం, క్షయ వ్యాధి, రక్తహీనత లేని గ్రామంగా ఉండాలని పేర్కొన్నారు. గ్రామంలో 18 ఏళ్లలోపు బాలికలకు బాల్య వివాహాలు చేయకూడదని, వారిని డిగ్రీ వరకు ఉన్నత చదువులు చదివించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కలెక్టర్ కోరారు.అనంతరం ప్రభుత్వ పథకాల పట్ల గ్రామస్తుడు తోట ప్రవీణ్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, వైద్యాధికారి డా. అప్పయ్య, హౌసింగ్ పీడీ సిద్ధార్థ నాయక్, తహసీల్దార్ కిరణ్ కుమార్, ఎంపీడీవో సుమన వాణి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం : మంత్రి సీతక్క



**వెంకటాపూర్ లో మహిళా సమాఖ్య భవనానికి శంకుస్థాపన**
**31 మందికి 'కళ్యాణ లక్ష్మి' చెక్కుల పంపిణీ**
**త్వరలోనే అంగన్‌వాడీల్లో 'తొలి ముద్ద' అల్పాహార పథకం ప్రారంభం**

**ములుగు/వెంకటాపూర్, ఏప్రిల్ 02 (వుదయం ప్రతినిధి) :** ప్రభుత్వ పథకాల అమలుతో పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. గురువారం రోజున వెంకటాపూర్ మండల కేంద్రంలో జరిగిన 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' గ్రామ సభకు ఆమె జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ,...మహిళా సాధికారత ఆర్థిక చేయూత రాష్ట్రంలోని 4.70 లక్షల మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తూ వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతున్నామని మంత్రి తెలిపారు.

**సంక్షేమ పథకాలపై భరోసా**

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల కోసం త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా 'తొలి ముద్ద' పేరుతో అల్పాహార పథకాన్ని ప్రారంభిస్తామని మంత్రి ప్రకటించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి వంటి పథకాలు పారదర్శకంగా అందుతాయని స్పష్టం చేశారు.వెంకటాపూర్ మండలంలోని 31 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు.మహిళలకు కుట్టు మిషన్లు, కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.
ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, పంచాయతీ రాజ్ డైరెక్టర్ భగవాన్ రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## అస్వస్థతకు గురైన విద్యార్థినినీ



**ప్రభుత్వ వాహనంలో ఆసుపత్రికి తరలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**
**జిల్లా కలెక్టర్ స్పందన పై అభినందనలు**

**జయశంకర్ భూపాలపల్లి ఏప్రిల్ 02(వుదయం జిల్లా ప్రతినిధి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఘనపురం మండలం చెల్పూర్ జడ్పీ.ఎస్.ఎస్ ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న పదవతరగతి పరీక్షల కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పరిశీలించడానికి వెళ్లగా ఘనపురం మండలం గాంధీ నగర్ లోని మహాత్మా జ్యోతి భా పులే గురుకుల పాఠశాలలో చదువుతూ పదవతరగతి పరీక్షలు రాస్తున్న" కీర్తన" అనే విద్యార్థిని ఉదయం పరీక్షా కేంద్రానికి వచ్చినప్పటి నుండి అలసటగా ఉందని శ్వాస ఆడడం లేదని ఇబ్బందులు పడుతుండగా పరీక్ష కేంద్రం పరిశీలనకు వెళ్లిన జిల్లా కలెక్టర్ విషయం తెలుసుకొని వెంటనే ప్రభుత్వ వాహనంలో తన వ్యక్తిగత సిబ్బందిని వెంట పంపి స్థానిక ఆసుపత్రికి తరలించారు.
అనంతరం పరీక్ష కేంద్రాన్ని పరిశీలించి తిరిగి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి అస్వస్థతకు గురైన విద్యార్థిని తో మాట్లాడి ధైర్యం చెప్పి తిరిగి పరీక్షా కేంద్రానికి ప్రభుత్వ వాహనంలోనే తరలించారు.జిల్లా కలెక్టర్ స్పందించిన విధానం పట్ల పలువురు జిల్లా కలెక్టర్ ను అభిందిస్తున్నారు.

## పదవ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి



**- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**

**యాదాద్రి భువనగిరి / ఏప్రిల్ వుదయం జిల్లా ప్రతినిధి :** పదవ తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు.గురువారం తుర్కపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పరీక్షా కేంద్రంలో నిర్వహణ ఏర్పాట్లు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. పరీక్షా కేంద్రంలో తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు తదితర అంశాల గురించి అడిగి తెలుసున్నారు.
పరీక్ష పూర్తయిన తర్వాత పోలీస్ బందోబస్తుతో పరీక్ష పేపర్లను జాగ్రత్తగా తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్, యంపి డి ఓ, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి అర్హుడికి సంక్షేమ పథకాలు అందాలి
### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**తరిగొప్పుల గ్రామసభలో లబ్ధిదారులతో ముఖాముఖి**

**జనగామ/తరిగొప్పుల, ఏప్రిల్ 02 (వుదయం ప్రతినిధి) :** ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం క్షేత్ర స్థాయిలో ఉన్న అర్హులందరికీ చేరేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. '99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా గురువారం తరిగొప్పుల మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ,,, సమస్యల సత్వర పరిష్కారం కోసం గ్రామ స్థాయిలోనే ప్రజల సమస్యలను గుర్తించి, వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్య, వైద్య సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు.పథకాలపై రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి, గృహజ్యోతి వంటి పథకాల అమలు తీరును అధికారుల ద్వారా ప్రజలకు వివరించారు. కొత్తగా ప్రవేశ పెట్టిన ముఖ్యమంత్రి అల్పాహారం పథకం, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, సేంద్రీయ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు.ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, పరిసరాల పరిశుభ్రత మరియు పిల్లల విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పిలుపునిచ్చారు.ప్రజా దర్బార్ తరహాలో గ్రామసభలో ప్రజలు తమ సమస్యలను నేరుగా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటిని వెంటనే నమోదు చేసుకుని పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆయన ఆదేశించారు. తమకు అందుతున్న ఫలాలపై లబ్ధిదారులు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మోసిన్, మండల ప్రత్యేక అధికారి రాణా ప్రతాప్, గ్రామ సర్పంచ్ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి,పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి గ్రామసభ బలమైన వేదిక
### జిల్లా కలెక్టర్ స్నేహా శబరిష్



**మహబూబాబాద్ జిల్లా ఏప్రిల్ 2 (వుదయం జిల్లా ప్రతినిధి ):** ఘనంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభలు, ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు చేపించిన ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్,దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఇందిరమ్మ ప్రభుత్వం, గ్రామస్థాయిలో సమస్యల పరిష్కారానికి గ్రామసభ బలమైన వేదిక,జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ప్రజాపాలన ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా గురువారం దంతాలపల్లి మండల కేంద్రం, పెద్ద ముప్పారం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణంలో నిర్వహించిన గ్రామసభకు ప్రభుత్వ విప్ డోర్నకల్ శాసన సభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్,గూడూరు మండల కేంద్రంలో మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ఇనుగుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామసభకు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, కేసముద్రం మున్సిపల్ కార్యాలయం, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, మరిపెడ మండల కేంద్రాలలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ముఖ్యమంత్రి సందేశాన్ని ఎంపీడీవో వినిపించగా, గ్రామ పంచాయతీ పూర్తి సమగ్ర నివేదికను పంచాయతీ కార్యదర్శి, గ్రామస్థాయి అన్ని విభాగాల సిబ్బంది వారి వారి శాఖల ప్రగతి నివేదిక సభలో వివరించారు. ఈ సందర్భంగా వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులు తమ అభిప్రాయాలు, సూచనలు, సలహాలు వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్లు, వైస్ చైర్మన్లు, గ్రామపంచాయతీ సర్పంచులు, మండల ప్రత్యేక అధికారులు, రైతులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకట రమణ గ్రాండ్ హోటల్ ఘన ప్రారంభం





**నల్గొండఏప్రిల్ 02 (వుదయం ప్రతినిధి) :** నల్లగొండ నగరంలో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మితమైన "శ్రీ వెంకట రమణ గ్రాండ్" హోటల్ ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, కార్యక్రమాన్ని మరింత విశిష్టంగా నిలిపారు.మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి గవర్నర్‌కు స్వాగతం పలికారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి చేతుల మీదుగా హోటల్ ప్రారంభం జరిగింది. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి మాట్లాడుతూ నల్లగొండ నగరం వేగంగా అభివృద్ధి చెందుతున్నదని, ఇలాంటి ప్రీమియం హోటళ్లు ఏర్పడటం నగర ప్రగతికి సంకేతమని అన్నారు. "శ్రీ వెంకట రమణ గ్రాండ్" హోటల్ పర్యాటకులకు ఆకర్షణగా మారడంతో పాటు స్థానికులకు మెరుగైన సేవలు అందిస్తుందని తెలిపారు.హోటల్‌లో ఆధునిక వసతులు, సౌకర్యాలు కల్పించబడినట్లు నిర్వాహకులు వెల్లడించారు. వ్యాపార పరంగా విజయవంతం కావడంతో పాటు ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని మంత్రి ఆకాంక్షించారు.నగర అభివృద్ధికి ఈ హోటల్ మరొక ముందడుగు అవుతుందని పలువురు అభిప్రాయపడ్డారు.

## 'మీ సేవ'కు అంతరాయం

**3 నుంచి 5 వరకు సేవల నిలుపుదల**
**సర్వర్ నిర్వహణ పనుల కారణంగానే నిలుపుదల**
**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట ఏప్రిల్ 2(వుదయం:)** సర్వర్ నిర్వహణ పనుల నేపథ్యంలో 'మీ సేవ' ఆన్లైన్ సేవలకు తాత్కాలిక అంతరాయం ఏర్పడనున్నట్లు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు . ఏప్రిల్ 3 సాయంత్రం 5గంటల నుంచి 5వ తారీకు ఉదయం 8 గంటల వరకు నిర్వహణ పనులు, సర్వర్ పనితీరు మెరుగుదల, భద్రతా వ్యవస్థల అప్ గ్రేడ్, సాంకేతిక సమస్యల నివారణ కోసం ఈ నిర్వహణ చేపడుతున్నారని . ఈ సమయంలో సంబంధిత విభాగాలకు చెందిన ఆన్లైన్ సేవలు, డిజిటల్ లావాదేవీలు, వెబ్ పోర్టల్ సేవలు తాత్కాలికంగా పనిచేయవని, ప్రజలు అత్యవసర సేవలను ముందుగానే వినియోగించుకోవాలని సూచించారు. నిర్వహణ పూర్తయిన అనంతరం సేవలు సాధారణ స్థితికి చేరుకుంటాయని తెలిపారు. సాంకేతిక వ్యవస్థలను ఆధునీకరించడంలో భాగంగానే ఈ చర్యలు చేపడుతున్నామని,
భవిష్యత్తులో వేగవంత మైన, అంతరాయం లేని సేవలను అందించేందుకు ఈ నిర్వహణ ఉపయో గపడుతుందని కలెక్టర్ తెలిపారు.

## గ్రామసభలతో ప్రజాపాలన ప్రజలకు చేరువవుతోంది



**జిల్లా కలెక్టర్ అంకిత్.**


**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏప్రిల్ 02 (వుదయం ప్రతినిధి)** ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లావ్యాప్తంగా గ్రామ, వార్డు సభలు ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమంలో భాగంగా అశ్వాపురం గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించిన గ్రామసభకు జిల్లా కలెక్టర్ అంకిత్ హాజరయ్యారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రగతిని ప్రజలకు వివరించడమే కాకుండా గ్రామ, వార్డు స్థాయిలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించడమే ఈ సభల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. గ్రామసభలను పండగ వాతావరణంలో నిర్వహించేలా ప్రభుత్వం యంత్రాంగానికి మార్గదర్శకాలు జారీ చేసినట్లు చెప్పారు.
ముఖ్యంగా రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం,గ్రామాభివృద్ధికి విద్య ముఖ్యమని పేర్కొన్న కలెక్టర్, పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందేలా నిరంతర పర్యవేక్షణ అవసరమని తెలిపారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలన్నారు. అలాగే 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు గ్రామసభల్లో పాల్గొని సమస్యలను చర్చించాల్సిన అవసరం ఉందన్నారు.అశ్వాపురం గ్రామంలో అమలు చేసిన పథకాల వివరాలను వెల్లడిస్తూ,రైతు భరోసా కింద 1,369 మందికి రూ. 2.34 కోట్లు, ఇందిరమ్మ ఇళ్లు కింద 58 మందికి రూ. 2.90 కోట్లు మంజూరు చేసినట్లుతెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపథకం ద్వారా రూ. 75.58 కోట్లు వ్యయం చేసినట్లు తెలిపారు .ఈ కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాల లబ్ధిదారుల పేర్లను సభలో చదివి వినిపించి, వాటి అమలుపై ప్రజల అభిప్రాయాలను స్వీకరించారు.ఈకార్యక్రమంలో సర్పంచ్ బానోత్ సవర్లాల్, ఉప సర్పంచ్ తుళ్లూరు ప్రకాష్, , మండల ప్రత్యేక అధికారి ఇంతియాజ్ ఖాన్, ఎంఈఓ వీరాస్వామి, తాసిల్దార్, అన్ని శాఖల

## రీజనల్ సైన్స్ సెంటర్ ను సందర్శించిన ఎమ్మెల్యే, చైర్మన్, కలెక్టర్



**హనుమకొండ, ఏప్రిల్ 02 (వుదయం ప్రతినిధి) :** హనుమకొండ హంటర్ రోడ్డు జూ పార్క్ సమీపంలో ఉన్న రీజనల్ సైన్స్ సెంటర్ ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి గురువారం రోజున సందర్శించారు. ఈ సందర్భంగా రీజినల్ సైన్స్ సెంటర్ పని విధానంతో పాటు అక్కడ ఉన్న వివిధ శాస్త్ర సాంకేతిక పరికరాలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పరిశీలించారు. సైన్స్ సెంటర్ లో పనిచేయని పలు పరికరాలను , భవనంలో సౌకర్యాల ఏర్పాట్లను గురించి వారు ఆరా తీశారు. రీజినల్ సైన్స్ సెంటర్ లో నూతన శాస్త్ర సాంకేతిక పరికరాలు, సదుపాయాల కల్పన గురించి రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి అధికారి డాక్టర్ శ్రీనివాస్ ఎమ్మెల్యే, కుడా చైర్మన్, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. శాస్త్ర సాంకేతిక పరికరాలు, సదుపాయాల కావలసిన మరమ్మతులు చేయించాలని సూచించారు. తగిన ప్రతిపాదనలు సమర్పించినట్లయితే అవసరమైన నిధులు మంజూరు చేయనున్నట్లు కలెక్టర్తెలిపారు.
అదేవిధంగా రీజనల్ సైన్స్ సెంటర్ ప్రాంగణంలో ఉన్న ఎస్సీ ఎస్టీ సెల్ ను జిల్లా కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా కుడా సిపిఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, అధికారులతో పాటు రీజనల్ సైన్స్ సెంటర్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల ముంగిటకే ప్రజాపాలన



**కోదాడ ఏప్రిల్ 2(వుదయం):** రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా కోదాడ మున్సిపాలిటీ 22వ వార్డులో ప్రజాపాలన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డ్ కౌన్సిలర్ తూనం కృష్ణ మాట్లాడుతూ ప్రజల సమస్యలు, ఫిర్యాదులను స్వీకరించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు.
కార్యక్రమంలో తొగరు మధు, చలమ రెడ్డి, వెంకట్రావు, శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ, చంద్రశేఖర్ రెడ్డి, రాజేష్, మున్సిపల్ అధికారులు, వార్డ్ ఆఫీసర్లు, మహిళలు, వార్డ్ ప్రజలు పాల్గొన్నారు

## ప్రజా శ్రేయస్సు కోసం 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ అమలు
### స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ



**ఖమ్మం వుదయం బ్యూరో ఏప్రిల్ 2:** బోనకలప్రజా శ్రేయస్సు కోసం 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తెలిపారు.స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, బోనకల్ మండలం ముష్టికుంట్ల గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామ సభలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అమలు చేస్తున్న వివిధ పథకాలు, ప్రభుత్వం అమలు చేయబోయే వివిధ పథకాలను వివరించేందుకు గ్రామ సభ ఏర్పాటు చేసుకున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రతి ఇంటికి 5 లక్షల బీమా కల్పించే దిశగా ప్రభుత్వం ఇందిరమ్మ బీమా పథకం ప్రవేశ పెడుతుందని అన్నారు.నూతన రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్లు, మహిళా సంఘాలకు వడ్డీ లేని బ్యాంకు లింకేజీ రుణాలు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. వివిధ శాఖల ద్వారా గ్రామంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల గురించి కూడా గ్రామసభలో చర్చ జరుగుతుందని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం పేరిట ప్రభుత్వం 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ తీసుకుందని అన్నారు. గ్రామాలలో ఏఎన్ఎం, ఆశా, తల్లితండ్రులు, సర్పంచ్, ఉపసర్పంచ్, ప్రజా ప్రతినిధులు ఆధ్వర్యంలో గ్రామ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఏర్పాటు చేయాలని, బాల్య వివాహాలను అడ్డుకోవడం, పిల్లలందరూ చదువుకునేలా చూడటం, పిల్లలకు మంచి పోషకాహారం అందేలా చూడటం వంటి చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బోనకల్ మండల ఎంపిడివో రమాదేవి, తహసీల్దార్ రమాదేవి, ముష్టికుంట గ్రామ సర్పంచ్ పిల్లలమర్రి నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఎస్కె. సైదులు, ఎఇఓ త్రివేణి, వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ | మెదక్ ఉమ్మడి జిల్లాల వార్తలు

## అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



**మహబూబ్ నగర్ (వుదయం ప్రతినిధి)** అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ది చేకూరుస్తామని, ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలకు ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం అమలులో భాగంగా మహబూబ్ నగర్ జిల్లాలోని చిన్న చింతకుంట మండలం మండలం ఉంద్యాల గ్రామంలో గురువారం ఏర్పాటుచేసిన గ్రామసభ కు ఎమ్మెల్యే కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.అనంతరం ఎమ్మెల్యే, కలెక్టర్ మాట్లాడుతూ చిన్నపిల్లాడి నుంచి వృద్ధుల వరకు ప్రభుత్వం అన్ని సేవలను అందిస్తోందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం విషయాన్ని వస్తే గతంతో పోలిస్తే మహిళలు ప్రయాణాలు పెరిగాయని తెలిపారు. రైతు భరోసా కింద ఎకరా కు 6 వేల చొప్పున ఇస్తోందన్నారు. భూభారతి పోర్టల్ తో భూ వివాదాలు తగ్గుతున్నాయన్నారు. ఏప్రిల్ నుంచి మళ్ళీ కొత్త ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అవుతాయని ఆయన చెప్పారు. 18 సంవత్సరాలు దాటిన మహిళలందరూ సంఘాల్లో చేరాలని, అలాగే 15 నుంచి18 సంవత్సరాల వయసు కలిగిన బాలికలు కూడా ఒక సంఘాన్ని ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. మహిళలకు 2 నెలలకు ఒకసారి వడ్డీ లేని రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. సంఘంలోని మహిళలకు ఇన్సూరెన్స్ కూడా ఉంటుందని, ఏదైనా అనుకోని సంఘటన, లేదా ఆకస్మిక మరణం పొందిన మహిళకు 10 లక్షల ఇన్సూరెన్స్ వర్తిస్తుందని వారు తెలిపారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డు తప్పనిసరి అని, కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాలు ఆధార్ తోనే ముడిపడి ఉన్నాయన్నారు. త్వరలో ప్రారంభమయ్యే ఎస్ ఐ ఆర్ ప్రక్రియ కు ఆధార్ అవసరం అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున పథకాలతో పాటు మరో రెండు పథకాలను ప్రారంభించనుందని కలెక్టర్ వెల్లడించారు. జూన్ 2 నుంచి ప్రారంభించే ఇందిరమ్మ జీవిత బీమా పథకం, ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు అల్పాహార కార్యక్రమం తో పాటు, పాలు, రాగి జావా అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వివరించాలని అన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్ విస్తృతంగా ప్రచారం జరిగేలా చూడాలని అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మార్చ్ 6 నుంచి 15 వరకు నిర్వహించిన పెండింగ్ ఫైల్స్ సత్వర పరిష్కారం, పారిశుధ్య నిర్వహణ కార్యక్రమానికి మంచి స్పందన వచ్చిందని, అదే స్ఫూర్తితో గ్రామ, వార్డు సభలను విజయవంతం గా నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, వివిధ పథకాల లబ్ధిదారుల వివరాలు గ్రామ సభలో తెలియజేయాలని అన్నారు. సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ప్రజలకు వివరించాలని అన్నారు.

## విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల..
# సమస్యల పరిష్కారానికి ధర్నా

**సంగారెడ్డి, ఏప్రిల్ 2:వుదయం**





విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్, అన్‌మ్యాన్డ్ మరియు పీస్ రేటు కార్మికుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (TVAEJAC) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సంగారెడ్డి సర్కిల్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా మరియు వంటవార్పు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జేఏసీ రాష్ట్ర నాయకుడు ప్రశాంత్ మాట్లాడుతూ, విద్యుత్ సంస్థల్లో గత 30-35 సంవత్సరాలుగా నిబద్ధతతో సేవలందిస్తున్న ఆర్టిజన్ కార్మికులను గత ప్రభుత్వం రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చినా, ఇప్పటికీ పూర్తి స్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. రెగ్యులర్ ఉద్యోగులకు అందుతున్న సదుపాయాలు, వసతులు ఆర్టిజన్ కార్మికులకు ఇవ్వకుండా వివక్ష చూపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఒకే సంస్థలో రెండు రకాల సర్వీస్ రూల్స్ అమలు చేయడం వల్ల కార్మికులు గత ఎనిమిదేళ్లుగా నిరసనలు, పోరాటాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. విద్యార్హత ఆధారంగా ఆర్టిజన్లను రెగ్యులర్ పోస్టుల్లోకి మార్చాలని, APSEB సర్వీస్ రూల్‌స్‌ను అన్ని ఉద్యోగులకు సమానంగా అమలు చేయాలని ప్రధాన డిమాండ్‌గా యాజమాన్యాలకు పలు మార్లు లిఖితపూర్వకంగా తెలియజేసినట్లు చెప్పారు.విద్యుత్ సంస్థల యాజమాన్యాలు స్పందించకపోవడంతో TVAEJAC ఆధ్వర్యంలో డిమాండ్ నోటీసు అందజేసినట్లు తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం జేఏసీగా ఏర్పడి పోరాటం కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. విద్యుత్ సంస్థల యాజమాన్యాలు స్పందించి ఆర్టిజన్ ఉద్యోగులను పూర్తి స్థాయిలో రెగ్యులరైజ్ చేసి, రెగ్యులర్ ఉద్యోగులకు అందుతున్న అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈ నెల 7వ తేదీన వరంగల్‌లోని TGNPDCL ప్రధాన కార్యాలయం ఎదుట 20 వేల మంది విద్యుత్ కార్మికులతో మహా ధర్నా నిర్వహించి, తదుపరి రోజు నుండి నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. INTUC 327 రాష్ట్ర కార్యదర్శి భోపాల్ రెడ్డి, TVAEJAC రాష్ట్ర ఖజాంచి ప్రశాంత్, జిల్లా నాయకులు దుర్గా నాయక్, సాదుల్ హుస్సేన్, రవీందర్, సుధాకర్, శివ, ప్రదీప్, శివరాజ్ (సంగారెడ్డి డివిజన్), మురళి మోహన్, ఫిరోజ్ (జోగిపేట్ డివిజన్), రంజిత్, రాజేందర్, సుధాకర్ (పటాన్చెరు డివిజన్), భూపాల్ రెడ్డి, గోపీ, సంతోష్ కుమార్, కృష్ణ, నర్సింలు (జహీరాబాద్ డివిజన్) పాల్గొన్నారు. మొత్తం 600 మందికి పైగా ఆర్టిజన్ కార్మికులు హాజరయ్యారు.



## తహసిల్దార్ కు వినతి

**వెల్దండ ఏప్రిల్ 2 (వు దయం)**

మండల పరిధిలోని కర్రే వాని పల్లి శివారులోనీ 19 సర్వే నంబర్ లో ఉన్న ఇళ్ళ స్థలాన్ని పరిశీలించి తిమ్మి నోనీ పల్లి, రాచుర్ తండా గ్రామ పంచాయతీ కి ఇవ్వాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరి కిషన్ నాయక్ ఆధ్వర్యంలో ఎమ్మార్వో కార్తీక్ కుమార్ కు వినతి పత్రం అందజే శారు.గురువారం గ్రామ సభలో ఇళ్ల స్థలానికి సంబంధించిన భూమిని గ్రామ పంచాయతీ కి అప్పజెప్పలని తీర్మానం చేశా రు.వినతి పత్రం అందజేశారు రమేష్,కిషన్,రమేష్ లు ఉన్నారు.



## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

**కల్వకుర్తి ఏప్రిల్ 2 (వు దయం)**

అభివృద్ధి సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. డిసిసి ఉపాధ్యక్షులు యన్నం భూపతిరెడ్డి,ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, ఎంపీడీవో కృష్ణయ్య తహసిల్దార్ కార్తీక్ కుమార్ విద్యుత్ ఏడి శంకరయ్య మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరి కిషన్ నాయక్ ఉప సర్పంచ్ శ్రీను ముదిరాజ్ హౌసింగ్ ఏ ఈ పల్లవి పంచాయతీ కార్యదర్శి గిరి జిపిఓ కిషన్ ఏఈ సురేందర్ రెడ్డి వార్డు సభ్యులు కొండయ్య మల్లేశ్వరి రంగనాథం వాణి పురుషోత్తం చారి కవిత రమేష్ కిష్టాలు వెంకటేష్ దేవేందర్,శేఖర్ పాల్గొన్నారు

## పోరాటి యోధుడు సర్వాయి పాపన్న



**వికారాబాద్: వుదయం ప్రతినిధి:** మహా వీరుడు, ప్రజల కోసం పోరాడిన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్నని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి కొనియాడారు.గురువారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరం లో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి మాధవ రెడ్డి ఆధ్వర్యం లో సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ హాజరై ,చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న ఈ సాధన కై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. అది అందరి బాధ్యతని పేర్కొన్నారు.సర్దార్ సర్వాయి పాపన్న సామాన్య ప్రజల హక్కుల కోసం, అన్యాయానికి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన గొప్ప నాయకుడని, ఆయన జీవితం ధైర్యం, త్యాగం, సమానత్వం అనే విలువలకు ప్రతీకగా నిలిచిందని, జిల్లా కలెక్టర్ కొనియాడారు. సమాజంలో అణగారిన వర్గాల కోసం పోరాడి, వారి గౌరవాన్ని కాపాడిన యోధుడిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని అయన సేవలను కొనియాడారు. . ఆయన చూపిన మార్గంలో నడుస్తూ సమానత్వం, న్యాయం, సౌభ్రాతృత్వం వంటి విలువలను కాపాడుకునేందుకై అందరూ సంకల్పించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.యువత ఆయన జీవితం స్ఫూర్తిగా తీసుకొని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమములో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ రాజేశ్వరి, డి ఆర్ ఓ మంగీ లాల్ , జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
### కలెక్టర్ ప్రతిమా

**వుదయం, ఉమ్మడి మెదక్, ఏప్రిల్ 02**

చేగుంట మండల కేంద్రంలోని వడియారం గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామ సభ కు గురువారం మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ హాజరు అయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర గీతంతో గ్రామ సభ కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల పై రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రసంగాన్ని సర్పంచ్ ఎ. సాయి కుమార్ వినిపించారు.ప్రభుత్వం పేద ప్రజలకోసం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.ఈ కార్యక్రమంలో , ప్రత్యేక అధికారిణి హేమ భార్గవి,, సర్పంచ్ సాయికుమార్,మెడికల్ ఆఫీసర్ అనిల్ కుమార్ రెడ్డి, ఉపసర్పంచ్ బండారి నాగరాజు, పంచాయతీ కార్యదర్శి,ఇన్చార్జి ఎం.పీ.ఓ, విజయపాల్ ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

**నారాయణపేట వుదయం ప్రతినిధి**



అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ది చేకూరుస్తామని, ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాలకు ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం అమలులో భాగంగా జిల్లాలోని మద్దూరు మండలం దొరేపల్లి గ్రామంలో గురువారం ఏర్పాటుచేసిన గ్రామసభ కు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు గ్రామసభలో ముఖ్యమంత్రి సందేశం వినిపించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ చిన్నపిల్లాడి నుంచి వృద్ధుల వరకు ప్రభుత్వం అన్ని సేవలను అందిస్తోందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం విషయాన్ని వస్తే గతంతో పోలిస్తే మహిళలు ప్రయాణాలు పెరిగాయని తెలిపారు. రైతు భరోసా కింద ఎకరా కు 6 వేల చొప్పున ఇస్తోందన్నారు. భూభారతి పోర్టల్ తో భూ వివాదాలు తగ్గుతున్నాయన్నారు. జిల్లాలో ఒక్కటే రెవెన్యూ డివిజన్ ఉందని,రెవెన్యూ సమస్యలను పరిష్కరిస్థామన్నారు. అలాగే మద్దూరు మండలం కడ కింద ఉందని, ఈ మండలంలోని ప్రతీ గ్రామానికి రెండు హైమాస్ట్ లైట్లను ఇవ్వడం జరిగిందన్నారు. ఏప్రిల్ నుంచి మళ్ళీ కొత్త ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అవుతాయని ఆయన చెప్పారు. 18 సంవత్సరాలు దాటిన మహిళలందరూ సంఘాల్లో చేరాలని, అలాగే 15 నుంచి18 సంవత్సరాల వయసు కలిగిన బాలికలు కూడా ఒక సంఘాన్ని ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. మహిళలకు 2 నెలలకు ఒకసారి వడ్డీ లేని రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. సంఘంలోని మహిళలకు ఇన్సూరెన్స్ కూడా ఉంటుందని, ఏదైనా అనుకోని సంఘటన, లేదా ఆకస్మిక మరణం పొందిన మహిళకు 10 లక్షల ఇన్సూరెన్స్ వర్తిస్తుందని ఆయన తెలిపారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డు తప్పనిసరి అని, కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాలు ఆధార్ తోనే ముడిపడి ఉన్నాయన్నారు. త్వరలో ప్రారంభమయ్యే ఎస్ ఐ ఆర్ ప్రక్రియ కు ఆధార్ అవసరం అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో పాటు మరో రెండు పథకాలను ప్రారంభించనుందని కలెక్టర్ వెల్లడించారు. గ్రామసభ తరహాలో మున్సిపాలిటీ వార్డులో సైతం సభలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లకు సీఎస్ సూచించారు. ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు ప్రస్తుత బడ్జెట్ లో ప్రతిపాదించిన వివిధ పథకాలకు సంబంధించిన మార్గదర్శకాలను కూడా గ్రామ, వార్డు సభలలో ప్రజలకు వివరించాలని అధికారులకు సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో ప్రజలందరికీ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం తెలిసే విధంగా వార్డు సభలు నిర్వహించాలని అన్నారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 2 తేదీన గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని తెలిపారు. గ్రామ, వార్డు సభలు నిర్వహణపై ప్రభుత్వం జారీ చేసిన షెడ్యూల్ మరియు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారం, జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామ సభలు సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. గ్రామ సభల ద్వారా ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం ప్రధాన ఉద్దేశ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. వారికి కొత్తగా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని బాధితులు కలెక్టర్ ను కోరారు. ఈ కార్యక్రమం లో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డిపివో సుధాకర్ రెడ్డి, తహసిల్దార్ మహేష్, ఎంపీడీవో, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## భూ భారతి దరఖాస్తులను
# త్వరితగతిన పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**గద్వాల (వుదయం ప్రతినిధి)** భూభారతి, ఇతర దరఖాస్తులను పెండింగ్ లో ఉంచవద్దని, త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం గద్వాల పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంతో పాటు తహసిల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం ప్రజావాణికి కూడా వివిధ భూ సమస్యలపై ప్రజలు పెద్ద ఎత్తున వినతిపత్రాలు ఇస్తున్నారని, మండల స్థాయిలోనే రెవెన్యూ అధికారులు వివిధ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఇనాం కేసులకు సంబంధించి ఎప్పటికప్పుడు హియరింగ్ చేస్తూ ఓఆర్ సి ఇవ్వాలన్నారు. అనంతరం కలెక్టర్ గద్వాల తహసిల్దార్ కార్యాలయంలోని సిబ్బంది హాజరు రిజిస్టర్ ను పరిశీలించారు. సెన్సస్ కార్యకలాపాలు, ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ వేగవంతం కావాలన్నారు. అలాగే ఆయా కార్యాలయాల్లోని పలు విభాగాలను సందర్శించి పాత ఫైల్స్ ను క్లియరెన్స్ చేయాలని 99 రోజుల కార్యక్రమంలో ఆదేశించినప్పటికీ అలాగే ఉంచడం సరికాదన్నారు. పాత ఫర్నిచర్ ను తొలగించి కార్యాలయాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గా గురువారం బాధ్యతలు చేపట్టిన కృష్ణ తో పాటు ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నాగరాజు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ పర్యటనలో ఆర్డీవో శ్రీనివాసరావు, గద్వాల తహసిల్దార్ హరికృష్ణ, ఉప తహసిల్దారు శివకుమార్, ఇతర అధికారులు, తదితరులున్నారు.

## బిఆర్ఎస్ నాయకులు ఆరోణలు మానుకోవాలి



**వుదయం, దుబ్బాక**

ప్రభుత్వం పై వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకే బిఆర్ ఎస్ నాయకులు తమ ప్రభుత్వం పై ఆరోపణలు చేయడం సబబుకాదని కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు బండారు రమేష్ గౌడ్ మండిపడ్డారు. గురువారం తొగుట మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. మిగులు రాష్ట్రంగా వున్న తెలంగాణని గత పదేళ్ళలో అప్పుల పాలు చేసి 10 సంవత్సరాలు అధికారంలో వుండి దళిత ముఖ్యమంత్రి, దళితులకు మూడెకరాల భూమి, ఇంటికో ఉద్యోగం ఇస్తా అని మోసం చేసిన బిఆర్ఎస్ నాయకులు 100 ఎలకలు తిన్న పిల్లి తీర్థయాత్ర చేసినట్టు ప్రజా ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందిస్తున్న ప్రజా సంక్షేమాన్ని ఓర్వలేకే దుష్ప్రచారం చేస్తున్నారన్నారు.10 ఏండ్లు అధికారంలో ఉండి ఒక్క రేషన్ కార్డు కూడా ఇయ్యని వారు, తలాపున మల్లన్న సాగర్ వున్న 10 ఏండ్లు అధికారం చేతిలో ఉన్న ఉప కాలువలు నిర్మించడం లో విఫలమాయ్యారని, నీళ్ల గురించి బి ఆర్ ఎస్ నాయకులు మాట్లాడుతూ వుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్టు వుందన్నారు.ప్రజా ఆశీర్వాదం తో ఏర్పడిన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుతూ ఒక్కో పథకాన్ని అమలు చేస్తూఅన్ని సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా అందరికి అందిస్తున్నామన్నారు.ప్రతిపక్ష నాయకులు కూడా ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందుతున్నారని అన్నారు. గతంలో విడతల వారిగా రుణమాపి చేస్తే మిత్తిలకు కూడా సరిపోలేదని,కాంగ్రెస్ ప్రభుత్వం ఏక కాలం లో రెండు లక్షల రుణమాపి అర్హులైన రైతులు అందరికీ చేసింది,సన్నబియ్యం,రేషన్ కార్డులు, ఇచ్చిందని అన్నారు.రాబోయే రోజుల్లో కుటుంబ బీమా పథకాన్ని ప్రజలందరికీ అందిస్తామని అన్నారు.

## వసతులు కల్పించడమే..
# ప్రభుత్వం లక్ష్యం



**వుదయం, సిద్ధిపేట బ్యూరో**

గ్రాపంచాయతీలకు మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని జిల్లా కలెక్టర్ కే. హైమావతి అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడ గ్రామపంచాయతీలో నిర్వహించిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక గ్రామ సభలో జిల్లా కలెక్టర్ కే. హైమావతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ముందుగా రాష్ట్ర ముఖ్య మంత్రి ఏ. రేవంత్ రెడ్డి పంపించిన సందేశాన్ని గ్రామస్తులకు చదివి వినిపించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను వివరిస్తూ, దుద్దెడ గ్రామపంచాయతీ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులు సంక్షేమ కార్యక్రమాలను లబ్ధిదారుల వారీగా వివరించారు.ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, గృహజ్యోతి, మహాలక్ష్మి తదితర పథకాల లబ్ధిదారులు తమ అనుభవాలను సభలో పంచుకున్నారు. గ్రామంలో ఆరోగ్యకర జీవనానికి సేంద్రియ వ్యవసాయం, పంట మార్పిడి విధానాన్ని అనుసరించాలని, కోతుల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని, అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని, గ్రామాభివృద్ధికి ప్రభుత్వం చేయూతనివ్వాలని గ్రామపంచాయతీలో తీర్మానం చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ఐదు అంచెలుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, జిల్లావ్యాప్తంగా 508 గ్రామపంచాయతీలలో గ్రామసభలు, ఐదు మున్సిపాలిటీలలో వార్డు సభలు నిర్వహిస్తున్నామని తెలిపారు.పేద ప్రజల అభివృద్ధికి గ్రామాలు, పట్టణాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, మహిళా స్వయం సహాయ సంఘాలకు వడ్డీ లేని రుణాలు, రైతు భరోసా, రైతు బీమా తదితర కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. జూన్ నుండి ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం, ప్రీ ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు ఉదయం అల్పాహార పథకం అమలు చేయనున్నట్లు, ఇంటర్మీడియట్ చదివే దివ్యాంగుల విద్యార్థులకు వాహన సౌకర్యం కల్పిస్తున్నట్లు, కుటుంబ జీవిత బీమా కార్యక్రమాన్ని కూడా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. సర్పంచ్, ఎంపీడీవో, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.



# ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించేందుకే గ్రామసభలు



**వనపర్తి వుదయం ప్రతినిధి**

పేదలు బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ప్రధాన అజెండాగా రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం ప్రజల మన్ననలు చూరగా ఉంటుందని వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. గురువారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ లో భాగంగా ఏదుల మండలం ఏదుల గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామసభ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు తెలంగాణ గీతాలాపన చేసి, గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ పై రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి అందించిన సందేశాన్ని చదివి గ్రామ ప్రజలకు వినిపించారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కొలువుతీరిన తర్వాత రెండున్నర ఏళ్లలో ప్రజలకు అందించిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చదివి వినిపించారు. గ్రామంలో అమలు చేసిన వివిధ ప్రభుత్వ పథకాలు వాటిని పొందిన లబ్ధిదారుల వివరాలను అధికారులు చదివి వినిపించారు. గ్రామంలో రైతు రుణమాఫీ పొందిన లబ్ధిదారులు, జరిగిన రుణమాఫీ మొత్తం, రైతు భరోసా, వరి ధాన్యం సేకరణ చెల్లించిన నగదు, మొత్తం రేషన్ కార్డులు, కొత్తగా మంజూరు చేసిన రేషన్ కార్డులు, 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు లబ్ధిదారులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయిన లబ్ధిదారులు, ఇంకా మంజూరు చేయాల్సి ఉన్న వివరాలు, స్వయం సహాయక సంఘాలకు మంజూరు చేసిన వడ్డీ లేని రుణాలు, చేయూత పెన్షన్ల లబ్ధిదారులు, ఉచిత చీరల పంపిణీ, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా కల్పించిన పనిదినాలు, మంజూరు అయిన వేతనం, చేపట్టిన పనులు, అంచనా విలువ తదితర అంశాలను లబ్ధిదారుల పేర్లతో సహా చదివి వినిపించారు. గ్రామంలో ఉన్న ప్రజల సమస్యలు, 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల బాధ్యతల పై గ్రామ సభలో చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ గొప్ప కార్యక్రమమని, ఒకే రోజు జిల్లాలోని 268 గ్రామపంచాయతీలో గ్రామసభలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. గ్రామంలో ప్రజలకు జరిగిన మంచిని తెలియజేయడమే కాకుండా, ఇంకా గ్రామంలో జరగాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు అందాల్సిన సంక్షేమ కార్యక్రమాల విషయాలని గ్రామసభ ముందు ఉంచడమే దీని యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు రైతు భరోసా, రైతు రుణమాఫీ, మహిళా శక్తి, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పెన్షన్, ఉచిత చీరల పంపిణీ వంటి కార్యక్రమాలతో ప్రజల మన్ననలను అందుకుంటుందన్నారు. త్వరలోనే ఏదుల మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం, గురుకుల పాఠశాల, పోలీస్ స్టేషన్ భవన నిర్మాణాలకు కూడా అడుగులు ముందుకు పడేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఏదుల మండల కేంద్రంలో గ్రామస్తుల కోరిక మేరకు ఎమ్మెల్యే నిధుల నుంచి నూతన బస్టాండును నిర్మించేందుకు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా కలెక్టర్ ద్వారా పాఠశాల భవన నిర్మాణం కోసం కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నూతన తహసిల్దార్ కార్యాలయ భవనం ప్రారంభం దుల మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన తహసిల్దార్ కార్యాలయ భవనాన్ని ఎమ్మెల్యే మెఘా రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తో కలిసి ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏదుల కొత్త మండలం కోసం ప్రభుత్వ భవనాల ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. అయినప్పటికీ మండల తహసిల్దార్ కార్యాలయం తొందరగా ప్రజలకు అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ రూ. 32 లక్షలు తన సొంత నిధులతో భవనాన్ని నిర్మించడం అభినందనీయమని కొనియాడారు. సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసిల్దార్లు ముబీనా, మల్లికార్జున్, సర్పంచ్ పరశురామ్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## 98.45 శాతం రూ. 2 వేల నోట్లు వెనక్కి

చలామణీలో ఉన్న 98.45 శాతం రూ.2వేల నోట్లు తిరిగి బ్యాంకులకు చేరాయని భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) ప్రకటనలో వెల్లడించింది. ఈ ఏడాది మార్చి 31 నాటికి ఇంకా రూ. 5,501 కోట్ల విలువ పెద్ద నోట్లు ప్రజల వద్దే ఉన్నాయని తెలిపింది. 2023, మే 19న రూ. 2,000 నోట్ల ఉపసంహరణ ప్రకటన వెలువడే సమయానికి వ్యవస్థలో మొత్తం రూ. 3.56 లక్షల కోట్ల విలువైన నోట్లు ఉన్నాయి. ఈ నోట్లను ఆర్‌బీఐ చలామణి నుంచి ఉపసంహరించుకున్నప్పటికీ అవి చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతాయి.




## మళ్లీ గోల్డ్ రేటు క్రాష్..
## ట్రంప్ ప్రకటనతో బులియన్ మార్కెట్ షేక్



వారం రోజులుగా పెరుగుతూ వస్తున్న బంగారం ధరలకు మళ్లీ బ్రేక్ పడింది. అంతర్జాతీయ రాజకీయ పరిణామాల నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో పసిడి, వెండి ధరలు భారీగా పతనమయ్యాయి. ఇరాన్‌పై భీకర యుద్ధం తప్పదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన సంచలన ప్రకటన బులియన్ మార్కెట్‌ను ఒక్కసారిగా కుదిపేసింది. ఈ మేరకు ఇవాళ హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల బంగారంపై ఏకంగా రూ.1,530 తగ్గింది. దీంతో 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ. 1,51,420కు చేరింది. ఆభరణాల తయారీకి వాడే పసిడి ధర రూ.1,400 మేర పతనమై రూ.1,38,800 వద్ద కొనసాగుతోంది. బంగారం బాటలోనే వెండి కూడా భారీగా క్షీణించింది. కేజీ వెండి ధరపై ఏకంగా రూ.10,000 మేర కోత పడింది. దీంతో ప్రస్తుతం కేజీ వెండి ధర రూ.2,55,000 వద్ద ట్రేడ్ అవుతోంది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై దాడులు కొనసాగుతాయని చేసిన హెచ్చరికలతో ప్రపంచ వ్యాప్తంగా మార్కెట్లలో అనిశ్చితి నెలకొంది. యుద్ధ భయాల నేపథ్యంలో డాలర్ ఇండెక్స్, బాండ్ ఈల్డ్స్‌లో మార్పులు రావడం, ఇన్వెస్టర్లు ప్రాఫిట్ బుకింగ్‌కు మొగ్గు చూపడం వంటి కారణాలతో బంగారం ధరలు దిగివచ్చాయని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. మరోవైపు పెళ్లిళ్ల సీజన్ కావడంతో బంగారం ధర తగ్గడంతో సామాన్య ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## భారత టెలికాం సంచలనం..
### 132 కోట్లకు చేరిన చందాదారుల సంఖ్య

భారతదేశ టెలికాం రంగం పరుగులు కొనసాగుతూనే ఉన్నాయి. ట్రాయ్ నివేదిక ప్రకారం.. ఫిబ్రవరి 2026 చివరి నాటికి దేశంలోని మొత్తం టెలిఫోన్ వినియోగదారుల సంఖ్య 1,321.31 మిలియన్లకు (132.13 కోట్లు) చేరుకుంది. కేవలం ఫిబ్రవరి నెలలోనే రికార్డు స్థాయిలో 7.31 మిలియన్ల కొత్త చందాదారులు నెట్‌వర్క్‌లో చేరారు. బ్రాడ్‌బ్యాండ్ విభాగంలో చోటుచేసుకున్న భారీ వృద్ధి ఈ విజయానికి ప్రధాన కారణంగా నిలిచినట్లు తెలుస్తుంది. దేశంలో బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారుల సంఖ్య జనవరిలో 1,052.72 మిలియన్లు ఉండగా, ఫిబ్రవరి నాటికి అది 1,059.05 మిలియన్లకు పెరిగినట్లు సమాచారం. బ్రాడ్‌బ్యాండ్ మార్కెట్‌లో రిలయన్స్ జియో 519.64 మిలియన్ల చందాదారులతో తన అగ్రస్థానాన్ని




సుస్థిరం చేసుకున్నట్లు ట్రాయ్ నివేదిక స్పష్టం చేసింది. దీని తర్వాత భారతీ ఎయిర్‌టెల్ 364.14 మిలియన్లతో రెండో స్థానంలో ఉండగా, వొడాఫోన్ ఐడియా (129.36 మిలియన్లు), బీఎస్ఎన్ఎల్ (28.70 మిలియన్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఇక వైర్డ్ బ్రాడ్‌బ్యాండ్ విభాగంలో కూడా జియో (14.10 మిలియన్లు), ఎయిర్‌టెల్ (10.54 మిలియన్లు) ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. దేశవ్యాప్త టెలి-డెన్సిటీ92.66 శాతానికి చేరుకోగా, పట్టణ ప్రాంతాల్లో ఇది అత్యధికంగా 142.32 శాతంగా నమోదైంది. వినియోగదారులు తమకు నచ్చిన నెట్‌వర్క్‌కు మారే ప్రక్రియ కూడా వేగంగా సాగుతోంది. ఫిబ్రవరి నెలలో ఏకంగా 14.47 మిలియన్ల మంది మొబైల్ నెంబర్ పోర్టబిలిటీ కోసం దరఖాస్తు చేసుకోవడం విశేషం. ప్రైవేట్ టెలికాం సంస్థలు మార్కెట్‌లో 92.59 శాతం వాటాతో ఆధిపత్యం చెలాయిస్తుండగా, ప్రభుత్వ రంగ సంస్థలైన బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ వాటా 7.41 శాతానికి పరిమితమైంది. గ్రాణ ప్రాంతాల్లో కూడా కనెక్టివిటీ పెరుగుతుండటం టెలికాం రంగ విస్తరణకు నిదర్శనంగా కనిపిస్తుంది.

## కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు..
## 1,400 పాయింట్లు పడిపోయిన సెన్సెక్స్




అంతర్జాతీయ రాజకీయ ఉద్రిక్తతలు భారత స్టాక్ మార్కెట్‌ను కుదిపేస్తున్నాయి. ఇరాన్‌పై దాడులు కొనసాగుతాయన్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటనతో ఇవాళ ట్రేడింగ్ ప్రారంభంలోనే దేశీయ సూచీలు భారీ పతనాన్ని చవిచూశాయి. సెన్సెక్స్ (*వనిబవలీ) 1400 పాయింట్లకు పైగా పతనమవ్వగా.. నిఫ్టీ (ఔతి*బి*) 22,500 మార్క్ వద్ద స్థిరంగా ఉంది. ఉదయం 9.30కి సెన్సెక్స్ 1454.53 పాయింట్లు కుంగి 71,679.79 వద్ద, నిఫ్టీ 453.9 పాయింట్ల నష్టంతో 22,222.50 వద్ద కొనసాగుతున్నాయి. నిఫ్టీలో సన్‌ఫార్మా, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, అదానీ పోర్ట్స్, శ్రీరామ్ ఫైనాన్స్, ఎటర్నల్ షేర్లు నష్టాల్లో ఉన్నాయి. అటు ఆసియా పసిఫిక్ మార్కెట్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి. జపాన్ నిక్కీ 1.4శాతం, దక్షిణ కొరియా కోస్పి 2.82శాతం, ఆస్ట్రేలియా ఏఎస్ఎక్స్ 0.48 శాతం, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ సూచీ 0.5శాతం మేర కుంగాయి. అమెరికా స్టాక్ మార్కెట్లు బుధవారం ఫ్లాట్‌గా ముగిశాయి.మరోవైపు, గత కొన్ని రోజులుగా క్షీణిస్తోన్న రూపాయి విలువ గురువారం భారీగా బలపడింది. నేటి ట్రేడింగ్‌లో 105 పైసలు పెరిగి 93.65 వద్ద కొనసాగుతోంది. ఇక కొన్ని రోజులుగా క్షీణిస్తోన్న రూపాయి విలువ ఇవాళ భారీగా బలపడింది. నేటి ట్రేడింగ్‌లో 105 పైసలు పెరిగి 93.65 వద్ద కొనసాగుతోంది.

## యుద్ధం వేళ కేంద్రం మరో నిర్ణయం..
## పెట్రోకెమికల్స్ దిగుమతులపై ఊరట



పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావం దేశ ప్రజలపై పడకుండా ఉండేందుకు కేంద్రం చర్యలు ముమ్మరం చేస్తోంది. ఇప్పటికే పెట్రోల్, డీజిల్‌పై విధిస్తున్న అదనపు ఎక్సైజ్ డ్యూటీని తగ్గించిన సంగతి తెలిసిందే. తాజాగా కొన్ని కీలక పెట్రో కెమికల్ ఉత్పత్తులకు దిగుమతి సుంకాన్ని మినహాయించింది. నేటి (ఏప్రిల్ 2) నుంచి జూన్ 30 వరకు ఈ మినహాయింపు అమల్లో ఉండనుంది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఓ ప్రకటన విడుదల చేసింది.''దేశీయ పరిశ్రమకు కీలకమైన పెట్రో కెమికల్ ముడిసరకుల లభ్యతకు ఆటంకం కలగకుండా చూడటం, దీనిపై ఆధారపడిన రంగాలపై వ్యయ ఒత్తిళ్లను తగ్గించడం, దేశంలో సరఫరా స్థిరత్వాన్ని కాపాడటం కోసం ఈ చర్యలు చేపట్టాం. అయితే, ఈ కస్టమ్స్ డ్యూటీ మినహాయింపు తాత్కాలికమే. దీని వల్ల తుది ఉత్పత్తులను కొనుగోలు చేసే వినియోగదారుల పైనా అదనపు భారం పడకుండా ఉపశమనం లభిస్తుంది'' అని ఆర్థిక మంత్రిత్వశాఖ తమ ప్రకటనలో వెల్లడించింది. మిథనాల్, అన్‌హైడ్రస్ అమోనియా, డైక్లోరోమిథేన్, వినైల్ క్లోరైడ్ మోనోమర్, స్టిరేన్, పాలీ బ్యుటడిన్, స్టిరేన్ బ్యుటడిన్, అన్‌శాచురేటెడ్ పాలిస్టర్ రెసిన్స్ వంటి పెట్రో కెమికల్స్‌కు దిగుమతి సుంకాన్ని మినహాయించారు. ఈ నిర్ణయంతో ప్లాస్టిక్, టెక్స్‌టైల్స్, ఫార్మా, ఆటో, కెమికల్ రంగాలకు లాభం చేకూరనుందని కేంద్రం పేర్కొంది. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా హర్మూజ్ దుగా సరకు రవాణాకు అంతరాయం ఏర్పడిన సంగతి తెలిసిందే. దీంతో ముడిచమురు, గ్యాస్, ఎరువులు, ఇతర రసాయనాల దిగుమతులపై ఆందోళనలు నెలకొన్నాయి. ఫెర్టిలైజర్స్, పెట్రోలియం ఉత్పత్తులకు భారత్ ప్రధాన దిగుమతిదారుగా ఉంది.

## పాత పెట్టుబడులపై పన్ను ఉండదు: సీబీడీటీ




పాత పెట్టుబడులపైనా పన్ను విధిస్తారనే పరిశ్రమ వర్గాల దీర్ఘకాలిక ఆందోళనలకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) పరిష్కారం చూపింది. 2017 ఏప్రిల్ 1కి ముందు చేసిన పెట్టుబడుల బదిలీ ద్వారా వచ్చే ఆదాయానికి 'గార్' (జనరల్ యాంటీ అవాయిడెన్స్ రూల్స్) వర్తించవని ఆదాయపు పన్ను విభాగం స్పష్టం చేసింది. ఈ మేరకు ఆదాయపు పన్ను నిబంధనలు-2026ని సీబీడీటీ సవరించింది. విదేశీ మదుపర్లు పన్ను ఎగవేతలకు పాల్పడకుండా నిరోధించే లక్ష్యంతో 2012-13 కేంద్ర బడ్జెట్‌లో గార్ విధానాన్ని ప్రకటించారు. వాణిజ్యపరమైన వాస్తవికత లేని లావాదేవీల ద్వారా పన్ను ఎగవేతను అరికట్టేందుకు ఉద్దేశించిన ఈ నిబంధనలు 2017 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చాయి. ఆ తేదీకి ముందు కొనుగోలు చేసిన పెట్టుబడులు, లావాదేవీలకు పన్నుల నుంచి మినహాయింపు (గ్రాండ్‌ఫాదరింగ్) కల్పించారు. రూల్ 128కి చేసిన తాజా సవరణతో గార్ గ్రాండ్‌ఫాదరింగ్ కింద ఉన్న అస్పష్టత తొలగిపోయిందని, 2017 తర్వాత వచ్చే పన్ను ప్రయోజనాల అన్వయంపై ఉన్న అనుమానాలు తీరి పెట్టుబడిదారులకు భరోసా లభిస్తుందని ఏకేఎం గ్లోబల్ పార్ట్‌నర్-ట్యాక్స్ సందీప్ సెహగల్ తెలిపారు. 2017 ఏప్రిల్ 1కు ముందు చేసిన పెట్టుబడుల బదిలీపై వచ్చే ఆదాయాన్ని గార్ పరిధి నుంచి మినహాయించినట్లు సీబీడీటీ ఇప్పుడు స్పష్టంగా పేర్కొనడంతో, పరిశ్రమల ఆందోళన తీరిందని ఏఎంఆర్‌జీ గ్లోబల్ మేనేజింగ్ పార్ట్‌నర్ రజత్ మోహన్ చెప్పారు.




## పంజాబ్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్‌కు బిగ్ షాక్..!




పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్‌కు ఊహించని ఎదురు దెబ్బ తగిలింది. శ్రేయాస్ అయ్యర్ కు భారీ ఫైన్ వేసింది ఐపీఎల్ కౌన్సిల్. ఐపీఎల్ 2026 లో భాగంగా న్యూ చండీగఢ్ వేదికగా పంజాబ్, గుజరాత్ మధ్య మంగళవారం మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్ లో పంజాబ్ బౌలింగ్ చేసే క్రమంలో స్లో ఓవర్ రేట్ చోటు చేసుకుంది. దీంతో కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ పై వేటు వేశారు. ఏకంగా రూ.12 లక్షల ఫైన్ వేసింది ఐపీఎల్ కౌన్సిల్. ఇది ఇలా ఉండగా మంగళవారం పంజాబ్, గుజరాత్ మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ మూడు వికెట్ల తేడాతో చివరి క్షణంలో విజయం సాధించింది. ఇందులో మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్ 162 పరుగులు సాధించింది. ఈ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో పోరాడిన పంజాబ్ కింగ్స్, ఏడు వికెట్ల నష్టానికి 19.1 ఓవర్లలో విజయం సాధించింది. అటు ఇదే మ్యాచ్ లో కాన్లీ కొట్టిన బంతి నేరుగా మరో ఎండ్ లో అయ్యర్ చేతికి తగిలింది. దీంతో అయ్యర్ చేతికి గాయం అయింది. ఆ గాయం తీవ్ర తరం అయితే, తర్వాత మ్యాచ్ కు శ్రేయాస్ అయ్యర్ దూరం అయ్యే ప్రమాదం పొంచి ఉంది.

## క్రికెట్‌కు సౌతాఫ్రికా ప్లేయర్ రిటైర్మెంట్



దక్షిణాఫ్రికాకు ఊహించని షాక్ తగిలింది. ఆ జట్టుకు సంబంధించిన స్టార్ ఆటగాడు రస్సీ వాన్ డెర్ డాసన్ రిర్మెంట్ ప్రకటించాడు. అంతర్జాతీయ క్రికెట్ కు రిర్మెంట్ ప్రకటిస్తున్నట్లు సోషల్ డియా వేదికగా కీలక ప్రకటన చేశాడు. ప్రోటీస్ బోర్డు, తన సహచర ఆటగాళ్లు, అండగా నిలిచిన కోచ్ లు, అభిమానులకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు డాసన్. ఆలస్యంగా దక్షిణాఫ్రికా జట్టులోకి వచ్చినప్పటికీ అతి తక్కువ కాలంలోనే పాపులర్ అయ్యాడు. మంచి ప్రదర్శన కూడా కనబరిచాడు డాసన్. 37 సంవత్సరాల రస్సీ వాన్ డెర్ డాసన్ దక్షిణాఫ్రికా తరపున ఇప్పటి వరకు 71 వన్డేలు ఆడాడు. ఇందులో 2657 పరుగులు సాధించాడు. అదే సమయంలో 57 టీ20లలో ప్రాతి నిధ్యం వహిం చాడు. ఈ సందర్భంగా 1406 పరుగులు సాధించాడు. అటు 18 అంతర్జాతీయ టెస్టుల్లో ప్రాతినిధ్యం వహించిన రస్సీ వాన్ డెర్ డాసన్.. 95 పరుగులు మాత్రమే చేశాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ లో కూడా తన వంతు పాత్ర పోషించాడు. 2022 ఐపీఎల్ సందర్భంగా రాజస్థాన్ రాయల్స్ జట్టు తరపున బరిలోకిదిగాడు. ఇటు సౌతాఫ్రికా లీగ్ లో ఓఎ కేప్ టౌన్ తరపున ప్రాతినిధ్యం వహించాడు.

## లఖ్‌నవూపై ఢిల్లీ సూపర్ విక్టరీ



ఐపీఎల్ 2026 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తన మొదటి విజయాన్ని నమోదు చేసింది. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో జరిగిన ఈ ఉత్కంఠభరిత పోరులో ఢిల్లీ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన లఖ్‌నవూ జట్టు 18.4 ఓవర్లలో కేవలం 141 పరుగులకే ఆలౌట్ అయ్యింది. స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీకి ఆరంభంలోనే కోలుకోలేని షాక్‌లు తగిలాయి. స్టార్ ఆటగాళ్లు కేఎల్ రాహుల్, అక్షర్ పటేల్ డకౌట్ తో వెనుదిరగగా, పాథుమ్ నిశాంక (1), నితీశ్ రాణా (15) కూడా విఫలమయ్యారు. దీంతో ఢిల్లీ జట్టు కేవలం 26 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఒక దశలో ఢిల్లీ ఓటమి ఖాయమని అందరూ భావించగా.. క్లిష్ట సమయంలో ఇంపాక్ట్ ప్లేయర్‌గా మైదానంలోకి వచ్చిన యువ సంచలనం సర్ రిజ్వీ మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. ఒత్తిడిని ఏమాత్రం లెక్కచేయకుండా బాధ్యతాయుతంగా ఆడిన రిజ్వీ, కేవలం 47 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 70 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అతనికి తోడుగా ట్రిస్టన్ స్టబ్స్ (39×) చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరూ కలిసి వికెట్ పడకుండా జాగ్రత్త పడుతూనే, లఖ్‌నవూ బౌలర్లపై విరుచుకుపడి 17.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించారు. లఖ్‌నవూ బౌలర్లలో ప్రిన్స్ యాదవ్ రెండు వికెట్లు తీసినప్పటికీ, రిజ్వీ-స్టబ్స్ జోడీని విడదీయడంలో విఫలమవ్వడం వారి ఓటమికి ప్రధాన కారణమైంది. ఈ గెలుపుతో దిల్లీ క్యాపిటల్స్ ఈ సీజన్‌లో ఘనంగా బోణీ కొట్టింది.

## న్యూజిలాండ్ మహిళలు రికార్డు ఛేదన

న్యూజిలాండ్ మహిళల జట్టు వన్డే క్రికెట్‌లో రికార్డు స్కోర్ ఛేదించింది. వెల్లింగ్టన్ వేదికగా దక్షిణాఫ్రికా మహిళలతో మంగళవారం జరిగిన రెండో వన్డేలో 350 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించింది. ఈ భారీ లక్ష్యాన్ని కివీస్ మరో రెండు బంతులు మిగిలి ఉండగానే అందుకుంది. న్యూజిలాండ్ కెప్టెన్ అమేలియా క్రె(179నటౌట్; 139బంతుల్లో 23ఫోర్లు, సిక్సర్)కి తోడు ఇసాబెల్లా గాజే(68) బాయటింగ్‌లో రాణించి మ్యాచ్‌ను ముగించారు. అంతకు ముందు బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా నిర్ణీత 50ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 346పరుగులు చేసింది. బోచ్(91), కెప్టెన్ వోల్వార్డ్(69), ట్రయాన్(52) అర్ధసెంచరీలతో రాణించారు. దీంతో వన్డే క్రికెట్‌లో ఆ ఘనత టీమిండియా మహిళల రికార్డు తుడిచిపెట్టుకుపోయింది. అంతకుముందు కివీస్ పైనే భారత్ 341/5 టార్గెట్‌ను ఛేదించి విజయం సాధించింది. తాజాగా ఆ రికార్డు కనుమరుగైంది. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో ఇరుజట్లు ఒక్కో మ్యాచ్‌లో గెలిచి 1-1తో సమంగా నిలువగా.. చివరి వన్డే 4న జరగనుంది. ఓపెనర్ల నుంచి మెరుపు ఆరంభమే దక్కలేదు. కానీ అమేలియా కెర్ (179నాటౌట్: 139 బంతుల్లో 23 ఫోర్లు, ఒక సిక్స్) దూకుడు ప్రదర్శించింది. ఫోర్లతో విరుచుకుపడింది. ఆమెకు తోడుగా ఇసాబెల్లా గేజ్ (68) అండగా నిలిచింది. అయితే, దక్షిణాఫ్రికా బౌలర్లు విజృంభణతో.. స్వల్ప వ్యవధిలో మూడు వికెట్లు పడటంతో కివీస్ శిబిరంలో ఆందోళన మొదలైంది. కానీ కెర్ చివరి వరకు క్రీజ్‌లో నిలిచి అజేయంగా నిలిచి మ్యాచ్‌ను విజయతీరాలకు చేర్చింది. దీంతో కివీస్ 49.4 ఓవర్లలో లక్ష్యాన్ని అందుకుంది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా అమేలియా కెర్ నిలిచింది.



## 30 రోజుల్లో 10 టీ20లు..
## భారత జట్టు బిజీ షెడ్యూల్ ఇదే



ప్రస్తుతం ఐపీఎల్ టోర్నమెంట్ తో బిజీగా ఉన్న భారత క్రికెటర్లు...జూన్ నుంచి ఫుల్ బిజీగా ఉండనున్నారు. ఐపీఎల్ పూర్తికాగానే వరుసగా టీ20లు ఆడనుంది భారత జట్టు. ఈ మేరకు ఇప్పటికే షెడ్యూల్ కూడా ఖరారైంది. ఈ షెడ్యూల్ ప్రకారం 30 రోజుల్లోనే ఏకంగా 10 టీ20 మ్యాచ్ లు ఆడనుంది భారత్. జూన్ 26వ తేదీ నుంచి జూలై 26వ తేదీ మధ్య నెల రోజుల వ్యవధిలో మొత్తం 10 టీ20 మ్యాచ్ లు ఆడేలా షెడ్యూల్ ఫిక్స్ అయింది. జూన్ 26, 28 తేదీలలో ఐర్లాండ్ జట్టుతో రెండు టీ20 లు ఆడనుంది భారత జట్టు. ఆ తర్వాత ఇంగ్లాండ్ పర్యటనకు భారత్ వెళ్లనుంది. ఈసందర్భంగా జులై ఒకటోతేదీ నుంచి 11వ తేదీ వరకు ఈ రెండు జట్ల మధ్య ఐదు టీ20 లు ఉంటాయి. ఇక జూలై 23, 25, 26 తేదీల్లో జింబాబ్వేతో కూడా తలపడుతుంది భారత్. అంటే ఓవరాల్ గా 30 రోజుల్లో మొత్తం 10 టీ20లు ఆడనుంది భారత జట్టు. టీ20 సిరీస్‌లు వరుసగా ఉన్న నేపథ్యంలో ఐపీఎల్ 2026 సందర్భంగా రాణించిన క్రికెటర్లను సెలెక్ట్ చేసేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి నిర్ణయం తీసుకున్నట్లు చెబుతున్నారు. వైభవ్ సూర్యవంశీ లాంటి కుర్ర క్రికెటర్లను అవకాశం దక్కే ఛాన్సులు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## మ్యాక్స్‌వెల్, ఖవాజాకు దక్కని చోటు




క్రికెట్ ఆస్ట్రేలియా(సిఏ) సెంట్రల్ కాంట్రాక్ట్ ఆటగాళ్ల జాబితాను ప్రకటించింది. 2026-27 సీజన్‌కు గాను 21మందికి చోటు కల్పించింది. ఈ జాబితాలో ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్, ఓపెనర్ ఖవాజాలకు చోటు దక్కలేదు. మ్యాక్స్‌వెల్, ఖవాజాలకు ఏ కేటగిరీలోనూ చోటు దక్కలేదు. మ్యాక్స్‌వెల్ 2017లో చివరిసారిగా టెస్టు మ్యాచ్ ఆడాడు. దీంతో రాబోయే సీజన్‌లో ఎక్కువ టెస్టులు ఆడే వారికే సెంట్రల్ కాంట్రాక్ట్ దక్కింది. భారత్, న్యూజిలాండ్, ఇంగ్లండ్, బంగ్లాదేశ్‌తో ఆసీస్ టెస్టు సిరీస్‌లను ఆడనుంది. టెస్టు జట్టులో స్థానం లేని మ్యాక్స్‌వెల్ గత ఏడాది వన్డేలకు గుడ్‌బై చెప్పి కేవలం అంతర్జాతీయ టి20ల్లో మాత్రమే కొనసాగుతున్నాడు. దీంతో గ్లెన్ మ్యాక్స్‌వెల్ అంతర్జాతీయ కెరీర్ దాదాపు ముగిసినట్లేనని తెలుస్తోంది. అలాగే ఆస్ట్రేలియా సెంట్రల్ కాంట్రాక్ట్ లిస్ట్‌లో టెస్టు ఫార్మాట్‌కు అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు సమాచారం. మెరుగ్గా రాణించేవారికే క్రికెట్ బోర్డు చోటు కల్పించింది. ఇటీవల టెస్టులకు రిర్మెంట్ ప్రకటించిన ఉస్మాన్ ఖవాజాతో పాటు బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ 2024లో అదరగొట్టిన ఓపెనర్ కోన్‌స్టాస్‌నూ పక్కన పెట్టేసింది.




# సినిమా

## ఇది నా పూర్వజన్మ సుకృతం: చిరంజీవి



అగ్ర కథానాయకుడు చిరంజీవి ఆంజనేయస్వామికి పరమభక్తుడనే విషయం తెలిసిందే. గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆయన ఒక ప్రత్యేక వీడియోను అభిమానులతో పంచుకున్నారు. తన ఇంటిలోని పూజా మందిరంలో చోటుచేసుకొన్న ఓ అపురూప దృశ్యాన్ని ఈ వీడియోలో చూపించారు. "ప్రత్యక్ష దైవం ఆ సూర్య భగవానుడి కిరణాలు మా ఇలవేల్పు హనుమంతుడిని స్పృశిస్తున్న అద్భుతమైన సన్నివేశాన్ని మీతో పంచుకుంటున్నాను" అని ఆయన ఈ వీడియో షేర్ చేశారు. ఇటీవల మనం అయోధ్యలో బాలరాముడి నుదిటిపై సూర్యకాంతి పడి మెరిసిన అద్భుతాన్ని చూశాం. అలాగే అరసవల్లి దేవాలయంలో సూర్య కిరణాలు భగవంతుడిని తాకే విశేషం అందరికీ తెలిసిందే. అలాంటి దైవానుభూతి మా ఇంట్లోనూ ఆంజనేయుడిని స్పృశించడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా" అని చిరంజీవి తెలిపారు.



తెలుగులో తొలి ఏఐ సినిమా

## అంబ's రివెంజ్



చలనచిత్ర పరిశ్రమలో చరిత్ర సృష్టిస్తూ, సాంకేతిక విప్లవానికి నాంది పలుకుతూ పూర్తిస్థాయి కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో రూపొందుతున్న తొలి తెలుగు ఫీచర్ ఫిల్మ్‌గా "అంబ's రివెంజ్" ప్రేక్షకుల ముందుకు రానుంది. శ్రీకాంత్ రెడ్డి కుందూరు నిర్మాతగా, రాణి మాడిసన్ సహ నిర్మాతగా వ్యవహరిస్తుండగా, జయవర్ధన్ మాడి క్రియేటివ్ డైరెక్టర్ గా తెరకెక్కిస్తున్న ఈ సినిమా మహాభారతంలోని శక్తివంతమైన పాత్ర అంబ కథను ఆధారంగా తీసుకుని ఈ పౌరాణిక చిత్రాన్ని వినూత్నంగా తెరకెక్కిస్తున్నారు. శ్రీ లలితకళా చిత్రాలు, నక్క తోక ఫిల్మ్స్ నిర్మాణ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. హనుమాన్ విజయోత్సవం సందర్భంగా ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ పోస్టర్‌ను చిత్ర యూనిట్ తాజాగా విడుదల చేసింది. ఈ సందర్భంగా నిర్మాత శ్రీకాంత్ రెడ్డి కుందూరు, క్రియేటివ్ డైరెక్టర్ జయవర్ధన్ మాడి మాట్లాడుతూ.. తెలుగు చలన చిత్ర పరిశ్రమలో కొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టాము. "అంబ's రివెంజ్" ప్రాజెక్టు కోసం అత్యాధునిక ఏఐ టూల్స్‌ను వినియోగిస్తూ విజువల్స్, పాత్రల రూపకల్పన, కథన నిర్మాణం వంటి అంశాలను కొత్త శైలిలో ఆవిష్కరిస్తున్నాం. హనుమాన్ విజయోత్సవం సందర్భంగా ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్నాం. ఈ ప్రాజెక్టుకు సంబంధించి పూర్తి వివరాలు త్వరలో ప్రకటిస్తాం " అని తెలిపారు.

## గర్వంగా ఉంది : గుణ శేఖర్



సెన్సేషనల్ డైరెక్టర్ గుణ శేఖర్ దర్శకత్వంలో భూమిక, సారా అర్జున్ ప్రధాన పాత్రలలో నాజర్, రోహిత్, విఘ్నేశ్ గవిరెడ్డి కీలక పాత్రలు పోషించిన చిత్రం 'యుఫోరియా'. రాగిణి గుణ సమర్పణలో నీలిమ గుణ & యుక్త గుణ నిర్మాతలుగా తెరకెక్కించిన ఈ చిత్రం ఘన విజయం సాధించింది. ఏప్రిల్ 2నుంచి ఈటీవి విన్ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీస్ట్రీమింగ్ సెలబ్రేషన్స్ నిర్వహించారు. ప్రీస్ట్రీమింగ్ సెలబ్రేషన్స్ లో డైరెక్టర్ గుణశేఖర్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. అసిస్టెంట్ డైరెక్టర్‌గా నా కెరీర్ రామోజీ రావు గారి ఉషా కిరణ్ మూవీస్ సంస్థలోనే ప్రారంభమైంది. నేను బాగా పని చేస్తున్నానని ఆయన నన్ను ప్రోత్సహించారు. ఉషా కిరణ్ మూవీస్ స్టాండర్డ్స్ చాలా అద్భుతంగా ఉంటాయి. రామోజీ రావు గారు నాకు చాలా ఇన్స్పిరేషన్. కథా చర్చల్లో ఆయన నా అభిప్రాయం కూడా అడిగేవారు. అది నాకు గొప్ప అదృష్టంగా భావిస్తున్నాను. ఆ సంస్థ నాకు మంచి పునాది వేసింది. అదే సంస్థ నా "రుద్రమదేవి" సినిమాను తీసుకుంది. ఇప్పుడు "యుఫోరియా" కూడా అదే సంస్థలో వస్తోంది. యుఫోరియా చిత్రానికి తెలంగాణ ప్రభుత్వం రెండు ప్రతిష్టాత్మక అవార్డులు ఇచ్చింది. ఉత్తమ కథా రచయితగా నన్ను, ఉత్తమ సహాయనటిగా భూమిక గారిని గౌరవించింది. అంతకంటే పెద్ద గుర్తింపు ఈ రోజు ఈటీవీ విన్ వారు ఇచ్చారు. ఈటీవీ విన్‌లో ఈ సినిమా విడుదల కావడం నాకు చాలా గర్వంగా ఉంది.

## గాయపడ్డ సింహం
### బ్రైడ్ సాంగ్ విడుదల



డిఫరెంట్ ఎంటర్టైనర్స్ చేస్తున్న తరుణ్ భాస్కర్, రైటర్ డైరెక్టర్ కశ్యప్ 'గాయపడ్డ సింహం' తో అలరించబోతున్నారు. పవన్ సదినేని సమర్పణలో, శ్రీనివాస్‌తో కలిసి చబోతున్నారు. ఈ చిత్రాన్ని ... ర్పణలో, కళ్యాణ చక్రవర్తి మంథిన, భాను కిరణ్ ప్రతాప, విజయ్ కృష్ణ లింగమనేని, ఉమేష్ బన్సల్ సప్తస్వ మీడియా వర్క్స్, పిఓవి స్టోరీస్, జీ స్టూడియోస్ బ్యానర్ల పై నిర్మించారు. ఫరియా అబ్దుల్లా, మానస చౌదరి కథానాయికలుగా నటించారు. ఈ చిత్రం ట్రైలర్, విభిన్నమైన ప్రమోషనల్ సాంగ్ ప్రాజెక్ట్ పై అంచనాలను పెంచాయి. ఈ రోజు సెకండ్ సింగిల్ 'బ్రైడ్ సాంగ్'ను విడుదల చేశారు. ఈ లేటెస్ట్ సింగిల్‌ను ప్రీవెడ్డింగ్ సెలబ్రేషన్ మూడ్‌ను ఫ్రెష్‌గా, ఫన్‌తో నింపేలా రూపొందించారు. పెళ్లి ముందు ప్రతి క్షణాన్ని ఆస్వాదిస్తున్న వధువు భావాలను అందంగా ప్రజెంట్ చేస్తోంది. సాధారణంగా కనిపించే సింపుల్ ప్రెజెంటేషన్‌కు భిన్నంగా, ఈ పాటలో వధువును బోల్డ్‌గా, స్టైలిష్‌గా, ఫుల్ ఆఫ్ లైఫ్‌గా చూపించారు. సంగీత దర్శకుడు స్వీకర్ ట్రెండీ బీట్స్‌తో పాటు ఫెస్టివ్ ఫ్లేవర్‌ను అద్భుతంగా మేళవించారు. ఆయన పాడిన ఇంగ్లీష్ పార్ట్స్, శ్రీమణి రాసిన ఎనర్జిటిక్ తెలుగు లైన్స్ కలిసి ఈ పాటకు కూల్, కాంటెంపరరీ టచ్‌ను ఇచ్చాయి. ఈ లిరిక్స్‌లో నేటి వెడ్డింగ్ హంగామా, సెల్ఫీలు, రీల్స్, గ్లామ్ టచెస్, వైరల్ అవ్వాలనే ఎగ్జైట్‌మెంట్ స్పష్టంగా కనిపిస్తాయి. ఫారియా తన ఎనర్జిటిక్ మూవ్స్, ఎక్స్‌ప్రెసివ్ పెర్ఫార్మెన్స్‌తో స్క్రీన్‌పై మెరిసింది. బ్రైడల్ జాయ్‌ను ఎంతో సహజంగా క్యారీ చేస్తుంది. ఈ పాటకు మరింత వైబ్రెన్సీ తీసుకొచ్చింది మనీషా ఈరబత్తిని వాయిస్. ఆమె రిఫ్రెషింగ్ వోకల్స్ ఈ సాంగ్‌ను వెంటనే ప్లేలిస్ట్‌లో పెట్టేలా చేస్తాయి.

## రామాయణ ఫస్ట్ గ్లింప్స్ లాంచ్



ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన చిత్ర నిర్మాణాలలో ఒకటైన రామాయణం వెనుక ఉన్న నిర్మాత, ఫిలిం మేకర్ నమిత్ మల్హోత్రా, కథనంలో అత్యంత చిరస్థాయిగా నిలిచిపోయే పాత్రల లో ఒకటైన 'రామ'ని ఒక ప్రత్యేక టీజర్ ద్వారా పరిచయం చేస్తున్నారు. ఈ టీజర్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు రాముడిగా రణబీర్ కపూర్ తొలిసారిగా కనిపిస్తున్నారు.

## పెద్ది పెహల్వాన్ పోస్టర్ రిలీజ్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మోస్ట్ ఎవైటెడ్ పాన్‌ఇండియా యాక్షన్ డ్రామా 'పెద్ది' హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. మొదటి రెండు పాటలకు, ఇప్పటివరకు విడుదలైన రెండు గ్లింప్స్‌లకు వచ్చిన అద్భుతమైన స్పందనతో దేశవ్యాప్తంగా భారీ హైప్‌ను సృష్టిస్తోంది. ముఖ్యంగా, రామ్ చరణ్ పుట్టినరోజు ప్రత్యేక గ్లింప్స్ స్ట్రాంగ్ ఇంపాక్ట్ క్రియేట్ చేసింది. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో, వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మించిన ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నారు. హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని, మేకర్స్ ఒక శక్తివంతమైన కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో రామ్ చరణ్ తన కెరీర్‌లోనే మోస్ట్ ఇంటెన్స్, ఆధ్యాత్మికత తో కూడిన అవతార్‌లో కనిపిస్తున్నారు.

## లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ
### ఈ నెల 10న రిలీజ్




వరుస బ్లాక్‌బస్టర్ విజయాలతో అలరిస్తున్న యంగ్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ హీరోగా, విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో రూపొందిన క్రేజీ లవ్ స్టోరీ 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'. ఈ చిత్రాన్ని నయనతార నిర్మించగా, కృతి శెట్టి హీరోయిన్‌గా నటించారు. ఈ చిత్రంలో ఎస్.జె. సూర్య, యోగి బాబు కీలక పాత్రలు పోషించారు.

హీరో రానా దగ్గుబాటి ఈ సినిమా తెలుగు టీజర్‌ను లాంచ్ చేశారు. "ప్రపంచం ఎక్కడికో వెళ్లిపోయింది... మనం ఇప్పుడు 2040లో ఉన్నాం. కానీ ఒకడు లేని ఒక విషయాన్ని ఉందని అంటున్నాడు" అనే వాయిస్‌తో ప్రారంభమైన టీజర్ క్రేజీగా ఆకట్టుకుంది.

"లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అనేది ఇంకా ఉంది ఈ అమ్మాయిని చూడగానే అర్థమైంది" అనే డైలాగ్‌తో ప్రదీప్ రంగనాథన్ ఎంట్రీ, కృతి శెట్టిని వర్షంలో కలిసే సన్నివేశం ఇద్దరి మధ్య కెమిస్ట్రీ చాలా ఫ్రెష్‌గా కనిపించింది. ఎస్.జె. సూర్య ఎంట్రీ టీజర్‌కు మరో హైలెట్‌గా నిలిచింది. "లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ" అని ఆయన చెప్పే డైలాగ్ ఆకట్టుకుంది.

దర్శకుడు విఘ్నేష్ శివన్ ఈ క్రేజీ లవ్ స్టోరీని ఫ్యూచరిస్టిక్ వరల్డ్ బ్యాక్‌డ్రాప్‌లో డిజైన్ చేయడం, వరల్డ్ బిల్డింగ్ చాలా కొత్తగా అనిపించింది. అనిరుధ్ రవిచందర్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, రవి వర్మన్ కెమెరా వర్క్ నెక్స్ట్ లెవల్‌లో ఉన్నాయి. మొత్తంగా టీజర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది.

## శ్రీనివాస మంగాపురం
### ఫస్ట్ లుక్ రిలీజ్



RX 100, మంగళవారం చిత్రాలలో ప్రేక్షకులు, విమర్శకుల ప్రశంసలు అందుకున్న దర్శకుడు అజయ్ భూపతి, ప్రస్తుతం 'శ్రీనివాస మంగాపురం' ప్రాజెక్ట్‌కి దర్శకత్వం వహిస్తున్నారు. సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు సోదరుడి కుమారుడు జయ కృష్ణ ఘట్టమనేని ఈ సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు. రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని ఈ చిత్రంలో హీరోయిన్ గా నటిస్తున్నారు. కలెక్షన్ కింగ్ మోహన్ బాబు ఈ చిత్రంలో కీలక పాత్రలో కనిపించనున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి నవరసరాయ డా. నరేష్ వికే ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో నరేష్ స్వాతంత్ర బాబు పాత్ర పోషిస్తున్నారు. ఒక చేతి లో బాటిల్ మరో చేతిలో టేప్ రికార్డర్ పట్టుకొని డాన్స్ వైబ్ లో కనిపించిన నరేష్ లుక్ ఆకట్టుకుంది. ఈ పాత్ర ఆయన కెరీర్ లో మరో బెంచ్ మార్క్ క్యారెక్టర్ గా ఉండబోతుంది. అగ్ర నిర్మాత అశ్విని దత్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. నిర్మాత పి కిరణ్ నిర్మిస్తున్న శ్రీనివాస మంగాపురం ఇప్పటికే విడుదలైన టైటిల్ రివీల్, ఆకట్టుకునే ఫస్ట్ లుక్ పోస్టర్లు ప్రేక్షకుల్ల ఆసక్తిని రేకెత్తించాయి.

## బైకర్ ఆడియన్స్‌కు ఎమోషనల్‌గా
# కనెక్ట్ అవుతుంది



చార్మింగ్ స్టార్ శర్వా మోస్ట్ ఎవైటెడ్ స్పోర్ట్స్ డ్రామా బైకర్. మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో రాజశేఖర్ పవర్ ఫుల్ పాత్రని పోషించారు. అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో ప్రతిష్టాత్మక బ్యానర్ UV క్రియేషన్స్ నిర్మాణంలో భారతదేశపు మొట్టమొదటి కంప్లీట్ మోటోక్రాస్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా ఇప్పటికే హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ఏప్రిల్ 3న ఈ సినిమా థియేటర్ల లోకి రానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ మాళవిక నాయర్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలని పంచుకున్నారు.

**బైకర్ జర్నీ ఎలా స్టార్ట్ అయ్యింది?**

2024 ఏప్రిల్‌లో కథ విన్నాను. చాలా నచ్చింది. దర్శకుడు అభిలాష్ చాలా ఫ్రెష్ కంటెంట్ ఉన్న క్యారెక్టర్ రాశారు. బైకర్ ఇండియాలో ఫస్ట్ మోటోక్రాస్ ఫిల్మ్. ఈ సినిమా కోసం చాలా ఎక్సైట్‌గా ఉన్నాను. ఇది హై అడ్రినలిన్, హై ఆక్టేన్ ఫిల్మ్. మ్యూజిక్ అద్భుతంగా ఉంటుంది.

**ఇందులో మీ క్యారెక్టర్ ఎలా ఉంటుంది?**

నా క్యారెక్టర్ గురించి ఎక్కువగా రివీల్ చేయకూడదు. ఇందులో నా పాత్ర కథకు బ్రిడ్జ్‌లా ఉంటుంది. ఒక స్పోర్ట్స్‌మన్ జీవితంలో ఫ్యామిలీ రోల్ చాలా కీలకం. ఇందులో వైఫ్ అండ్ హస్బెండ్ ఏ నిర్ణయం అయినా కలిసి తీసుకుంటారు. కథ మూడు టైమ్‌లైన్స్‌లో సాగుతుంది. నా పాత్ర కూడా ఇవాల్వ్ అవుతూ ఉంటుంది. పెర్ఫార్మెన్స్‌కు స్కోప్ ఉన్న మంచి ఇంపాక్ట్‌ఫుల్ రోల్ చేశాను.

**శర్వా గారితో వర్క్ చేయడం ఎలా అనిపించింది?**

రియల్ లైఫ్‌లో మేమిద్దరం కూడా ఇంట్రోవర్ట్స్. పెద్దగా మాట్లాడుకోము. కానీ సినిమాలో క్యారెక్టర్ల పరంగా మంచి కెమిస్ట్రీ కుదిరింది. శర్వా గారు చాలా స్పాంటేనియస్‌గా ఉంటారు. ప్రమోషన్స్‌లో ఇంకా బాగా ఇంటరాక్ట్ అయ్యాం.

**బైకర్‌ను F1తో పోలుస్తున్నారు కదా?**

మోటోక్రాస్ స్పోర్ట్స్‌ను షూట్ చేయడం చాలా కష్టం. మ్యూజిక్ టెక్నికల్‌గా ఖచ్చితంగా మంచి హై ఇస్తుంది. అలాగే ఇందులో మంచి ఫ్యామిలీ ఎమోషన్స్ కూడా ఉన్నాయి. ఫాదర్‌సన్ ఎమోషన్ ప్రత్యేకంగా ఉంటుంది. ఈ సినిమాలో ప్రతి పాత్రకు మంచి ఆర్క్ ఉంటుంది.

**ఇందులో డ్యాన్స్ నంబర్స్ ఉన్నాయా?**

ఇందులో "ప్రెట్టీ బేబీ" సాంగ్ ఉంది. శేఖర్ మాస్టర్ చాలా బ్యూటిఫుల్‌గా కొరియోగ్రఫీ చేశారు. ప్రేక్షకులు చాలా ఎంజాయ్ చేస్తారు.

**రాజశేఖర్ గారితో మీకు సీన్స్ ఉన్నాయా?**

ఉన్నాయి. ఆయనతో కలిసి నటించడం మంచి అనుభవం. అంత సీనియర్ అయినప్పటికీ సెట్లో అందరితో చాలా క్లోజ్‌గా ఉంటారు. మనం ఏదైనా చెబితే వింటారు. అది చాలా గొప్ప గుణం. చాలా కైండ్ పర్సన్.

**మ్యూజిక్ గురించి చెప్పండి?**

ఈ సినిమాలో మ్యూజిక్ చాలా స్పెషల్‌గా ఉంటుంది. జిబ్రాన్ గారు నేపథ్య సంగీతం అద్భుతంగా చేశారు. ప్రతి క్యారెక్టర్‌కు గుర్తుపెట్టుకునే సౌండ్‌ట్రాక్స్ కంపోజ్ చేశారు. మ్యూజిక్ పరంగా మంచి హై ఉంటుంది.

## హాయిగా నవ్వుకునేలా
# రాకాస



నిహారిక కొణిదెల జీ స్టూడియోస్ సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఉమేష్ కుమార్ బన్సాల్‌తో కలిసి 'రాకాస' చిత్రాన్ని నిర్మించారు. ఈ మూవీకి మానస శర్మ దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 3న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో మంగళవారం నాడు ప్రీ రిలీజ్ మ్యాడ్ నెస్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో.. నిహారిక కొణిదెల మాట్లాడుతూ .. "'రాకాస' కోసం షూటింగ్ చేసిన దాని కంటే ప్రమోషన్స్ మీద ఎక్కువగా ఫోకస్ పెట్టాం. మేం మంచి సినిమాని తీశాం. మేం తీసిన మూవీని జనాల వరకు తీసుకెళ్లాలని ఫిక్స్ అయ్యాం. అందుకే ఈ రేంజ్‌లో ప్రమోషన్స్ చేస్తున్నాం. గ్లింప్స్ నుంచే 'రాకాస' మీద భారీ హైప్ ఏర్పడింది. ఫస్ట్ ఫ్రేమ్ నుంచి చివరి ఫ్రేమ్ వరకు క్లీన్ కామెడీతో ఫ్యామిలీ అంతా కలిసి చూసి హాయిగా నవ్వుకునేలా, ఎంటర్టైన్ అయ్యేలా మా 'రాకాస' ఉంటుంది. మా కాన్సెప్ట్ చాలా కొత్తగా ఉంటుంది. పూర్తిగా హారర్, థ్రిల్లర్ అని కాకుండా.. కామెడీ, ఫ్యాంటసీ, అడ్వెంచర్ ఇలా అన్ని రకాల అంశాలతో ఉంటుంది. అనుకున్న బడ్జెట్‌లోనే మూవీని తీశాం. కానీ సమ్మెలాంటి కారణాలతో ఆర్టిస్టుల డేట్స్ కొన్ని సమస్యలు వచ్చాయి. సోషల్ మీడియాని వాడని రామ్ చరణ్ అన్న దగ్గరకే మా 'రాకాస' రీచ్ అయిందంటే మా మూవీ జనాల వరకు వెళ్లిందని నాకు అర్థమైంది. నాకు ఎప్పుడూ కూడా డిఫరెంట్ జానర్‌లో సినిమాలు తీయాలని ఉంటుంది. కానీ ఏ జానర్‌లో మూవీ తీసినా కూడా అందులో ఎంటర్టైన్మెంట్ కంపల్సరీ ఉండాలని అనుకుంటాను. 'రాకాస'లో కావాల్సినంత ఎంటర్టైన్మెంట్ ఉంటుంది' అని అన్నారు.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Sri Rama Avadutha Offset, 9-2-57, Mayuri Centre, Khammam - 507001 and Published from H. No. 10-6-77, Mamillagudem, Khammam - 507001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. APTEL/2013/53008. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.